

నూరేళ్ల అమరత్వం నింగినంటే చైతన్యం

లెనిన్.. !
ఎవరూ లేని ఎవరూ రాని ఎడారిలోకపు పరాధీనతలో
ఎగసిపడే మానవతార్ఝురి పరుగు నీ ఆలోచనల సారం
కలలు కళలు స్వరాలు నరాలు తడారి ఆవిరులై పొగచూరిన క్షణాన
పచ్చని చివుళ్ల కళావరణాన్ని వర్షించిన మేఘం నీ అక్టోబరు విప్లవం
నీ నీడను పడగొట్టిన శిథిల సమాజపు ఘోర విధ్వంసాన
హృదయం నిండా నీవై ఎగురుతున్న జెండావై
మా చూపులకు రూపం కడుతూనే ఉన్నావు
లెనిన్! నువు మసోలియమ్‌లో కాదు... మా మనసుల్లో..!

నవతెలంగాణ

అనుదినం... జనస్వరం సమగ్ర తెలుగు దినపత్రిక ఆదివారం 21-1-2024

సంపుటి : 10 సంచిక : 20 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు + (వెబ్‌లో సోపతి) వెల : 8.00

కరెంటు బిల్లులు కట్టొద్దు

అధికారులు అడిగితే సీఎం మాటలు గుర్తు చేయండి

- ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- రేవంత్ ఓ అహంకారి, కాంగ్రెస్‌కు ఓ ఏక్‌నాథ్ షిండే అంటూ ఎద్దేవా
- ఆయనలాంటి వారిని వేల మందిని చూశామంటూ ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గృహజ్యోతి పథకం కింద ప్రజలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామంటూ కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిందనీ... అందువల్ల ఈనెల (జనవరి)లో ఎవరూ కరెంటు బిల్లులు కట్టొద్దంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. అధికారులెవరైనా వచ్చి బిల్లుల గురించి అడిగితే, ఎలక్షన్లలో సీఎం రేవంత్ చెప్పిన మాటలను వారికి గుర్తు చేయాలంటూ కోరారు. 'ఉచిత విద్యుత్తును అమలు చేయకపోతే మా నాయకురాలు సోనియా గాంధీయే బిల్లులు కడతారు...' అంటూ సీఎం మొన్నటి ఎన్నికల్లో చెప్పారనీ, ఇప్పుడు అవే మాటలను తిరిగి కాంగ్రెస్‌కు వినిపించాలంటూ ఆయన ఎద్దేవా చేశారు.

పార్లమెంటు సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలనుద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, సీఎం రేవంత్‌పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతులో బొంద పెడతామని సీఎం మాట్లాడుతున్నారు.. ఈ సంగతిని ...13లో

ఆ పులి కోసం

మా దగ్గర బోనుంది

మా కార్యకర్తలే చెట్టుకు వేలాడగడ్తారు

ఒక కుటుంబం చెరనుంచి తెలంగాణను విముక్తి చేశాం

- రాష్ట్ర పునర్నిర్మాణంలో అందరి భాగస్వామ్యం అవసరం
- 60 ఏండ్లలో రూ.72 వేల కోట్లు, ఈ పదేండ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పు
- 26 తర్వాత ఇంద్రవెల్లి నుంచి రాష్ట్రమంతా సుడిగాలి పర్యటన
- ఆర్థిక సంక్షోభం నుంచి అభివృద్ధి పథంవైపు తెలంగాణ
- పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ నిషాన్ లేకుండా పాతిపెడతా : లండన్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'పులి అంట ఇంట్ల పండుకున్నదంట. లేచి వచ్చిందంట. నేను కూడా దానికోసమే చూస్తున్న బిడ్డా. మా దగ్గర బోనుంది. మా దగ్గర వల ఉంది. రమ్మను చెట్టుకు వేలాడగడ్తారు. ఆ బాధ్యత మా కార్యకర్తలు తీసుకుంటరు. ఆ మాటలేంది? ఆ అహంకారమేందీ? ఆ బలుపేంది? అధికార మదం దిగినట్టు లేదు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆ బలుపును దించే పని మా కార్యకర్తలు తీసుకుంటరు. ప్రజలు తీర్పు ఇచ్చారు. ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దొరల పాలన వద్దు. ప్రజా పాలన కావాలంటూ ప్రజలు ఆశీర్వదించారు. అందరి ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశీ పర్యటనలో భాగంగా శనివారం ఆయన లండన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాక సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిన భారతీయులందరికీ ధన్యవాదాలు చెప్పారు. మిత్రుడు వేణుగోపాల్, సుధాకర్, వారి బృందం ...5లో

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై

కేరళ ఆందోళన

ఫిబ్రవరి 8న జంతర్ మంతర్ వద్ద సీఎం సహా ప్రజా ప్రతినిధులంతా భారీ ధర్నా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తమ రాష్ట్రం, రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కేరళలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ఆందోళనకు పూనుకుంది. అలాగే బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించనుంది. ఫిబ్రవరి 8న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో సహా రాష్ట్ర మంత్రులు, ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఎల్‌డీఎఫ్ కన్వీనర్ ఈపీ జయరాజన్ కాంగ్రెస్, ఇతర యూడీఎఫ్ భాగస్వామ్య పార్టీలను ధర్నాలో పాల్గొనవలసిందిగా కోరారు. కేంద్రం రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నదనీ, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నదని విమర్శించారు. కాగా, ...13లో

సివిల్ సప్లయిస్‌ను నిర్వీర్యం చేశారు

2014లో రూ.3వేల కోట్లున్న అప్పు నేడు రూ.58,860 కోట్లకు చేరింది

- కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి ఈ ప్రభుత్వం అప్పగించలేదు
- మేడిగడ్డ డిజైన్‌లోనే భారీ లోపం ఉంది
- డిటెక్టివ్ మైండ్ సెట్ ఉన్నోళ్లే కరెంట్ బిల్లు కట్టొద్దంటారు
- బీఆర్ఎస్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాల శాఖను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందనిఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పౌరసరఫరాలు, సాగునీటి శాఖలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2014లో రూ.3వేల కోట్లున్న అప్పు 2024లో రూ.58,860 కోట్లకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.387 కోట్ల బకాయిలుండగా ప్రస్తుతం అవి రూ.14,354 కోట్లకు పెరిగాయని చెప్పారు. 2014కు ముందున్న ప్రభుత్వాలు రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడానికి ఆ శాఖకు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించగా, గత ప్రభుత్వం నిధులివ్వకుండా రుణాలు తీసుకోమని గ్యారంటీ ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. కానీ రైతులు పండించిన ధాన్యం తామే కొనుగోలు చేస్తున్నట్టు ...13లో

రెండు దేశాల ఏర్పాటే

శాశ్వత పరిష్కారం

గాజా సంక్షోభంపై అలీనోద్యమ సమావేశాల్లో భారత విదేశాంగ మంత్రి జై శంకర్

కంపాలా : గాజాలో ప్రస్తుతం కొనసాగుతున్న హింసాకాండను చూస్తుంటే అక్కడి సంక్షోభానికి సుస్థిరమైన, శాశ్వతమైన పరిష్కారాన్ని కనుగొనాల్సిన అవసరం వుందని స్పష్టమవుతోందని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు. ఉగాండా రాజధాని కంపాలాలో జరుగుతున్న నామ్ సదస్సులో ఆయన మాట్లాడారు. గాజాలోని హింస, ఘర్షణలు పశ్చిమాసియాలోని ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధంపై నామ్ సదస్సులో ...13లో



జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ప్రతీ 15 ఏండ్లకు

ఈవీఎంలకే రూ. పదివేల కోట్లు

- రాజ్యాంగంలోని ఐదు ఆర్టికల్స్‌కు సవరణలు
- కేంద్రానికి ఎన్నికల కమిషన్ సమాచారం

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలు (లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు) నిర్వహిస్తే కొత్త ఈవీఎంలు కోసం ప్రతి 15 ఏండ్లకు రూ.పదివేల కోట్లు అవసరమవుతాయని కేంద్ర ఎన్నికల సంఘం అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వానికి పంపిన ఒక సమాచారంలో ఈ విషయాన్ని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈవీఎంల జీవిత కాలం 15 ఏండ్లు అని, జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఒక సెట్ ఈవీంఎలను మూడు సార్లు ఎన్నికల్లో వినియోగించుకోవచ్చునని తెలిపింది. ఎన్నికల సంఘం అంచనా ప్రకారం ఈ ఏడాదిలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం 11.80 లక్షల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ జమిలి ఎన్నికలు జరిగితే ప్రతీ పోలింగ్ స్టేషన్‌లోనూ రెండు సెట్ల ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకటి లోక్‌సభ స్థానానికి, మరొకటి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ప్రతీ ఈవీఎంకు కంట్రోల్ యూనిట్, (సీయూ), బ్యాలెట్ యూనిట్ (బీయూ), ఓటర్-వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ) మెషిన్ జత చేయాల్సి ఉంటుంది. అయితే గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా ప్రతీ పోలింగ్ స్టేషన్‌లోనూ సీయూ, బీయూ, వీవీపీఏటీలు అదనంగా అవసరమని ఈసీ పేర్కొంది. ఈ వివరాలను జమిలి ఎన్నికలపై కేంద్ర న్యాయ శాఖ పంపిన ప్రశ్నావళికి ఇచ్చిన సమాధానంలో ఎన్నికల సంఘం తెలిపింది. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే కనీసం 45,75,100 బీయూలు, 33,63,300 సీయూలు,





36,62,600 వీవీపీఏటీఎస్‌లు అవసరమని ఎన్నికల సంఘం పేర్కొంది. 2023 ప్రారంభంలో బీయూ ధర రూ.7,900, సియు ధర రూ. 9,800, వీవీపీఏటీ ధర రూ. 16,000గా ఉంది. ఈవీఎంల ధరతో పాటు పోలింగ్, భద్రతా సిబ్బంది కోసం, ఈవీఎంలు దాచి ఉంచడానికి, వాహనాలకు, రవాణాకు అదనంగా మరింత వ్యయం అవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. అలాగే అన్ని అనుకూలంగా ఉన్నా 2029లో మాత్రమే జమిలి ఎన్నికలు నిర్వహించగలమని ఎన్నికల కమిషన్ తెలిపింది. అలాగే జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగంలోని ఐదు ఆర్టికల్స్‌కు సవరణలు చేయాల్సి ఉంటుందని కూడా ఎన్నికల కమిషన్ కేంద్రానికి తెలిపింది. పార్లమెంటు సభల కాలవ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 83, లోక్‌సభను రాష్ట్రపతి రద్దు చేయడానికి సంబంధించిన ఆర్టికల్ 85, రాష్ట్ర శాసనసభల కాలవ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 172, రాష్ట్రాల శాసనసభల రద్దుకు సంబంధించిన ఆర్టికల్ 174, రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి సంబంధించిన ఆర్టికల్ 356కు సవరణ చేయాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ తెలిపింది. అలాగే పార్టీ ఫిరాయింపులపై అనర్హతకు సంబంధించిన రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో కూడా కొన్ని అవసరమైన మార్పులు చేయాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ తెలిపింది.

ప్రాణ ప్రతిష్ఠ రోజు

సెలవెందుకు?

కోర్టును ఆశ్రయించిన మహారాష్ట్ర విద్యార్థులు



ముంబయి : అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 22న సెలవు ప్రకటిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను నలుగురు విద్యార్థులు బాంబే హైకోర్టులో సవాలు చేశారు. ఈ విద్యార్థులు మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ న్యాయ కళాశాల, ముంబయి-నిర్మా న్యాయ విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తున్నారు. సెలవుకు సంబంధించి ఈ నెల 19న జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేయాలని వారు అభ్యర్థించారు. సెలవుల ...13లో

మేడారం జాతరకు

మరో రూ.30 కోట్లు

జీవో 59 పేరిట ప్రభుత్వ భూముల కబ్జా.. చర్యలకు మంత్రుల ఆదేశం



- కాళోజీ కళాక్షేత్రం మూడు నెలల్లో పూర్తి..
- కరెంటు బిల్లులు త్వరలోనే మాఫీ
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి
- సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మేడారం జాతరను ఘనంగా నిర్వహించడానికి ఇప్పటికే రూ.75 కోట్లను విడుదల చేశామని, త్వరలో మరో రూ.30 కోట్లను మంజూరు చేయనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హన్మకొండ పట్టణంలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 6 జిల్లాల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితోపాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, విప్ డాక్టర్ రామచంద్రునాయక్, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు మాస్టర్‌ప్లాన్ కోసం సేకరించిన భూములు, వేసిన రోడ్లతో పాటు కాళోజీ కళాక్షేత్ర పనులనూ స్వయంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఆర్భాటంగా చేపట్టిన ప్రాజెక్టులు, పనులు, వాటి పురోగతి, వారిచ్చిన జీవోలు, అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి ...13లో

వింగ్స్ ఇండియాకు సందర్శకుల తాకిడి

- అలరించిన విమాన విన్యాసాలు



నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన వింగ్స్ ఇండియా -2024 ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. చివరి రెండు రోజులు సందర్శకులను అనుమతించడంతో శనివారం సందడి నెలకొంది. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు ఇక్కడి విమానాలు చూసి మురిసిపోయారు.

ఆదివారం (నేడు) కూడా సందర్శకులను అనుమతిస్తున్నారు. ప్రదర్శనలో ప్రతి విమానం పక్కన 30 అడుగుల మేర బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉంచిన విమానాలను చూడటానికి ఆసక్తిని కనబర్చడంతో పాటుగా.. హెలికాప్టర్ విన్యాసాలు అబ్బురపర్చాయి. విమానాలకు సంబంధించిన వివరాలను, ప్రత్యేకతలను ఆయా సంస్థల ప్రతినిధులు వివరిస్తున్నారు.

శివమణితో సంగీతోత్సవం

విమానాల ప్రదర్శన మాత్రమే కాకుండా వినోదం కోసం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శివమణి బృందంతో సంగీతోత్సవం ఏర్పాటు చేశారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 'కలంకారి' విమానం నేపథ్యంగా వీక్షకులను తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ బ్రాండ్‌కు చెందిన సరికొత్త బోయింగ్ 737-8 ఎయిర్‌క్రాఫ్ట్, విటి-బిఎక్స్‌హెచ్, కలంకారితో కూడిన టార్మిక్ వేదికగా శివమణి తన ప్రదర్శన ఇచ్చారు. భారతదేశ కళాత్మక ప్రతిభ, వైవిధ్యాన్ని వేడుక చేయడం పట్ల సంతోషిస్తున్నామని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సిద్దార్థ బుటాలియా పేర్కొన్నారు. జనవరి 21తో ముగియనున్న ఈ షోకు బుక్‌మై షోలో ముందుగా టికెట్లు కొనుగోలు చేసుకోవడానికి వీలుంది.

ప్రవేశ రుసుం ఒక్కొక్కరికి రూ.750గా నిర్ణయించారు. మూడేళ్లలోపు పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నారు.

ఇథనాల్‌తో ఆహార ధాన్యాల కొరత

- పర్యావరణానికి పెను ప్రమాదం
- చిత్తనూర్ ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే మూసేయాలి
- చర్చాగోష్టిలో పలువురు వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆహార పంటలతో ఇథనాల్ ఇంధనాన్ని తయారు చేయడం వల్ల భవిష్యత్‌లో వాటి కొరత ఏర్పడే అవకాశముందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఆహార పంటలతో ఇథనాల్ ఇంధనం తయారు-సాధ్యత, సుస్థిరత, శాస్త్రీయత" అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడుతూ చిత్తనూర్‌లో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల అక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గత రెండేండ్లుగా స్థానికులు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోక పోగా అమాయకులపై అక్రమ కేసులు పెట్టిందని ఆరోపించారు. పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన ఈ పరిశ్రమను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి డాక్టర్ ఈఏఎస్ శర్మ మాట్లాడుతూ ఇథనాల్ ఇందనం తయారీ కోసం దేశంలో ఇప్పటి వరకూ లక్ష మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను ఉపయోగించారని అన్నారు. ఫలితంగా వాటి ధరలు ఆకాశానంటుతున్నాయనీ, ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇథనాల్ లక్ష్యం చేరుకోవాలంటే దేశంలో ఆహార సంక్షోభం తప్పదని హెచ్చరించారు. లీటర్ పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపి అమ్మకాలు సాగించడం ద్వారా దిగుమతులు తగ్గించాలనే లక్ష్యంతో కేంద్రం 2025 ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఒక లీటర్ ఇథనాల్ ఇంధనం తయారు చేసేందుకు 2.22 కేజీల మొక్కజొన్నలు లేదా బియ్యం, 3 గాలన్ల ఇథనాల్ కోసం 29,100 గాలన్ల నీరు అవసరమవుతుందని తెలిపారు. సర్కార్ ఎంచుకున్న లక్ష్యం పూర్తి కావాలంటే 1,643 కోట్ల టన్నుల ఆహార దాన్యాలు అవసరమవుతాయని చెప్పారు. అంత మొత్తంలో వాటిని వినియోగిస్తే భవిష్యత్‌లో ఆహారంతో పాటు సాగునీటికి కష్టాలు తప్పవని అన్నారు. ప్రముఖ శాస్త్ర వేత్త బాబురావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నాయని అన్నారు. దేశంలోని 10 శాతం మంది ప్రజల విలాసవంతమైన జీవితం కోసం 90 శాతం మందికి హాని చేస్తున్నారని ఆరోపించారు. బొగ్గు, పెట్రోల్ తదితర శిలాజ ఇంధనాల వల్ల వెలువడుతున్న కర్బన ఉద్గారాలతో భూతాపం పెరుగుతోందని చెప్పారు. 2030 వరకు పర్యావరణంలో భారీ మార్పులు సంభవిస్తాయనీ, ఫలితంగా మానవ మనుగడ కష్టమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వంతో పాటు ప్రజలు సైతం స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ అభివృద్ధి చేందిన దేశాలు మురికి వస్తువులను (పర్యావరణానికి హాని చేసే ఫార్మా మొదలగునవి) పేద దేశాల్లో ఉత్పత్తి చేయించి వాటిన తమ అవసరాల కోసం కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో రైతు స్వరాజ్యవేదిక నాయకులు కన్నెగంటి రవి, ఓయూ ప్రొఫెసర్లు ఆమంచి నాగేశ్వర్ రావు, కేవై. రత్నం, పర్యావరణ వేత్త కేజే.రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య రంగానికి గొడ్డలిపెట్టు జీవో 142

- లోపాభూయిష్టంగా ఉన్న జీఓను రద్దు చేయాలి
- జీవో రద్దు కమిటీ సభ్యుల డిమాండ్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వైద్య, ఆరోగ్య రంగానికి గొడ్డలి పెట్టుగా ఉన్న జీవో 142ను రద్దు చేయాలని జీవో రద్దు కమిటీ సభ్యులు, ట్రేడ్ యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య రంగం పటిష్టత, మానవ వనరులను హేతుబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 142 లోపభూయిష్టంగా ఉందన్నారు. జీవోను రద్దు చేయాలని శనివారం కోఠి డీహెచ్ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు విన్నవించారు. దీనికి డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని యూనియన్లు, క్యాడర్ అసోసియేషన్లు ఏకతాటి పైకి వచ్చి గత ప్రభుత్వం పైకి ఒత్తిడి తీసుకొచ్చి జీవోను తాత్కాలికంగా ఆపివేసినట్టు చెప్పారు. అయితే, ఇటీవల కొంతమంది అధికారులు ఈ జీవోపై మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ ఈ జీవోపై అన్ని సంఘాలతో చర్చించిన తర్వాత తదుపరి గవర్నమెంట్‌కు విన్నవిస్తామని రాతపూర్వకంగా ఇచ్చారని చెప్పారు. మానవ వనరుల హేతుబద్ధీకరణ అనేది జనాభా ప్రాతిపదికన.. ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడం కోసం చేయాల్సి ఉందన్నారు. కానీ వైద్య ఆరోగ్య రంగంలో అపారమైన అనుభవం ఉన్న, క్షేత్రస్థాయిలో పనిచేసిన వైద్య ఆరోగ్య ఉన్నతాధికారుల ద్వారా, క్షేత్రస్థాయి సమాచారాన్ని, సలహాలు సూచనలు తీసుకోకుండా గత ప్రభుత్వం ఇష్టానుసారంగా ఈ జీవోను విడుదల చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4318 పోస్టులను రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. వెంటనే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారి తనకు సంబంధించిన స్పెషాలిటీ డాక్టర్లను సీనియార్టీతో సంబంధం లేకుండా జిల్లాలకు డీఎంహెచ్ఓలుగా, ఏడీపీఏ హెచ్ఓగా నియమించడం సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకమన్నారు. డిప్యూటీ డీఎండీఎం అండ్ హెచ్ఓ ఆఫీసులను, టీబీ శానిటోరియం, రాష్ట్ర స్థాయి శిక్షణా కేంద్రాలు తదితర శాఖలను ఎత్తివేయడాన్ని ఖండించారు. కొన్ని పోస్టులను అవసరం లేదని రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. 142 జీవోను రద్దు చేయని యెడల ఫిబ్రవరి 5 నుంచి ఆందోళన కార్యక్రమాల్లోకి వెళ్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్, సీఐటీయూ నాయకులు యాదానాయక్, రాబట్టు బూస్, హెచ్ వన్ యూనియన్ నాయకులు సాయి రెడ్డి, కిరణ్ రెడ్డి, మీడియా ఆఫీసర్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, కిరణ్ వెంకటేశ్వర్లు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం నాయకులు కలిముద్దీన్, శ్రీనివాస్, డాక్టర్ల అసోసియేషన్ నాయకులు వినోద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

29,30 తేదీల్లో ఢిల్లీలో ఈపీఎస్ పెన్షనర్ల ధర్నా

- ఆలిండియా కోఆర్డినేషన్ కౌన్సిల్ ఆఫ్ ఈపీఎస్ పెన్షనర్ల అసోసియేషన్స్ చైర్మెన్ ఎంఎన్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 29,30 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈపీఎస్ పెన్షనర్ల ధర్నాను జయప్రదం చేయాలని ఆలిండియా కో ఆర్డినేషన్ ఆఫ్ ఈపీఎస్ పెన్షనర్ల అసోసియేషన్స్ చైర్మెన్ ఎంఎన్ రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి తొమ్మిది నెలల కాలంలో అసోసియేషన్ కార్యక్రమాలపై నివేదికను సమర్పించారు. హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్ ఎదురుగా కృష్ణనగర్ కాలనీలో భవనాన్ని కొనుగోలు చేయాలనీ, ఉద్యమవాణిగా ఎంప్లాయీస్ వాయిస్ పత్రికని ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వాయిస్‌గా తీసుకెళ్లాని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఈ సందర్భంగా ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ ఈపీఎస్ పెన్షనర్ల హయ్యర్ పెన్షన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం సాచివేత వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. పెన్షనర్లకు ఆప్షన్ ఇవ్వడానికి ఇచ్చిన సమయం కంటే యాజమాన్యాలకు ఇచ్చే సమయాన్ని పెంచుతూపోవడం వల్ల వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని చెప్పారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29,30 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రెండు రోజుల ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ముందే సమ స్యలను పరిష్కరించాలనీ, లేదంటే ఈ ప్రభుత్వానికి ఓటు వేయెుద్దని పిలుపునిచ్చారు. "నో హైక్ ఇన్ పెన్షన్, నో ఓటు" అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించామని చెప్పారు. ఈ సమావేశంలో కోశాధికారి కె నాగేశ్వర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం రంగయ్య, ఎం నరహరి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పాస్‌పోర్ట్ తయారీ ముఠా గుట్టురట్టు

- 12 మందిని అరెస్ట్ చేసిన సీఐడీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

విదేశీయులకు నకిలీపాస్‌పోర్ట్‌లను తయారు చేసి ఇస్తున్న ముఠాను రాష్ట్ర సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ముఠాకు చెందిన ప్రధాన సూత్రధారితో పాటు మొత్తం 12 మందిని అరెస్టు చేసినట్టు సీఐడీ అదనపు డీజీ షికా గోయెల్ శనివారం వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అబ్దుస్ సత్తార్ జావేరి (50) గ్రాఫిక్స్ డిజైనర్‌గా ఆరితేరాడు. తాను డబ్బుపై వ్యామోహంతో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ నకిలీ సర్టిఫికెట్లను తయారు చేయటంతో పాటు నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులను కూడా నకిలీవి తయారు చేసి డబ్బు సంపాదించేవాడు. తర్వాత పాస్‌పోర్ట్‌లపై కన్నేసిన సత్తార్.. ఆ పాస్‌పోర్ట్‌ల కోసం అవసరమైన ధృవీకరణ పత్రాలను తయారు చేసి ప్రాసెస్ చేయటం మొదలు పెట్టారు. ముఖ్యంగా, విదేశీయుల కోసం నకిలీ పాస్‌పోర్టులను తయారు చేయటంలో ఆరితేరిన సత్తార్.. ఇందుకోసం చెన్నైకి చెందిన ఒక పాస్‌పోర్ట్ ఏజెంట్‌ను తన ముఠాలో కలుపుకున్నాడు. చెన్నై ఏజెంట్ ద్వారా శ్రీలంక శరణార్థులకు నకిలీ పాస్‌పోర్టులను తయారు చేసి ఇచ్చేవాడు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏజెంట్ల ద్వారా సేకరించి వాటికి తగిన నకిలీ ధృవీకరణ పత్రాలను తయారు చేసి హైదరాబాద్ పాస్ట్‌పోర్ట్ కార్యాలయంలో స్లాట్ తీసుకొని పాస్‌పోర్ట్ వచ్చేలా చేసేవాడు. ఇందుకు ఒక్కో పాస్‌పోర్ట్ కోసం రూ.75 వేలను సత్తార్ చెన్నై ఏజెంట్ నుంచి వసూలు చేసేవాడు. అలాగే, పాస్‌పోర్ట్‌ల వెరిఫికేషన్ కోసం కొందరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులను కూడా తన బుట్టలో వేసుకొని వెరిఫికేషన్ సజావుగా సాగేలా చూసుకునేవాడు. ఈ విధంగా ఇప్పటి వరకు సత్తార్ చెన్నై ఏజెంట్‌తో పాటు మరో 12 మందిని ముఠాగా చేసుకొని 94 నకిలీ పాస్‌పోర్ట్‌లను తయారు చేసినట్టు సీఐడీ విచారణలో బయటపడింది.

22న హైదరాబాద్‌కు
పార్లమెంటు ప్రభుత్వ హామీల కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ప్రభుత్వ హామీల కమిటీ (రాజ్యసభ) సోమవారం రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ కమిటీ అధ్యయనానికి తెలంగాణ సహా చండీఘడ్‌లను ఎంచుకున్నది. ఈ నెల 22న హైదరాబాద్‌కు ఆ కమిటీ రానుంది. రాష్ట్రంలోని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి సహా సాంకేతిక విద్యాశాఖ, ఇతర అధికారులతో భేటి అవుతుంది. రాష్ట్రంలో ఎన్ఈపీ సహా ఇతర అంశాలపై అధ్యయనం చేయనుంది. అయితే రాష్ట్రంలో ఎన్ఈపీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. ఉన్నత విద్యలో మాత్రమే పలు అంశాల్లో అమలు చేస్తున్నారు. విశ్వవిద్యాలయాలు దాదాపుగా ఎన్ఈపీని అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా అకడమిక్ క్రెడిట్‌బ్యాంక్, మల్టిపుల్ ఎంట్రీ ఎగ్జిట్, క్రెడిట్ విధానం (సీబీసీఎస్) అమలుచేస్తున్నారు.

ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటులో ముందంజలో ఉన్నాయి. ఆయా అంశాలనే ఈ కమిటీ ముందుంచే అవకాశాలున్నట్టుగా విద్యాశాఖ అధికారులు తెలిపారు.





సాధారణ స్థితికి తమ్మినేని

మెరుగుపడిన ఆరోగ్యం

- హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, కూనంనేని పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం మెరుగుపడింది. ఆయన సాధారణ స్థితికి చేరుకున్నారు. వెంటిలేటర్‌ను తొలగించడంతో సొంతంగానే శ్వాస తీసుకుంటున్నారు. దినపత్రికలు చదువుతూ గడిపారు. బీపీ, పల్స్ సాధారణ స్థితికి చేరుకున్నాయి. కిడ్నీ పనితీరు మెరుగుపడిం దనీ, గుండె కొట్టుకోవడంలో మార్పు వచ్చిందని ఏఐజీ వైద్యులు అన్నారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్న తమ్మినేనిని ఈనెల 16న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నది.

శనివారం మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆస్పత్రికి వెళ్లి తమ్మినేనిని పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని అన్నారు.

జనాభాకనుగుణంగా బస్సులను పునరుద్ధరించండి

- మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలి
- లేడీస్ స్పెషల్ బస్సులు వేయాలి : ఆర్టీసీ ఎండీకి మెమోరాండం అందజేసిన ఐద్వా



నవతెలంగాణ-సిటీబ్యూరో

జనాభాకనుగుణంగా ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని, నగరంలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు ఏ.పద్మ, కార్యదర్శి కె.నాగలక్ష్మి, సహాయ కార్యదర్శి పి.విమల, కోశాధికారి వై.వరలక్ష్మి తదితరులు కలిశారు. నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని, కొత్త బస్సులను వేయాలంటూ మెమోరాండం అందజేశారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం సౌకర్యం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నదని, అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో 1000 బస్సులను తగ్గించిందని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. బస్సులను తగ్గించడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులల్లో రద్దీ పెరిగిందన్నారు. నగర శివారు ప్రాంతాలు, కాలనీ వాసులకు బస్సు సర్వీసులు అందడం లేదన్నారు. నగర శివారు ప్రాంతాల వారికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రయివేటు వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పించాలని, ట్రిప్‌లను పెంచాలని కోరారు. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో రద్దయిన బస్సులను పునరుద్ధరించడంతోపాటు కొత్త బస్సులను వేయాలన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా లేడీస్ స్పెషల్ బస్సులను సైతం వేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అసోంలో రాహుల్ యాత్ర

బ్యానర్లు ధ్వంసం

దిస్‌పూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ న్యాయ్ యాత్రకు సంబంధించిన బ్యానర్లను అస్సాంలో కొందరు దుండగులు ధ్వంసం చేశారు. అస్సాంలో మూడు రోజుల పాటు కొనసాగిన రాహుల్ యాత్ర శనివారం అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించింది. కాగా అస్సాంలోని ఉత్తర లఖింపూర్‌లో యాత్ర కోసం ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులను శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారని అస్సాం పీసీసీ మీడియా కమిటీ చీఫ్ భరత్ నారహ్ తెలిపారు. యాత్ర విజయం సాధిస్తుండడంతో ఓర్వలేని కొందరు వ్యక్తులు ఈ దురాగతానికి పాల్పడ్డారని చెప్పారు. ఓ పార్టీకి చెందిన బ్యానర్లు, పోస్టర్లను ప్రత్యర్థి పార్టీలు ధ్వంసం చేయడం అస్సాం చరిత్రలో మునుపెన్నడూ జరగలేదని అన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం యాత్రకు అడ్డంకులు సృష్టిస్తోందని, దానిలో పాల్గొనకుండా ప్రజలను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు.

'పడవల్లో బ్యాటరీలను తొలగించారు. పెట్రోల్ బంకుల్లో నిల్వలు లేకుండా చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రజలు యాత్రకు రాకుండా నిలువరించాలని ప్రయత్నించారు' అని నారహ్ చెప్పారు. అయితే ఎన్ని అడ్డంకులు సృష్టించినా యాత్ర విజయాన్ని అడ్డుకోలేకపోయారని అన్నారు. కాగా ఉత్తర లఖింపూర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకుల చిత్రాలతో ఏర్పాటు చేసిన పోస్టర్లను దుండగులు ధ్వంసం చేస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాలలో పార్టీ పోస్ట్ చేసింది.

అంత ఈజీ కాదు...

సార్వత్రిక సమరంలో గెలుపు ఏకపక్షం కాదు

- అధికారపార్టీకి పలు రాష్ట్రాల్లో ప్రతికూలతలు
- పుంజుకుంటున్న ఇండియా కూటమి



న్యూఢిల్లీ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధిస్తుందని కార్పొరేట్ మీడియా సంస్థలు గత కొంత కాలంగా ఊదరకొడుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు విషయంలో ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు చోటుచేసుకున్నాయంటూ ఆ సంస్థలు వార్తలు వండి వారుస్తున్నాయి. అయితే వాస్తవాలను పరిశీలిస్తే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం నల్లేరుపై నడక కాబోదని అర్థమవుతోంది. అందుకే.. అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంపై బీజేపీ అంతగా ఆధారపడాల్సి వస్తోంది.

అసమ్మతి...అసంతృప్తి

అనేక రాష్ట్రాల్లో పార్టీ నేతల దుందుడుకు వైఖరులు, పోకడలు, వారి వ్యవహార శైలి సామాన్య కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. మోడీ నేతృత్వంలోని బీజేపీకి కీలకమైన కొన్ని హిందీ రాష్ట్రాల్లో ఈ వాతావరణం కన్పిస్తోంది. అనేక లోక్‌సభ స్థానాల్లో అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిని నిర్ణయించడం బీజేపీకి కష్టంగా ఉంది. బీజేపీకి గొప్ప విజయాలు లభిస్తాయని పలు సర్వేలు చెబుతున్న రాష్ట్రాల్లోనే ఈ పరిస్థితి కన్పిస్తోంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. ఆయా రాష్ట్రాల్లో 179 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో సైతం స్థానిక పార్టీ నేతలపై అసమ్మతి వ్యక్తమవుతోంది. హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కూడా ముఖ్యమంత్రులు బీజేపీకి చెందిన వారే. ఆ రెండు రాష్ట్రాల్లో 15 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో కమలదళం ప్రతిపక్షాల నుండి గట్టి పోటీని ఎదుర్కొంటోంది.

మరోవైపు బీజేపీ శిబిరంలో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తిరుగుబాటే దీనికి ఉదాహరణ. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా బీజేపీ నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో మోడీ జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. కేంద్రంలో అంతా తామై వ్యవహరిస్తున్న నాయకద్వయంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని కొందరు కీలక నేతలు అసంతృప్తిగా ఉండడం రహస్యమేమీ కాదు.

ఇంకేం పెరుగుతుంది?

మహారాష్ట్రలోని సంకీర్ణ ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామి. అక్కడ 48 లోక్‌సభ స్థానాలు ఉండగా అధికార కూటమి సగం సీట్లను గెలుచుకునే అవకాశం ఉన్నదని అంచనా. 28 స్థానాలు ఉన్న కర్నాటకలో బీజేపీ ప్రతిపక్షంలో ఉంది. గత మేలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమితో సంస్థాగతంగా బీజేపీ బలహీనపడింది. అందరికీ ఆమోదయోగ్యమైన నేత లేకపోవడం ఆ పార్టీకి ఇబ్బందిగా మారింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గుజరాత్, అస్సాం, మహారాష్ట్ర, కర్నాటకలో కలిపి 270 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అంటే లోక్‌సభలోని మొత్తం 543 స్థానాల్లో సగం సీట్లు ఈ రాష్ట్రాలలోనివే.

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లో ఉన్న 179 స్థానాల్లో 2019 ఎన్నికల్లో బీజేపీ సుమారు 80-90శాతం సీట్లు గెలుచుకుంది. ఇప్పుడు ఈ బలం మరింత పెరిగే అవకాశం ఎంత మాత్రం లేదు. ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ, రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీలు కూడా బలమైన ఓటు బ్యాంకును కలిగి ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్షాల బలం పెరిగే సూచనలు కన్పిస్తున్నాయి.

ఇప్పటికే బీజేపీ గరిష్ఠ స్థాయిలో లోక్‌సభ స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు ఎన్ని గిమ్మిక్కులు చేసినా, ఎత్తుగడలు పన్నినా దాని బలం అంతకంటే పెరిగే అవకాశాలు లేనేలేవు.

జోష్ నింపనున్న రాహుల్ యాత్ర

దళిత నేత మల్లిఖార్జున ఖర్గే కాంగ్రెస్ అధ్యక్షుడుగా, ఇండియా కూటమి ఛైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఆయన నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది. బీజేపీకి బలమున్న రాష్ట్రాల్లో సైతం ఆయన దళిత ఓటర్లపై ప్రభావం చూపుతారని, తద్వారా ఇండియా కూటమి బలం పెరుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రారంభించిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలన్నీ మద్దతు ఇస్తున్నాయి. ఈ యాత్ర ద్వారా లోక్‌సభ స్థానాలు అత్యధికంగా ఉన్న ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష కూటమి బలపడుతుందని అంచనా. సీట్ల సర్దుబాటు విషయంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య అభిప్రాయబేధాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ అవి పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఢిల్లీకే పరిమితం. ఇది ఇండియా పక్షాల ఐక్యతపై ఎలాంటి ప్రభావం చూపబోదు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించేందుకు ఎన్నికల కమిషన్ కూడా తన వంతు కృషి చేస్తోంది. ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ వాటిని ఈసీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక బీజేపీకి ఉన్న అపార ఆర్థిక వనరులను గురించి వేరే చెప్పాల్సిన అవసరమే లేదు. బీజేపీకి, మోడీకి ప్రధాన మీడియా వంత పాడుతున్న విషయం తెలిసిందే. ఇవన్నీ ప్రతిపక్ష ఇండియా కూటమికి ప్రతికూలతలే అయినప్పటికీ రాబోయే ఎన్నికల పోరు మాత్రం ఏకపక్షం కాబోదన్నది నూటికి నూరు పాళ్ల నిజం.

బీజేపీ నాయక ద్వయానికి ఇదేమీ తెలియనిది కాదు. అందుకే అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి అంత ప్రాచుర్యం. ప్రజల్లో మతపరమైన భావేద్వేగాలను కలిగించడానికే ఈ ప్రయాస.

సాగర్ ఎడమ కాల్వకు నీరు విడుదల చేయాలి

పంటను కాపాడండి : మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడమ కాల్వ పరిధి ఆయకట్టులో బోర్లు బావులు, చెరువుల కింద 30శాతం వరి పంట సాగు చేశారన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చేతికొచ్చిన పంట ఎండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటపొలాలను కాపాడేందుకు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలని కోరారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 524 అడుగుల నీటిమట్టం ఉందని, అందులో 15 టీఎంసీల నీటిని వాడుకునే అవకాశ ఉంటుందని చెప్పారు. కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం వల్ల అక్కడి ప్రభుత్వంతో మన ప్రభుత్వం చర్చలు జరిపి ఆల్మట్టి ద్వారా నీటిని తెప్పించుకోవాలన్నారు.

సాగర్ ఎడమ కాల్వకు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలు పెంపొందించా లన్నారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలన్నారు. అలా చేస్తే భవిష్యత్‌లో తాగునీటి సమస్య కూడా ఉండదని చెప్పారు. నీటి విడుదలపై ప్రభుత్వ స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్ తదితరులు ఉన్నారు.

రోడ్లు, భవనాల శాఖకు నిధులు కేటాయిస్తాం

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా

- ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్
- నంది అవార్డులపై క్యాబినెట్‌లో చర్చిస్తాం
- ఎఫ్‌డీసీ భూములను సంరక్షిస్తాం : ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం సచివాలయంలో 2024-25 వార్షిక బడ్జెట్ సన్నాహక సమావేశంలో వివిధ రోడ్లు, భవనాలు, రైల్వే బ్రిడ్జీలు, సినిమా పరిశ్రమకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదనలపై ఆ శాఖల ఉన్నత అధికారులతో చర్చించారు. గత ప్రభుత్వం కేటాయింపులు పత్రికల్లో చూపించి, చెల్లింపులు చేయని కారణంగా చిన్న కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారనినీ, పదిసార్లు టెండర్లు పిలిచినా పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితి ఉందని మంత్రి కోమటిరెడ్డి ఆర్థికమంత్రి దష్టికి తీసుకువచ్చారు. అనంతరం రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రోడ్డు నిర్మాణాల గురించి మంత్రులు అడిగిన ప్రశ్నలకు అధికారులు పీపీటీ రూపంలో వివరించారు. ప్రధానంగా రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు సంబంధించి అలైన్‌మెంట్‌పై చర్చించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ భవిష్యత్తు తరాల అవసరాలను దష్టిలో పెట్టుకొని పారదర్శకంగా ప్రజలకు జవాబుదారీగా అలైన్‌మెంట్ ఉండాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఇష్టం వచ్చినట్టుగా కాకుండా క్రమపద్ధతిలో అలైన్‌మెంట్ ఉండాలని ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిప్యూటీ సీఎంను కోరారు. నల్లగొండ, హైదరాబాద్‌లో కలెక్టరేట్ల నిర్మాణంతోపాటు ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, వీయూబీ బ్రిడ్జీల నిర్మాణానికి రాష్ట్రం వాటా నిధులు ఇస్తామన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ నెట్‌వర్క్ పెంచేందుకు అవసరమున్న నిధులు విడుదల చేయాలని చేసిన ప్రతిపాదనలను డిప్యూటీ సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో సీఐఆర్ఎఫ్ నిధులతో చేపట్టే నిర్మాణాలకు భూసేకరణ నిధులకు ఇబ్బందులు రాకుండా బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన విజ్ఞప్తికి ఆర్థిక మంత్రి అంగీకారం తెలిపారు. అనంతరం సినిమాటోగ్రఫీ అంశంపై జరిగిన చర్చలో సినిమా పరిశ్రమ అభివద్ధి కోసం కేటాయించిన భూములను కాపాడాలని ఉపముఖ్యమంత్రి సినిమాటోగ్రఫీ అధికారులను ఆదేశించారు. చలన చిత్ర పరిశ్రమలో నటీనటులకు అందజేసే నంది అవార్డులపై క్యాబినెట్‌లో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చిన్న నిర్మాతలకు సినిమాలు విడుదల చేయడంలో ఎదురవుతున్న ప్రతిబంధకాలను తొలగించాలన్నారు. ఫిలిం డెవలప్‌మెంట్ పరిధిలో హైదరాబాద్ ఫిలింనగర్‌లో ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సినిమా టికెట్ల కంటే థియేటర్‌లో అమ్మే చిరుతిళ్లకు వందరేట్లుఎక్కువ వసూళ్లకు పాల్పడుతున్నారని సినిమాటోగ్రఫీ అధికారుల దష్టికి తీసుకొచ్చారు. అన్ని మెట్రో నగరాల్లో అమలవుతున్న రేట్లకంటే హైదరాబాద్ సినిమా హాల్లలో అమ్ముతున్న రేట్లు వందల శాతం ఎక్కువగా ఉన్నాయనీ, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇక ఆన్ లైన్ టికెటింగ్ కోసం వేసిన కమిటీ నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకుందామని ఆయన తెలిపారు. చిత్రపురికాలనీలో ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయనీ, వాటిపై తగిన సమయంలో నిర్ణయం తీసుకుందామని కోమటిరెడ్డి అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకష్ణారావు, రోడ్లు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి హరిత, డిప్యూటీ సీఎం కార్యదర్శి కష్ణభాస్కర్, ఈఎన్సీలు రవీందర్‌రావు, గణపతిరెడ్డి, సతీష్‌తో పాటు ఐఅండ్ పీఆర్ కమీషనర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



పేదలపై అక్రమ కేసులు ఎత్తేయాలి

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.పార్థసారథి
- జగిత్యాల జిల్లా కేంద్రంలో గుడిసెల స్థలం పరిశీలన

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఇంటి స్థలం కోసం పోరాడుతున్న పేదలపై అక్రమ కేసులు నమోదు చేయడంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది కె.పార్థసారథి తీవ్రంగా ఖండించారు. వెంటనే వారిపై కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, న్యాయవాదులు ఎన్.వెంకటేష్, మాధవ రెడ్డి, ఎన్.కుమార్, ప్రసాద్, గణేష్, తిప్పరవు సురేష్‌తో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ శివారులో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కె.పార్థసారథి మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలు ఇంటి స్థలం కోసం పోరాడుతుంటే ప్రాథమిక ఆధారాలు లేకుండా సెక్షన్ ఐపీసీ 307 కింద అత్యాయత్నం కేసు నమోదు చేయడం, పేదలను అక్ర మంగా అరెస్టు చేయడం చట్ట విరుద్ధం అన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్ర మంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన తొమ్మిది మందిని విడు దల చేయాలని, తప్పుడు కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయపరమైన సహాయ సహకారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అందిస్తుందని చెప్పారు.

గీత కార్మికుల ప్రాణాలను కాపాడండి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కేజీకేఎస్ వినతి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బతుకుతెరువు కోసం ప్రమాదకర మైన కల్లుగీత వత్తి చేస్తూ రెండు రోజులకు ఒకరుచొప్పున చనిపోతున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) తీసుకెళ్లింది. వందలాది మంది కాళ్లు చేతు లు విరిగి మంచాన పడుతున్నారని గుర్తు చేసింది. వెంటనే ప్రమాద నివారణా చర్య లు చేపట్టాలనీ, సురక్షిత(సేఫ్టీ) మోకులు ఇవ్వాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు మంత్రిని కోరారు. శనివారం హైదరాబాదు లోని మంత్రిని కలిసి 16 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా వత్తిలో ప్రమాదం జరిగి చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల మేర ఎక్స్‌గ్రేషియా నెలరోజుల్లో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ బోర్డు నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. టాడీ కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి గీత కార్మికుల ఉపాధి మెరుగుపరచాలని కోరారు. గతంలో ఇచ్చిన సర్కారు ప్రకారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలనీ, ఎన్నికల ప్రణాళిక ప్రకారం జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలలో తాము ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలు చేస్తామన్నారు. త్వరలో అన్నీ బీసీ కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి పరిష్క రిస్తామన్నారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర క్యాలెండర్‌ను మంత్రి ఆవి ష్కరించారు. సర్వాయి పాపన్న జీవన చిత్రాలను, వత్తిని ఉద్యమాన్ని ప్రతిబింబించే విధంగా క్యాలెండర్ ఉందంటూ అభినందిం చారు. సంఘానికి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు వి వెంకట నరసయ్య, హైదరాబాద్ అధ్యక్షులు ఎం కష్ణస్వామిగౌడ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బోయపల్లి సుధాకర్‌గౌడ్ , అంజనేయులు, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు హరిచరణ్ గౌడ్, ప్రేమ్‌దాస్ గౌడ్ ఉన్నారు.




కేరళపై ఇంత నిర్లక్ష్యమా?

- కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టిన ప్రజానీకం
- లక్షలాది మందితో 651 కిలోమీటర్ల మానవహారం

తిరువనంతపురం : కేరళ విషయంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న శతృత్వ వైఖరిని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో లక్షలాది మంది ప్రజలు శనివారం మానవహారం నిర్వహించారు. రాష్ట్రంలో ఉత్తర ప్రాంతం చివరలో ఉన్న కాసర్‌గోడ్ రైల్వే స్టేషన్ నుండి దక్షిణాన చివరన ఉన్న తిరువనంతపురంలోని రాజ్‌భవన్ వరకూ 651 కిలోమీటర్ల పొడవునా నిర్వహించిన మానవహారంలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ముక్తకంఠంతో నిరసించారు. మానవహారం ఏర్పడడానికి ముందు జరిగిన భారీ బహిరంగ సభను సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ ప్రారంభించారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కాసర్‌గోడ్ రైల్వే స్టేషన్ ఎదురుగా జరిగిన సభను డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు ఏఏ రహీం ప్రారంభించారు.

డీవైఎఫ్ఐ తొలి జాతీయ అధ్యక్షుడుగా పనిచేసిన సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఈపీ జయరామన్ రాజ్‌భవన్ సమీపంలో మానవహారం చివరన నిలబడ్డారు. మానవహారం కార్యక్రమానికి వివిధ జిల్లా కేంద్రాల్లో డీవైఎఫ్ఐ జాతీయ, రాష్ట్ర నాయకులు నేతృత్వం వహించారు. మానవహారంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలు సరిగ్గా సాయంత్రం ఐదు గంటలకు ఒకేసారి ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు.

'కేంద్రం నిర్లక్ష్యాన్ని మనం సహించాల్సిన అవసరం ఉన్నదా?' అనే నినాదంతో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. రైల్వే ప్రయాణికుల ఇబ్బందులు, నియామకాలపై కేంద్రం విధించిన నిషేధం, కేరళపై కేంద్రం విధించిన ఆర్థిక ఆంక్షలు వంటి అంశాలు ఈ మానవహారంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సాంస్కృతిక నేతలు, విద్యార్థి సంఘాల కార్యకర్తలతో పాటు పది లక్షలకు పైగా యువత ఈ మానవహారంలో భాగస్వామి అయింది.



ఇప్పుడు రష్యాలో సోషలిజం పడిపోవచ్చుగాక. దానికి అనేక కారణాలున్నాయి. కానీ మార్క్స్ చెప్పినట్లు దోపిడీ పెరిగిన కొద్దీ సంక్షోభాలు తలెత్తుతాయి.తిరుగుబాట్లు, విప్లవాలు అనివార్యమవుతాయి.'పాత ప్రపంచం మరణిస్తోంది. నూతన ప్రపంచం ఆవిర్భవించడానికి పోరాడుతోంది. ప్రస్తుతమున్న ఈ విరామ కాలం దుర్మార్గులది' అన్న గ్రాంసీ మాటలు అక్షర సత్యం. ఇది అంతం కాక తప్పదు. దానికోసం చేసే ప్రతి పోరాటంలో లెనిన్ మనకు చైతన్యాన్ని అందిస్తూనే ఉంటాడు.

లెనిన్ ఆలోచన సజీవం

సంపాదకీయం

లెనిన్ మన పరాక్రమం, కామ్రేడ్ లెనిన్ ఆయుధం, మన ఆసరా, మన జ్ఞానం- లెనిన్ నేడు లేడూ? చూడు జనంలో వున్నాడు. మయికోవ్‌స్కీ తన్మయత్వగానం ఇది. సత్యపాదం కూడా. ఎందుకంటే లెనిన్ అంతటి విప్లవ మహా యోధుడు, సైద్ధాంతిక ఆచరణశీలుడూ తనే కావటం కారణం. లెనిన్‌కి తగ్గ కవిత్వం ధ్వనించాలంటే అనంతాకాశాన్ని చుంబించే అతని కిరీటాన్ని తాకాలంటే ఈ నా వాక్కులు ఆ మానవున్ని అర్థం చేసుకోవద్దూ? అని వాపోయాడు కవి. ఇది కూడా వాస్తవమే. లెనిన్‌ను అర్థం చేసుకోవటం ఒక ఎత్తయితే, దాన్ని ఆచరణలో పెట్టడం మరో ఎత్తు. ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అందిస్తే దానికి అప్పటి నిర్దిష్ట పరిస్థితులలో తన ఆలోచనలను చేర్చి ఆచరణలో పెట్టి ప్రపంచంలోనే మొట్టమొదటి సామ్యవాద కలను సాకారం చేసిన మహానేత లెనిన్. లెనిన్ అనే పేరు మూడు అక్షరాలే కాని ప్రపంచ ప్రజలందరికీ విముక్తి ఆయుధపు ధ్వని అది. ఆయన బతికింది యాభై నాలుగేండ్లే కావచ్చు. వందేళ్ల తర్వాత కూడా ఆయన అందించిన విప్లవ విద్యుత్ సరఫరా అవుతూనే ఉంది. కవిత్వం, సాహిత్యం కూడా అందుకోలేని మహా సంఘటనల అతని జీవన సాఫల్యత. ఆ పేరు వినగానే మానవీయ ఉద్వేగంతో మనసు పులకించిపోతుంది. అంతటి మహోన్నతుని పేరును సినిమా విలన్లకు తగిలించటమా! మార్కెట్ వ్యాపార పెంటకుప్పలో పెన్నీలు ఏరుకునే హీనబతుకులకు పేరులోని ప్రేరణ ఏమర్థమవుతుంది. వాళ్లని ఆ పెంటలోనే వదిలేద్దాం.

నేడు కమ్యూనిస్టులు బలహీనపడుతున్నారని నిరాశకు లోనవుతున్న సందర్భంలో ఎదురు దెబ్బలు తగులుతున్నాయని భీతిల్లు సమయంలో లెనిన్ జీవనక్రమం మనకొక ధైర్యపు టానిక్. సరిగ్గా ఇట్లాంటి పరిస్థితుల నుండే లెనిన్ 'ఏం చేయాలి' అని ఆలోచించి విప్లవ కార్యాచరణకు ప్రణాళికను సిద్ధం చేశాడు. విప్లవం సాధించేందుకు ఉన్న పరిస్థితులపై 'ఏప్రిల్ థీసిస్'ను తయారు చేశాడు. చుట్టూ వున్నవాళ్లు లెనిన్‌ను పిచ్చివాడిగా భావించారు. ఏ నాయకుడూ ఆయనకు మద్దతివ్వలేదు. అయినా ప్రతికూలతలను అధిగమించి, ప్రజాశ్రేణులు ఆయన ఇచ్చిన పిలుపుతో ముందుకు కదిలారు. ప్రజలు పెద్దఎత్తున విప్లవంలో పాల్గొన్నారు. ప్రపంచంలోనే తొలి సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావానికి అంకురార్పణ జరిగింది. ఇప్పుడు నిజంగా మనకున్న నిరాశ తొలిగే సమయం ఆసన్నమవుతోంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలోకి పోతున్నాయి. ప్రజలు పెద్దయెత్తున తమ ఇక్కట్లపై నిరసనలు తెలుపుతున్నారు. వీటిని అణచేందుకు ఫాసిస్టు తరహా పాలన విస్తరిస్తోంది. అయినా చరిత్ర గమనంలో విముక్తి పథం ఆగదు. లెనిన్ సజీవంగా మనకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాడు.

'విప్లవం మొదలయి, ప్రజలందరి చేరికతో విప్లవం అప్రతిహతంగా సాగుతున్నప్పుడు విప్లవకారుడు కావటం కష్టం కాదు. విప్లవ పోరాటానికి పరిస్థితులే అస్తిత్వంలో లేనపుడు విప్లవకారుడిగా ఉండటం చాలాకష్టం. అలా ఉండటం చాలా విలువైన విషయం అంటాడు లెనిన్. ఆయనను చదవటం మనకు ఇప్పుడెంతో అవసరం. అతని జీవన విధానమూ కమ్యూనిస్టులకు శిరోధార్యం కూడా. నిబద్ధ కార్యకర్తలుగా నిలబడటానికి ఆయన జీవితం స్ఫూర్తినిస్తుంది. లెనిన్ జీవన విధానం, ప్రపంచ నేతలందరికీ నిన్న, నేడు, రేపు సదా ఆదర్శనీయం. ప్రపంచ భూభాగంలో ఆరవవంతున్న సువిశాల రష్యా అధినేత అయ్యాక కూడా లెనిన్ నిరాడంబరత, వినమ్రత, నైతిక మానవీయతలతో కూడిన జీవన విధానం కొనసాగింది. లెనిన్ మనసు, మాట, చేతలకు ఎన్నడూ తేడా కనిపించలేదు. సమసమాజపు వెలుతురు కోసం తనను కొవ్వొత్తిలా కరిగించుకున్నాడు. ఆయన ఆరోగ్యం కోసం మెరుగైన ఆహారం, వసతులు అవసరమని డాక్టర్లు మొరపెడుతున్నా, ప్రజలు హీనంగా జీవిస్తున్నపుడు వాళ్ల కన్నా మంచిగా జీవించే నైతిక హక్కు నాకు లేదని తిరస్కరించిన నేత అని మహా రచయిత గోర్కీ కొనియాడుతాడు. సగటు శ్రామిక పీడిత వర్గ ప్రజల జీవనం కమ్యూనిస్టులకు ప్రామాణికంగా ఉండాలన్నది లెనిన్ ఆలోచన. చిరిగిన కోటును కుట్టించుకుని తొడిగిన ఆయన చాలా స్పష్టంగా ఆ సూత్రాన్ని పాటించాడు. నిరాడంబరత్వం అనేది విప్లవతత్వంలో ఓ భాగమనీ బోధించాడు. అంతేకాక ఆయనలోని వినమ్రత మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది.

1917 విప్లవానంతరం మాట్లాడుతూ "ఇది నా గొప్పతనం కాదు, నే గుర్తించిన సత్యం యొక్క గొప్పతనం. దాన్ని విశ్వసించి, కదిలిన కార్యకర్తల, ప్రజల గొప్పతనం" అని అనగలిగాడు అందుకే.విపరీతమైన అధ్యయనం, చర్చలు పరిశీలనాశక్తి కలిగిన లెనిన్ సామ్రాజ్యవాద విశ్లేషణ, రాజ్యము-విప్లవం, ఏం చేయాలి, కమ్యూనిజం అతివాద బాలారిష్టం మొదలైన రచనలతో పాటు పత్రికలు నిర్వహించడం కూడా సమర్థవంతంగా చేశాడు. మహిళల సమస్యలను లోతుగా అధ్యయనం చేసాడు. క్లారా జెట్కిన్, కొలంతాయలతో ఆయన జరిపిన చర్చ ఇప్పటికీ మనకో పాఠంలా ఉపయోగపడుతుంది.

ఇప్పుడు రష్యాలో సోషలిజం పడిపోవచ్చుగాక. దానికి అనేక కారణాలున్నాయి. కానీ మార్క్స్ చెప్పినట్లు దోపిడీ పెరిగిన కొద్దీ సంక్షోభాలు తలెత్తుతాయి. తిరుగుబాట్లు, విప్లవాలు అనివార్యమవుతాయి.'పాత ప్రపంచం మరణిస్తోంది. నూతన ప్రపంచం ఆవిర్భవించడానికి పోరాడుతోంది. ప్రస్తుతమున్న ఈ విరామ కాలం దుర్మార్గులది' అన్న గ్రాంసీ మాటలు అక్షర సత్యం. ఇది అంతం కాక తప్పదు. దానికోసం చేసే ప్రతి పోరాటంలో లెనిన్ మనకు చైతన్యాన్ని అందిస్తూనే ఉంటాడు.

నిర్మాణం యెడల లెనిన్ విప్లవ సిద్ధాంతం

ఒక విప్లవకర పార్టీకి ఉండవల్సిన మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణను ముందుకు తీసుకుపోవటంలో లెనిన్ చేసిన కృషి చాలా ప్రాముఖ్యత కలిగివున్నది. రష్యా విప్లవకాలంలో లెనిన్ తన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడానికి చాలా కష్టపడ్డారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం పునాదులపై కమ్యూనిస్టు పార్టీని నిర్మించటంలో లెనిన్‌ది ప్రత్యేక స్థానం. లెనిన్ దృష్టిలో పార్టీ నిర్మాణం విప్లవ సిద్ధాంతంలో అంతర్భాగం. 'ఏమి చేయాలి' అనే చిన్న పుస్తకంలో "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవం ఉండదు" అని నొక్కి చెప్పారు. 1902లో ప్రచురితమైన ఈ పుస్తకంలో సరియైనపార్టీ మాత్రమే విప్లవ సిద్ధాంతాన్ని విప్లవోద్యమంగా మలచగలదు అని విశదీకరించి చెప్పారు. లెనిన్ ప్రకారం "అధికారం కోసం జరిగే పోరాటంలో కార్మికవర్గానికి పార్టీ తప్ప మరొక ఆయుధం లేదు. "విప్లవపార్టీకి అనుగుణమైన పార్టీ నిర్మాణం రూపొందించి, సుస్థిరపరచటానికి 1900-1906 మధ్య కాలంలో లెనిన్ రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో అంతర్గత పోరాటాన్ని చేశారు. ఆ కాలంలో, జర్మనీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్మికవర్గ పార్టీగా అభివృద్ధి అయి, యూరోపులోని కార్మికవర్గ పార్టీలకు ఒక నమూనాగా వుండింది. తరువాతి కాలంలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ బోల్షివిక్, మెన్షివిక్ పార్టీలుగా చీలిపోయింది. ఈ చీలికకు దారితీసిన ముఖ్య కారణాలలో ఒకటి పార్టీ వ్యవస్థ ఎలా వుండాలి, సభ్యత్వానికి సంబంధించినది.

వర్గచైతన్యం

చివరికి, లెనిన్ ఆలోచనా దృక్పథం బోల్షివిక్ పార్టీ నిర్మాణంలో కనపడుతుంది. రష్యా కార్మికవర్గ ఉద్యమంలోని ఆర్థికవాదులపై లెనిన్ తన మొదటి పోరాటాన్ని ఎక్కుపెట్టారు. పార్టీ నిర్వహణకు ఆర్థిక పోరాటం, ట్రేడ్ యూనియన్ ఉద్యమం సరిపోతుం దనేది ఆర్థికవాదుల వాదన. సద్యోజనితంగా (స్పాంటేనియస్) ఉద్భవించే కార్మిక పోరాటాలపై ఆర్థికవాదం ఆధారపడటాన్ని వ్యతిరేకిస్తూ లెనిన్ పోరాడారు. దోపిడీ, పని పరిస్థితులకు ప్రాథమిక ప్రతిచర్యగా ఆర్థిక పోరాటాలు(ట్రేడ్ యూనియన్ పోరాటాలు) జరుగుతాయి. ఇటువంటి

విప్లవోద్యమాన్ని రూపొందించి, అభివృద్ధి చేసే పార్టీని నిర్మించాలనేది లెనిన్ ఊహ. అందుకోసం కార్మికవర్గంలో అభివృద్ధి చెందిన తరగతులను పార్టీలోకి చేర్చుకుని, వారిలో రాజకీయ చైతన్యం కలిగించి, అగ్రగామిగా ఉపయోగపెట్టుకునే ప్రాముఖ్యత గురించి లెనిన్ మరీమరీ చెప్పారు.అటువంటి పార్టీ వర్గపోరాటాలు, ప్రజాఉద్యమాల ద్వారా ఉక్కులాగా తయారై,అన్ని పరిస్థితులలోనూ, అంటే చట్టబద్ధ, పాక్షిక చట్టబద్ధ, చట్టవిరుద్ధ పరిస్థితులలో పనిచేయగలగాలి. వర్గ రాజకీయాల ఆపత్కాల పరిస్థితులలో పోరాట రూపాలను మార్చగల సామర్థ్యం పార్టీకి వుండాలి. మార్క్సిజం, వర్గపోరాటాలు పునాదిగా వున్న పార్టీకి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రం చక్కగా సరిపోతుంది.

సద్యోజనితం పోరాటాలు ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని మాత్రమే అభివృద్ధి చేస్తాయి. "ప్రపంచంలోని అన్ని దేశాల చరిత్రను పరికిస్తే కనపడేది కార్మికవర్గం కేవలం తన సొంత కృషి ద్వారా అభివృద్ధి చేయగలిగింది ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని మాత్రమే" అని లెనిన్ రాశారు. "పిండ దశలో" వుండే చైతన్యం ఇది. లెనిన్ ఇంకా ఈ విధంగా చెప్పారు "విప్లవకారులతో నిండిన శక్తియుతమైన సంస్థ పోరాటాలకు నాయకత్వం వహించకపోతే సద్యోజనితంగా ఉద్భవించే కార్మికవర్గ పోరాటాలు అసలైన "వర్గపోరాటాలు"గా మారవు. చైతన్యానికి సంబంధించిన సమస్యపై వాదిస్తూ లెనిన్, సోషలిస్టు చైతన్యం లేక వర్గచైతన్యం అనేది "బయటనుంచి" చొప్పించబడుతుందనే మరొక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన "ప్రతి వర్గ పోరాటం ఒక రాజకీయ పోరాటమే" అన్నదానిని లెనిన్ నొక్కి చెప్పారు. మార్క్సిజం పునాదిగా వున్న పార్టీయే కార్మిక శ్రేణులలో వర్గచైతన్యం కలిగించగలిగిన "బయట నుండే" సంస్థ.

నాయకత్వ పాత్ర

లెనిన్ ఆలోచనలో, సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్మికవర్గ పార్టీ కనుక కార్మికుల చైతన్య స్థాయి, నిబద్ధతకు సంబంధం లేకుండా అందరినీ చేర్చుకునే పార్టీగా వుండకూడదు. కార్మికవర్గంలో ముందుండి నడిపే పార్టీ దళాన్ని 'అగ్రగామి' దళంగా లెనిన్ పేర్కొన్నాడు. ఎక్కువ చైతన్యస్థాయి, మిలిటెంట్ కార్మికులను పార్టీ సభ్యులుగా చేర్చుకోవాలని ఇది సూచిస్తున్నది. వీరు కార్మికులలోనూ, ప్రజల్లోనూ పార్టీ సంఘాల ద్వారా పని చేయాలి. వృత్తి విప్లవకారుల సంఘంగా పార్టీ ఉండాలి అని లెనిన్ అన్నారు. "విప్లవ కార్యక్రమాలు వృత్తిగా స్వీకరించిన ఉత్తమోత్తములతో కూడిన విప్లవకారుల సంస్థగా పార్టీ ఉంటుంది." అగ్రగామి నాయకత్వం వృత్తి విప్లవకారులతో కూడి ఉండాలనే లెనిన్ డిమాండ్ పరిస్థితుల అవసరాన్ని బట్టి నిర్దేశించినది. 1905లో విప్లవం సంభవించిన వెంటనే వేలాదిమంది చైతన్యవంతులైన మిలిటెంట్ కార్మికులను పార్టీలో చేర్చుకొనటానికి అంతులేని అవకాశాలు కనిపించాయి. విప్లవ పోరాటం సోషల్ డెమోక్రటిక్ చైతన్యంతో కూడిన కార్మికులను అనేకమందిని తయారు చేసిందని లెనిన్ గమనించారు. ఆనాటి నుండి అభివృద్ధి చెందుతూ వస్తున్న బోల్షివిక్ పార్టీ వివిధ స్థాయిలలో ధృడమైన వృత్తి విప్లవకారులను కలిగివుంది. వీరితో పాటు పూర్తికాలం కార్యకర్తలు గాని శ్రామిక రంగానికి చెందిన సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కార్మికవర్గంలో ముందుండి నడిచే దళంతో కూడినదే పార్టీ అని అగ్రగామి అనే భావనకున్న అర్థం. "అత్యంత అభివృద్ధికర సిద్ధాంతం కలిగివున్న పార్టీ మాత్రమే పోరాడే అగ్రగామి పాత్రను నెరవేర్చగలదు" అని లెనిన్ స్పష్టం చేశారు.



ప్రకాశ్‌కరత్

కమ్యూనిస్టుల పాత్రను కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ఈ విధంగా నిర్వచించింది. "కార్యరంగంలో కమ్యూనిస్టులు అన్ని దేశాల కార్మిక పార్టీలలో ఇతరులందరికంటే చైతన్యవంతులుగాను, ధృఢ సంకల్పులుగాను పనిచేస్తారు. ఇతరుల్ని కార్యరంగంలోకి తీసుకొచ్చేవారుగా వుంటారు. సిద్ధాంతరంగంలో కూడా వారే ఇతర శ్రామికులకంటే చక్కగా ఆలోచించే వారు. ఏ మార్గంలో కార్మికోద్యమం పురోగమించాలో, విజయసాధనకేమేమి అవసరమో, ఆ విజయాలవల్ల తుదకు ఎట్టి సాధారణ ఫలితాలు కలుగుతాయో వారే స్పష్టంగా తెలుసుకోగలిగి వుంటారు.మార్క్స్, ఎంగెల్స్‌ల చారిత్రక కమ్యూనిస్టు ప్రణాళికలోని వ్యాఖ్యానం నుంచి లెనిన్ 'పార్టీ అగ్రగామి' అనే భావనను తెచ్చారు. అగ్రగామి అనేది గతితర్కం నుంచి వచ్చిన భావన. రాటుదేలిన కార్మికవర్గ రాజకీయ చైతన్యంగల కార్మికులతో కూడిన పార్టీగా ఉంటుంది. ఈ అగ్రగామి పార్టీ కార్మికవర్గం కోసం పోరాడటం, మద్దతు తెలపటం వరకే కాక, సమాజంలో అణగదొక్కబడిన అన్ని తరగతుల ప్రజల కోసం పోరాడుతుంది ఇటువంటి అగ్రగామి పార్టీ మాత్రమే వివిధ భాగాలుగా, అనేక పొరలుగా చీల్చబడిన కార్మికవర్గాన్ని ఐక్యం చేసి, కార్మికవర్గ చైతన్యాన్ని కలిగించగలదు. ఇది మాత్రమే కాదు, విప్లవోద్యమంలో మద్దతు ఇచ్చే ఇతర వర్గాలను, తరగతులను సమీకరించి, పోరాటంలో అభివృద్ధియైన తరగతులను తనలోకి ఇముడ్చుకోవటంలో అగ్రగామిపార్టీ అవసరం వుంది.


కేంద్రీకరణ

అగ్రగామిపార్టీ అనేది కేంద్రీకృత పార్టీగా వుండాలి. పార్టీ పైస్థాయి నుంచి కింది దాకా ఒకే పద్ధతిలో కేంద్రీకృత మార్గంలో వ్యవహరించాలి. జార్ నిరంకుశ ప్రభుత్వం కిందవున్న పరిస్థితులను ఎదుర్కోవటానికి రహస్యంగా పనిచేసే ఉద్దేశ్యంతో మాత్రమే కేంద్రీకృత పార్టీ ఉండాలని లెనిన్ అనుకోలేదు. ఒక కేంద్రీకృత పార్టీ నాయకత్వం కింద రాజకీయంగా ఏకీకృత పార్టీని అందిచటమే కేంద్రీకృత పార్టీ ఉద్దేశం. పార్టీ రాజకీయ-సంస్థాగత నిర్మాణంలో కేంద్రీకరణ సాధించటానికి స్థానిక ప్రచురణలు కాక, ఒక అఖిల రష్యా దినపత్రిక వుండాల్సిన అవసరాన్ని లెనిన్ నొక్కి చెప్పారు. "ఒక దినపత్రిక సమిష్టి ప్రచారకుడు, సమిష్టి ఆందోళనకారుడు మాత్రమే కాక, ఒక సమిష్టి నిర్మాణదక్షుడు కూడా" అని లెనిన్ విశదం చేశారు.లెనిన్ దృష్ట్యా, సకల కేంద్రీకృత వనరులతో శక్తివంతంగా వుండే పెట్టుబడిదారీ రాజ్యాన్ని ఎదుర్కోవాలంటే ఒక కేంద్రీకృత పార్టీ ఉండటం తప్పనిసరి అవసరం.

పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం

పార్టీ కేంద్రీకృత సూత్రానికి పార్టీలోని అన్నిస్థాయిలలో ప్రజాస్వామ్య ఆచరణను జత కలపటం జరిగింది.

1906లో రష్యా సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాలుగో మహాసభ నాటికి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అందరూ అంగీకరించారు. దానిని పార్టీ నియమాలలో చేర్చారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే పార్టీ కమిటీలలో విస్తృత చర్చ జరపటం, చర్చ తరువాత తీసుకున్న నిర్ణయాన్ని, ఐక్యంగా అమలు చేయటం.లెనినిస్టు భావనలో పార్టీ ఒక సైనిక సమూహం కాదు. పార్టీలో సిద్ధాంతం, ఆచరణపై అంతరంగిక చర్చలకు, వాదనలకు తావులేకుండా చేయటం కాదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం వాదనలకు, చర్చలకు విస్తృత అవకాశం కలిగిస్తూ, కేంద్రీకృత రాజకీయ వైఖరితో పోరాటంలో ఐక్యత కలిగివుండటం.



నేడు లెనిన్ శత వర్ధంతి

ఏమి చేయాలి? అనే పుస్తకం రాస్తున్న సమయంలో రాజ్యం యొక్క అణచివేత తీవ్రస్థాయిలో ఉండటంతో, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఆచరించటం, అన్ని స్థాయిలలో ఎన్నికలు జరపటం సాధ్యం కాలేదు. దానితో, కేంద్రీకృత సూత్రం ఆధిపత్యం చెలాయించింది. కానీ, 1905 విప్లవం తరువాత, అధికతమ స్థాయిలో రాజకీయ స్వేచ్ఛ వున్నప్పుడు, పార్టీలోని అన్ని స్థాయిలలో పార్టీ నిబంధనావళి చెప్పిన ఎన్నిక సూత్రాన్ని అమలు చేయాలని లెనిన్ పిలుపునిచ్చారు. కేంద్రకమిటీ అధికారం తగ్గించి, కింది స్థాయిల కమిటీలకు ఎక్కువ స్వయంప్రతిపత్తిని ఇచ్చారు.1906లో రష్యా సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాలుగో మహాసభ నాటికి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అందరూ అంగీకరించారు. దానిని పార్టీ నియమాలలో చేర్చారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే పార్టీ కమిటీలలో విస్తృత చర్చ జరపటం, చర్చ తరువాత తీసుకున్న నిర్ణయాన్ని, ఐక్యంగా అమలు చేయటం.లెనినిస్టు భావనలో పార్టీ ఒక సైనిక సమూహం కాదు. పార్టీలో సిద్ధాంతం, ఆచరణపై ఆంతరంగిక చర్చలకు, వాదనలకు తావులేకుండా చేయటం కాదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం వాదనలకు, చర్చలకు విస్తృత అవకాశం కలిగిస్తూ, కేంద్రీకృత రాజకీయ వైఖరితో పోరాటంలో ఐక్యత కలిగివుండటం.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం

లెనినిస్టు పార్టీ సిద్ధాంత సారం కేంద్రీకృత ప్రజాస్వామ్యం. ఒక విప్లవపార్టీ పనిచేసే నిర్దిష్ట పరిస్థితులకి అనుగుణంగా కేంద్రీకృతం, ప్రజాస్వామ్యం కలగలుపుతో ఏర్పడిన చట్రం ఇది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనేది కేవలం నిర్మాణ అంశం మాత్రమే కాదు, కమ్యూనిస్ట్ పార్టీకి అది పునాది అంశం. పెట్టుబడిదారీ విధానం లోపలే పనిచేద్దామనుకునే సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు విప్లవకర పార్టీ నిర్మాణ పద్ధతుల అవసరం ఉండదు. ఆ కారణంగా వారికి కేంద్రీకృత ప్రజాస్వామ్యమంటే గిట్టదు. పెట్టుబడిదారి విధానాన్ని, పాలక వర్గాల వ్యవస్థను కూలదోసి దాని స్థానంలో తప్పనిసరిగా సోషలిజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టుపార్టీ, శక్తివంతమైన రాజ్యాన్ని, దాని అధిపత్య పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక, సంస్థాగత పోరాటంలో అన్ని విధాలా సన్నద్ధమైన సంస్థగా వుండాలి. అటువంటి పార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికలలో పోటీ చేయటానికే కాక, అది ఎంత స్థిరంగా, దీర్ఘ కాలం ఉన్నప్పటికీ ఈబూర్జువాధిపత్య చట్రంలో అందుబాటులో వున్న ప్రజాస్వామిక హక్కులను, సంస్థలను ఉపయోగించుకుంటుంది. కానీ, కీలకమైన ప్రశ్న కార్మికవర్గాన్ని, విప్లవ ప్రజానీకాన్ని సంఘటిత పరచి, విప్లవోద్యమానికి నాయకత్వం వహించటానికి పార్టీ సన్నద్ధమై ఉన్నదా అనేది.

విప్లవోద్యమాన్ని రూపొందించి, అభివృద్ధి చేసే పార్టీని నిర్మించాలనేది లెనిన్ ఊహ. అందు

కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనేది కేవలం నిర్మాణ అంశం మాత్రమే కాదు, కమ్యూనిస్ట్ పార్టీకి అది పునాది అంశం. పెట్టుబడిదారీ విధానం లోపలే పనిచేద్దామనుకునే సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు విప్లవకర పార్టీ నిర్మాణ పద్ధతుల అవసరం ఉండదు. ఆ కారణంగా వారికి కేంద్రీకృత ప్రజాస్వామ్యమంటే గిట్టదు.పెట్టుబడిదారి విధానాన్ని, పాలక వర్గాల వ్యవస్థను కూలదోసి దాని స్థానంలో తప్పనిసరిగా సోషలిజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టుపార్టీ, శక్తివంతమైన రాజ్యాన్ని, దాని అధిపత్య పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక, సంస్థాగత పోరాటంలో అన్నివిధాలా సన్నద్ధమైన సంస్థగా వుండాలి.

కోసం కార్మికవర్గంలో అభివృద్ధి చెందిన తరగతులను పార్టీలోకి చేర్చుకుని, వారిలో రాజకీయ చైతన్యం కలిగించి, అగ్రగామిగా ఉపయోగపెట్టుకునే ప్రాముఖ్యత గురించి లెనిన్ మరీమరీ చెప్పారు.అటువంటి పార్టీ వర్గ పోరాటాలు, ప్రజాఉద్యమాల ద్వారా ఉక్కులాగా తయారై,అన్ని పరిస్థితులలోనూ, అంటే చట్టబద్ధ, పాక్షిక చట్టబద్ధ, చట్టవిరుద్ధ పరిస్థితులలో పనిచేయగలగాలి. వర్గ రాజకీయాల ఆపత్కాల పరిస్థితులలో పోరాట రూపాలను మార్చగల సామర్థ్యం పార్టీకి వుండాలి. మార్క్సిజం, వర్గపోరాటాలు పునాదిగా వున్న పార్టీకి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రం చక్కగా సరిపోతుంది. వర్గపోరాటం ఒక సామూహిక చర్య. కేంద్రీకృత ప్రజాస్వామ్యం సమిష్టిగా నిర్ణయాలు చేయటాన్ని, సమిష్టిగా కార్యక్రమాలు చేయటాన్ని ప్రోత్సహిస్తుంది. అది స్వతంత్ర ఆలోచనను, పోరాటంలో ఐక్యతను అనుమతిస్తుంది

20వ శతాబ్దం రెండోసగంలో విప్లవాలు జరగని కాలంలో అనేక కమ్యూనిస్టు పార్టీలు పనిచేస్తున్నాయి. 21వ శతాబ్ది తొలి రెండు దశాబ్దాలలో ఈ పరిస్థితి ఇంకా స్పష్టమైంది. అయితే, ఈ కమ్యూనిస్టు పార్టీలు కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి పనిచేస్తుండటంతో ఉనికిలో ఉండగలిగాయి. సైద్ధాంతిక-రాజకీయ లోపాలు, పొరపాట్లు ఏమైనప్పటికీ, కేంద్రీకృత ప్రజాస్వామ్యం వాటిని విప్లవ పార్టీగా సజీవంగా ఉంచింది. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని విడిచిపెట్టిన పార్టీలు కమ్యూనిస్టు పార్టీలుగా అంతమై పోవటమో లేక విచ్ఛిన్నమై పోవటమో జరిగాయి. దీనికి చక్కని ఉదాహరణ, ఇటలీ కమ్యూనిస్టు పార్టీ. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ 80వ దశకం దాకా, సోషలిస్టు దేశాలకు వెలుపల వున్న అతి పెద్ద కమ్యూనిస్టు పార్టీ. ఈ పార్టీ సోవియట్ యూనియన్ పతనానికి చాలా ముందే కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని వదులుకోవటంతో మొదలైన ప్రయాణం, చివరికీ మార్క్సిజాన్ని కాదనుకోవటంతో ముగిసింది. 20వ శతాబ్దంలో వచ్చిన విప్లవాల చారిత్రక అనుభవం లెనిన్ యొక్క పార్టీ సిద్ధాంతం, కేంద్రీకృత ప్రజాస్వామ్య ఆచరణ సరియైనవని రుజువు చేస్తున్నాయి.

1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పడిన నాడు, అది ఎత్తుగడల పంథాని, పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించింది. దానితో పాటు, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంగా పార్టీని పునర్నిర్మించాలనే కర్తవ్యాన్ని తీసుకున్నది. ఉమ్మడిపార్టీలో రివిజనిజం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని హరించివేసినందువల్ల దాని అవసరం ఏర్పడింది. ఇది ఒక నిరంతర కర్తవ్యం. భారతదేశంలోని నిర్దిష్ట పరిస్థితులలో పార్టీని నిర్మించటంలో కలిగిన అనుభవం కేంద్రీకృత ప్రజాస్వామ్యం పునాదిగా పార్టీ నిర్మాణం కొనసాగించటానికి ప్రయత్నించాలని చెపుతున్నది.

"ప్రపంచంలోని అన్ని దేశాల చరిత్రను పరికిస్తే కనపడేది కార్మికవర్గం కేవలం తన సొంత కృషి ద్వారా అభివృద్ధి చేయగలిగింది ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని మాత్రమే" అని లెనిన్ రాశారు. "పిండ దశలో" వుండే చైతన్యం ఇది. లెనిన్ ఇంకా ఈ విధంగా చెప్పారు "విప్లవకారులతో నిండిన శక్తియుతమైన సంస్థ పోరాటాలకు నాయకత్వం వహించకపోతే సద్యోజనితంగా ఉద్భవించే కార్మికవర్గ పోరాటాలు అసలైన "వర్గపోరాటాలు"గా మారవు. చైతన్యానికి సంబంధించిన సమస్యపై వాదిస్తూ లెనిన్, సోషలిస్టు చైతన్యం లేక వర్గచైతన్యం అనేది "బయటనుంచి" చొప్పించబడుతుందనే మరొక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన "ప్రతి వర్గ పోరాటం ఒక రాజకీయ పోరాటమే" అన్నదానిని లెనిన్ నొక్కిచెప్పారు.

అనువాదం : కర్లపాలెం



గుండెల్లో ఏముందో...

చాలాకాలానికి అక్కింటికి వచ్చిన కిరణ్ ఇంట్లోని పరిస్థితిని చూసి షాక్ తిన్నాడు. ఐదు నిమిషాలకు షాక్ నుండి తేరుకుని మళ్ళీ తేరిపార చూశాడు. అనుమానం లేదు! తను చూసింది నిజమే! ఎదురుగా ఉన్నది తన బావేనని ధృవపర్చుకుని.

"అక్కా" అని గావు కేక పెట్టాడు.

వంటింట్లో నుండి పరుగెత్తుకుని వచ్చింది లక్ష్మీ. తమ్ముడిని చూడగానే లక్ష్మికి ఎంతో సంతోషమైంది!

తమ్ముడూ! 'అమ్మానాన్న ఎట్లా ఉన్నారురా'! అడిగింది లక్ష్మి.

'అంతా బాగానే ఉన్నాం గాని! బావకేమయిందక్కా! ఏం చేశావక్కా నా బావని! ఎందుకిలా మారిపోయాడక్కా!' అన్నాడు పూడుకుపోయిన గొంతుతో కిరణ్.

"నీ బావకేమయ్యిందిరా! బాగానే ఉన్నాడుగా! అయినా నీ బావను నేనేం చేస్తాను! నీ బావ చేయకుండా ఉంటే అదే పదివేలు"! అన్నది లక్ష్మీ.

"బావకేం కాలేదంటావేం! చూడు సరిగ్గా చూడు బంగారంలాంటి నా బావ సన్యాసం పుచ్చుకున్నాడు! దీనికి కారణం నీవుకాక మరెవ్వరు! అంతా నీవే చేశావు!" అంటూ బావను అక్కకు చూపించాడు.

నిజమే! అల్లు అర్జున్‌లా స్టైలిష్‌గా ఉండే భాస్కర్ బావ. ఇప్పుడు కాషాయ వస్త్రాలు ధరించి ఉన్నాడు. చేతిలో గాడ్జెట్ బదులు ఇప్పుడు రుద్రాక్షలు కనబడుతున్నాయి! గాల్లో అల్లల్లాడే ఉంగరాల జుట్టు నూనె రాసి, కొప్పు కట్టాడు. బొట్టు అంటే తెలియని నుదుటన ఇప్పుడు పంగనామాలు తీర్చిదిద్దుకున్నాడు. కళ్లు మూసుకుని మంత్రోచ్చారన చేస్తున్నాడు. భాస్కర్! తపో ముద్రలో ఉన్నందున కిరణ్ వచ్చి గావు కేక పెట్టింది కూడా తెలియనట్లుంది.

బావను చూస్తూ దు:ఖం ఆపుకోలుక పోయాడు! కిరణ్.

"ఇంత చిన్న వయస్సులో నీకెంత కష్టం వచ్చింది! మా అక్క ఏదైనా మాట వినకుంటే. నాతో చెప్పకూడదా! దీనికే సన్యాసుల్లో కలిసిపోతావా! ఇంకా నయం! బావ ఇంట్లో నుండి బయమటకు వెళ్లక ముందే చూశాను! నా బావను సన్యాసుల్లో కలవనీయను! మా అక్క సంసారం నిలబెడతాను! " అని కళ్లు తుడుచుకుంటూ బావ కాళ్లను బిగ్గరగా పట్టుకున్నాడు కిరణ్.

దాంతో భాస్కర్ కళ్లు తెరిచాడు. కాళ్లు పట్టుకున్న బావమరిదిని లేవదీశాడు!

"మామూలుగా పలకరించవచ్చు కదా! డబ్బేమైనా కావాలా కిరణ్!" అన్నాడు ప్రేమగా.

"నాకేమొద్దు గాని, ఎందుకు బా! మా అక్క బతుకును ఆగం

"అవన్నీ కాంగ్రెస్ వాళ్లు రాసిన తప్పుడు రాతలు! అందుకే పురాణాలన్నీ వాస్తవాలతో తిరగ రాయిస్తున్నాం! మోడీని పదకొండవ అవతారంగా మేమెప్పుడో గుర్తించాం! ఇప్పటికీ వాట్సాప్ సిలబస్‌లో ఇదంతా సంక్షిప్తం చేశాం! దేశం కూడా ఇప్పుడిప్పుడే మోడీ అవతార రహస్యాన్ని కనుగొంటోంది! జనవరి 22న రామ్‌లల్లా కళ్లను మోడీనే స్వయంగా తెరిపిస్తారు! ఇంకో విషయం ఏమిటంటే మోడీ ఆంజనేయుడి అవతారం కూడా! త్రేతాయుగంలో ఆంజనేయుడిగా ఉండి రాముల వారికి గుడి కట్టించలేదని బాధ ఆయనకు తీవ్రంగా ఉండింది! అందుకే ఆ కోరికను తీర్చుకునేందుకే మోడీ అవతారం ఎత్తి, రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేస్తున్నారు.! అందుకే విధి స్వయంగా ఈ పుణ్య కార్యానికి మోడీని ఎంచుకున్నదని అద్వానీ చెప్పారు. మోడీ గుండెల నిండా రాముడే ఉన్నాడు!" పారవశ్యంతో చెప్పాడు భాస్కర్.

చేస్తున్నావు! నీకేం తక్కువ చేసింది? ఎందుకు సన్యాసం పుచ్చుకుంటున్నావు?" నిలదీశాడు కిరణ్.

"పిచ్చివాడా! ఇది సన్యాసం కాదు! అనుష్టానం నాయనా! అన్నాడు భాస్కర్.

"ఓరి నాయనో! సన్యాసమే వద్దని మొత్తుకుంటుంటే అనుష్టానం కూడా పుచ్చుకున్నావా?" అంటూ మళ్ళీ కళ్ల నీళ్ల పెట్టుకున్నాడు కిరణ్.

"ఒరే కిరణ్ తొందరపడకు! అనుష్టానం అంటే సన్యాసం పుచ్చుకోవటం కాదు! మీ అక్క నాకేం తక్కువ చెయ్యలేదు! సన్యాసిని కావల్సిన అవసరమూ లేదు! అక్కడ మా మోడీ అనుష్టానం చేస్తున్నాడు. ఇక్కడ నేనూ పాటిస్తున్నాను!" అన్నాడు భాస్కర్ రజనీకాంత్ స్టైల్లో.

"అక్కడ మోడీ అనష్టానికి కారణమేమిటో తెలుసా బా!" అన్నాడు కిరణ్.


రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయటానికి, పాటించాల్సిన ఆచారాల్లో అనుష్టానం కూడా ఒకటి!" అన్నాడు భాస్కర్ గంభీరంగా.

"అది కాదు! బా! ఏ పుణ్యకార్యం చేసినా, పెళ్లైన మగవాడు భార్యా సమేతంగా చేయాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి! సింగిల్‌గా ఉన్న మోడీ, ఈ పుణ్యకార్యాన్ని ఎలా చేస్తాడని శంకరా చార్యులు ప్రశ్నించారు! అందుకే పరిహారం కోసమే అనుష్టానం చేస్తున్నాడు" వివరించాడు కిరణ్.

"శంకరాచార్యులు ఎవరు! వారు ఖాన్‌గ్రెస్ వాదులు! వారిని మేం హిందువులుగా గుర్తించం!" అన్నాడు భాస్కర్.

కిరణ్ ఫక్కున నవ్వాడు.

"శంకరాచార్యులు, వైష్ణవాచార్యులు, ఆళ్వారాలు హిందుమతానికి మూల స్తంభాలు. దేశంలో బౌద్ధమతం విజృంభిస్తున్న కాలంలో శైవ, వైష్ణవ మతాలు కొట్టుకుంటుంటే. అది తప్పని అంతా కలిసి హిందూమతాన్ని పరిరక్షించుకోవాలని, దేశమంతా



తిరిగి ధర్మ ప్రచారం చేసి, భారతదేశానికి నాలుగు దిక్కులా నాలుగు పీఠాలను ఏర్పాటు చేసి, ఆ నాలుగు పీఠాలకు, తన ప్రధాన శిష్యులను అధిపతులను చేసి, ధర్మ ప్రచార బాధ్యతలు అప్పచెప్పిన జగద్గురు శంకరాచార్యుడి పరంపరే, ఇప్పుడున్న ఈ నలుగురు శంకరాచార్యులు! ఇప్పుడు శైవ, వైష్ణవ, శాక్తేయ మత కల్లోహాలు లేకుండా, హిందూమతం ఒక్కటే అనే భావన ఉందంటే దానికి కారణం ఆ జగద్గురే! ఆయన సిద్ధాంతాన్ని కొనసాగిస్తున్న శిష్యులపైనే అభాండాలు వేస్తారా? ఎంత అన్యాయం!" అన్నాడు కిరణ్.

"హహ్హా! మా విశ్వగురువు ముందు ఈ జగద్గురులు సూర్యుడి ముందు దివిటీల్లాంటివారు! అన్నాడు భాస్కర్.

కిరణ్ తలపట్టుకున్నాడు.

"నీకో విషయం చెప్పనా! మోడీ అంటే ఎవరనుకున్నావు! సాక్షాత్తూ భగవంతుడి అవతారం! ఈ దేశాన్ని ఈ హిందూ మతాన్ని సముద్ధరించి విశ్వవ్యాపితం అవతరించిన పదకొండవ అవతారం! అన్నాడు భాస్కర్ తన్మయత్వంతో.

"అదేంటి బా! పదకొండవ అవతారం కల్కి అవతారమని, భాగవతంలో చదివాను వీరభోగ వసంత రాయలుగా మళ్లీ అవతరిస్తానని బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పినట్లు గుర్తు కానీ మోడీ అవతారం ఉంటుందని ఏ పురాణంలో లేదు కదా!" అన్నాడు కిరణ్.

"అవన్నీ కాంగ్రెస్ వాళ్లు రాసిన తప్పుడు రాతలు! అందుకే పురాణాలన్నీ వాస్తవాలతో తిరగ రాయిస్తున్నాం! మోడీని పదకొండవ అవతారంగా మేమెప్పుడో గుర్తించాం! ఇప్పటికీ వాట్సాప్ సిలబస్‌లో ఇదంతా సంక్షిప్తం చేశాం! దేశం కూడా ఇప్పుడిప్పుడే మోడీ అవతార రహస్యాన్ని కనుగొంటోంది! జనవరి 22న రామ్‌లల్లా కళ్లను మోడీనే స్వయంగా తెరిపిస్తారు! ఇంకో విషయం ఏమిటంటే మోడీ ఆంజనేయుడి అవతారం కూడా! త్రేతాయుగంలో ఆంజనేయుడిగా ఉండి రాముల వారికి గుడి కట్టించలేదని బాధ ఆయనకు తీవ్రంగా ఉండింది! అందుకే ఆ కోరికను తీర్చుకునేందుకే మోడీ అవతారం ఎత్తి, రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేస్తున్నారు.! అందుకే విధి స్వయంగా ఈ పుణ్య కార్యానికి మోడీని ఎంచుకున్నదని అద్వానీ చెప్పారు. మోడీ గుండె ల నిండా రాముడే ఉన్నాడు!" పారవశ్యంతో చెప్పాడు భాస్కర్.

అనుమానంగా చూశారు! కిరణ్, లక్ష్మి.

"హ్హా! మీకిప్పుడూ రుజువులు కావాలి. అంతే కదా! మోడీ గుండెల్లో రాముడున్నాడని నిరూపిస్తాను!" అన్నాడు ఆవేశంగా భాస్కర్.

"కొంపదీసి మోడీ గుండెలు చీల్చుతావా ఏంది బా?' భయంగా అన్నాడు కిరణ్.


"అవసరం లేదు! కంటెంట్ ఉంటే కటౌట్ గుండెల్లో కూడా రాముడు కనబడుతాడు చూడండి!" అంటూ భాస్కర్ గోడకు ఉన్న మోడీ ఫొటో తీసుకొచ్చాడు!

"మీ అనుమానం పటాపంచలవుతుంది చూడండి!" అంటూ ఫొటోలోని మోడీ గుండెను చీల్చాడు భాస్కర్.

అంతే అక్కడున్న వారి కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా దేదీప్యమానమైన కాంతి ప్రసరించింది! మోడీ గుండెల్లో ఒక ఆకారం మెల్లిగా రూపుదిద్దుకుంటున్నది. క్రమంగా ఆ ఆకారం దృగ్గోచరమైంది! ఆ ఆకారం సింహాసన రూపం దాల్చింది! అది ప్రధానమంత్రి ఆసనం! మెల్లిగా ఆ ఆసన రూపం కూడా చిన్నదై పోసాగింది! క్రమంగా పూర్ణ దృశ్యం ఆవిష్కృతమైంది ఆ ఆసనం వెనక ఆదానీ నిలబడి ఉన్నాడు"!

అది చూసి కిరణ్, లక్ష్మి కళ్లు తిరిగి పడిపోయారు.

- ఉషాకిరణ్



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,050	▲	100
22 క్యారెట్లు	57,800	▲	100
కిలో వెండి	77,000	▼	200



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 97
రిటైల్ (లైవ్)	రూ. 119
స్కిన్‌తో	రూ. 173
స్కిన్‌లెస్	రూ. 196

బిజినెస్

యూనియన్ బ్యాంక్ ఫలితాలు అదుర్స్

- క్యూ3 లాభాల్లో 60 శాతం వృద్ధి



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో మొండి బాకీలకు కేటాయింపులు తగ్గడం, వడ్డీ ఆదాయంలో పెరుగుదలతో 60 శాతం వృద్ధితో రూ.3,590 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,249 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.24,154 కోట్లుగా ఉన్న బ్యాంక్ మొత్తం ఆదాయం.. క్రితం క్యూ3లో రూ.24,154కు చేరింది. బ్యాంక్ వడ్డీ ఆదాయం ఏకంగా రూ.25,363 కోట్లకు చేరింది. 2022-23 ఇదే క్యూ3లో రూ.20,883 కోట్ల వడ్డీ ఆదాయం చోటు చేసుకుంది. 2023 డిసెంబర్ 31 నాటికి యూనియన్ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 4.83 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి 7.93 శాతానికి జీఎన్‌పీఏ చోటు చేసుకుంది. ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 2.14 శాతంగా ఉండగా.. 2023 డిసెంబర్ ముగింపు నాటికి 1.08 శాతంగా చోటు చేసుకున్నాయి.

భారీగా తగ్గిన ఐడీబీఐ బ్యాంక్ ఎన్‌పీఏలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ఐడీబీఐ బ్యాంక్ 57.3 శాతం వృద్ధితో రూ.1,458 కోట్ల నికర లాభాలు సాధించింది. కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసి కీలక వాటాలు కలిగిన ఈ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 17.4 శాతం పెరిగి రూ.3,434.60 కోట్లకు చేరింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 4.69 శాతానికి దిగివచ్చాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి ఏకంగా 13.82 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. 2023 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలోని 4.90 శాతం స్థూల ఎన్‌పిఎలతో పోల్చితే.. గడిచిన క్యూ3లో తగ్గుదల చోటు చేసుకుంది. నికర నిరర్థక ఆస్తులు 1.08 శాతం నుంచి 0.34 శాతానికి తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభాలు 60 శాతం పెరిగి రూ.4,006 కోట్లుగా, నికర వడ్డీ ఆదాయం 29 శాతం వృద్ధితో రూ.10,499 కోట్లుగా నమోదయ్యింది.

కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు రూ.3,005 కోట్ల లాభాలు

కొటాక్ మహీంద్రా బ్యాంక్ 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 7.63 శాతం వృద్ధితో రూ.3,005.01 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. 2022 ఇదే త్రైమాసికంలో రూ.2,791.88 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో సంస్థ నికర వడ్డీ ఆదాయం రూ.5,653 కోట్లుగా ఉండగా.. గడిచిన త్రైమాసికంలో 16 శాతం వృద్ధితో రూ.6,554 కోట్లకు చేరాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.90 శాతం నుంచి 1.73 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 0.43 శాతం నుంచి 0.34 శాతానికి పరిమితమయ్యాయి.

ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్, ఏఎంఎస్‌టీ ఏవియేషన్ మధ్య ఒప్పందం



హైదరాబాద్ : ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్, ఆస్ట్రియా దేశానికి చెందిన ఏఎంఎస్‌టీ ఏవియేషన్ సంస్థలు పరస్పరం ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. పైలట్ శిక్షణకు సంబంధించి హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 ప్రదర్శనలో భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ ఒప్పందం ద్వారా పైలట్ శిక్షణ కోసం ఎఎంఎస్‌టి ఏవియేషన్ సంస్థ మూడు అత్యాధునిక ఎ320నియో, బి737 మాక్స్ 2024 ఎయిర్ ఫాక్స్ ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్‌ల ట్రైనింగ్ సర్వీస్ లను ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్‌కి అందిచనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా మెరుగైన పైలట్ శిక్షణను అందిస్తూ.. దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు ఈ ఒప్పందం దోహదం చేయనుందని ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ కౌశిక్ మానెపల్లి తెలిపారు.

ద్రవ్యోల్బణ కట్టడే లక్ష్యం : ఆర్‌బీఐ గవర్నర్

న్యూఢిల్లీ : ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడమే రిజర్వ్ బ్యాంక్ తొలి ప్రాధాన్యతని గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆ తర్వాతే వడ్డీ రేట్ల తగ్గింపు యోచన ఉంటుందన్నారు. వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించే ఆలోచనేమీ లేదన్నారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి తగ్గించడంపైనే దృష్టి కేంద్రీకరించామన్నారు. వడ్డీ రేట్ల తగ్గింపుపై చర్చ కూడా జరగడం లేదన్నారు.

ఎన్‌కోర్-ఆల్కమ్ సీఎండీకి ప్రశంసలు

- ఆకర్షిస్తున్న సంస్థ ఉత్పత్తులు



హైదరాబాద్ : నగరంలోని హైటెక్స్ వేదికగా జరుగుతున్న ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో ఎన్‌కోర్-ఆల్కమ్ ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. ఆ సంస్థ స్టాల్‌ను శనివారం అదానీ పోర్ట్స్, లాజిస్టిక్స్ కార్పొరేట్ అఫైర్స్ ఎపి, తెలంగాణ హెడ్ పి అంజి రెడ్డి, రిలయన్స్ కార్పొరేట్ అఫైర్స్ ప్రతినిధి రవినాథ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఎన్‌కోర్-ఆల్కమ్ ఫౌండర్, సిఎండి అవుతు శివ కోటి రెడ్డి, ఆల్కమ్ డైరెక్టర్ జయంతి భాయ్ మనుభాయ్, ఎన్‌కోర్ డైరెక్టర్లు అవుతు పవన్ కుమార్ రెడ్డి, శ్రీ హర్షను వారు అభినందించారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. స్టాల్ లో 1.8 టన్నుల బరువున్న 18 అడుగుల ఎత్తైన విండోను ప్రదర్శిస్తున్నామని అవుతు శివ కోటి రెడ్డి తెలిపారు. కంపెనీ తయారు చేస్తున్న విభిన్న, వినూత్న ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరాయన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలను నియంత్రించాలి

- అక్రమ వెంచర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి నియంత్రించాలనీ, అక్రమ వెంచర్లపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఈ మేరకు రెరా చైర్మెన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసైన్డ్, చెరువు శిఖం, టెనెంట్ భూములు, లిటికేషన్ భూములను రైతుల నుంచి మార్కెట్ కన్నా తక్కువ ధరలకు కొంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటి ధరలను కోట్ల రూపాయలకు పెంచి పేదల సొమ్మును కొల్లగొడుతున్నారని విమర్శించారు. రెరా అనుమతులు లేకున్నా సినీహీరోలు, ఆర్టిస్టులు, సెలబ్రిటీలతో ఇష్టానుసారంగా ప్రకటనలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఆ వ్యవస్థపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చటం వల్ల వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని వాపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పర్యావరణాన్ని, వ్యవసాయాన్ని, సహజసంపదను ధ్వంసం చేస్తున్న తీరును వివరించారు. రియల్ ఎస్టేట్ నయా భూస్వామ్య విధానాన్ని నియంత్రించాలనీ, లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బి.ప్రసాద్, బి.పద్మ కె.జగన్, కె.మల్లేశ్, శ్రీను, కుమార్, సైదులు, పెంటయ్య బొల్లు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆ పులి కోసం మా దగ్గర బోనుంది

(మొదటిపేజీ తరువాయి)

అందరూ కలిసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందన్నారు.

36 నెలల్లో థేమ్స్ తరహాలో మూసీ నది అభివృద్ధి

థేమ్స్ నది చూశాననీ, ఒకప్పుడు అక్కడ కలుషితమైన వాతావరణముండేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల సహకారంతో దాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా, వ్యాపార కేంద్రంగా మారిందని గుర్తు చేశారు. తెలంగాణలో మూసీ నది కాలుష్యంతో మురికి కూపంగా మారిందన్నారు. థేమ్స్‌తో పోటీ పడేలా మూసీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనీ, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంతో పోటీ పడే విధంగా నడిపించాలని అన్నారు. 55 కిలోమీటర్ల మూసీ నదిని పూర్తిగా పునరుజ్జీవంగావించి ప్రజల ముందుంచాలనే గొప్ప లక్ష్యంతో ఈ పర్యటనకు వచ్చానని చెప్పారు. రాబోయే 36 నెలల్లో థేమ్స్ నదీ తరహాలో మూసీ నదిని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రప్రంచంలోని పర్యాటకులందరూ మూసీ నది అందాలను తిలకించడానికి హైదరాబాద్‌ను సందర్శించేలా చేస్తామన్నారు. గోల్కొండ, చార్మినార్, కులీకుతుబ్ షాహి టూంబ్స్‌ను చూడాలని కోరారు. నెక్లెస్‌రోడ్ మీద ఫోటోలు దిగాలనీ, మన చారిత్రక వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేసే బాధ్యత తమ ప్రభుత్వం మీద ఉందని వివరించారు. అందుకు ప్రజలే బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ పాలనను బంగాళాఖాతంలో విసిరేశారు

రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో తండాలు, గూడాలు, మారుమూల పల్లెలు, పట్టణాలు, నగరాల నుంచి ఇతర దేశాలలో ఉన్న అభిమానులు, మిత్రులు, కార్యకర్తలు, వాళ్ల బంధువులు, కుటుంబ సభ్యులు, సానుభూతి పరులందరినీ సమన్వయం చేశామని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న ఒక కుటుంబం చెరనుంచి తెలంగాణను విముక్తం చేశామన్నారు. తెలంగాణ తల్లికి విముక్తి కల్పించేందుకు అందరూ కృషి చేశారని చెప్పారు. అందుకే ఒక దశాబ్ద కాలం పీడ కలగా మారిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) పాలనను బంగాళఖాతంలో విసిరేశారని అన్నారు.

రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

20 ఏండ్లు ప్రతిపక్షంలో, ప్రజల్లో ఉంటూ సమస్యలమీద పోరాటం చేస్తూ నిత్యం వాటి పరిష్కారం కోసం అందరి మధ్యలో ఉన్నానని రేవంత్‌రెడ్డి చెప్పారు. అందుకే ప్రజలు గుండెల్లో పెట్టుకుని, భుజాలమీద మోసి తెలంగాణ ముఖ్యమంత్రిగా తనకు అవకాశమిచ్చారని అన్నారు. పునర్నిర్మాణంలో అందరి భాగస్వామ్యం తప్పనిసరి అని చెప్పారు. సముచితమైన నిర్ణయాలు తీసుకుంటూ తెలంగాణకు పెట్టుబడులను తేవాలన్న లక్ష్యంతో అధికారుల బృందంతో దావోస్‌కు వెళ్లానని వివరించారు. 48 గంటల్లో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం మీద అంతర్జాతీయ సంస్థలకు, పెట్టుబడిదారులకు ఒక నమ్మకం, విశ్వాసం కలిగించామని చెప్పారు. పెట్టుబడులకు కేంద్రంగా తెలంగాణను నిలబెట్టామని అన్నారు.

ప్రపంచంలోనే హైదరాబాద్ ప్రసిద్ధి

ఈ దేశంలోనే కాదు ప్రపంచంలోనే హైదరాబాద్ నగరం ప్రసిద్ధి గాంచిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ అభివృద్ధిలో ఇందిరాగాంధీ కృషి ఎంతో ఉందన్నారు. హైదరాబాద్ సరిహద్దుల్లో బీహెచ్ఈఎల్, బీడీఎల్, డైనమిక్ లిమిటెడ్, ఐడీపీఎల్ ఇలా ఎన్నో సంస్థలను ఆమె నెలకొల్పారని గుర్తు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు అప్పుడే గుర్తింపు వచ్చిందన్నారు. దేశానికి కంప్యూటర్లు పరిచయం చేసింది అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ అని అన్నారు. సంక్షేమానికి నందమూరి తారకరామారావు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరాధ్యులని వారి సేవలను కొనియాడారు. ఐటీ, అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ రంగం చూసినా ఆనాటి నాయకులు చేసిన అభివృద్ధికి, దానికి సహకరించిన విధానాలను కొనసాగించాలనే ఆలోచనతో అడుగులేస్తున్నామని వివరించారు. మంచి ఎవరు చేసినా ఆ పనులకు ఎవరు పునాది రాయి వేసినా వాటిని పాటించడానికి, కొనసాగించడానికి తమ ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి భేషజాల్లేవన్నారు.

ఆర్థిక సంక్షోభం నుంచి అభివృద్ధి పథంవైపు తెలంగాణ

కొంతమంది కుటుంబం కోసం రాష్ట్రాన్ని ఫణంగా పెట్టి లక్షలాది కోట్ల రూపాయలు దోపిడీ చేసి ఇప్పుడు అభివృద్ధి గురించి చర్చలే జరగొద్దంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించొద్దంటూ మాట్లాడుతున్నారని చెప్పారు. 60 ఏండ్లలో 16 మంది ముఖ్యమంత్రులు తెచ్చిన అప్పు రూ.72 వేల కోట్లయితే, ఒకే ఒక్క కుటుంబం ఈ పదేండ్లలోనే రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసిందని వివరించారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలో ముంచిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. ప్రతి నెల మొదటి వారం ఐదో తేదీలోపు జీతాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉంటే, 25 వరకు కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని అన్నారు. తెలంగాణ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతే తాను సీఎం అయ్యాక ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి నెలలోనే ఐదో తేదీలోపు జీతాలు చెల్లించామన్నారు. ఈ ఆర్థిక సంక్షోభం నుండి తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపిస్తామని చెప్పారు.

వందరోజుల్లో ఆరు గ్యారంటీల అమలు

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గతనెల తొమ్మిదిన అసెంబ్లీ మొదలు పెట్టిన మొదటి రోజే గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారంటూ బిల్లా రంగాలు (కేటీఆర్, హరీశ్‌రావు) మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఆ పార్టీనీ ఆ నాయకులను బొక్కబోర్ల పడేసి బొక్కలు ఇరగ్గొట్టినా బుద్ధి రాలేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చూసుకుందామని బీఆర్ఎస్ నేతలకు ఆయన సవాలు విసిరారు. 26వ తేదీ తర్వాత ఇంద్రవెల్లిలో మొదలు పెట్టి రాష్ట్రం నలుమూలలా సుడిగాలి పర్యటన చేస్తానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నిషాన్ లేకుండా వంద మీటర్ల గోతి తీసి పాతిపెడతానని అన్నారు.

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చా...

ఎన్నికలప్పుడే రాజకీయం, మిగతా సమయంలో పరిపాలనా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. అభివృద్ధి, సుపరిపాలన వైపు రాష్ట్రాన్ని నడిపాలంచాలన్న ఆలోచనతో అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. తాను సామాన్యమైన రైతు కుటుంబం నుంచి వచ్చినవాణ్నేనని అన్నారు. నల్లమల అడవిలోంచి రైతు బిడ్డగా అతి సామాన్యమైన కుటుంబం నుంచి కార్యకర్తగా మొదలై ఇన్నేండ్లలో ముఖ్యమంత్రి హోదాకు చేరుకున్నానని వివరించారు. తాను ఆషామాషీగా సీఎం కాలేదన్నారు. అయ్యో బాబో ఇస్తే ఇది రాలేదనీ, అయ్య పేరు చెప్పుకుని మంత్రి అయి విలాసవంతమైన జీవితాన్ని గడిపేటందుకు రాలేదని కేటీఆర్‌నుద్దేశించి ఎద్దేవా చేశారు.

ప్రపంచంతోనే పోటీ

కర్నాటకో, తమిళనాడో, ఆంధ్రప్రదేశో, ఒడిశాతోనో పోటీ పడాలని రాలేదనీ, అది తన లక్ష్యం కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రపంచంతోనే పోటీ పడాలనే ఆలోచనతో ఉన్నానని చెప్పారు. ప్రపంచంతోనే పోటీ పడే ఐటీ హబ్ హైదరాబాద్‌కు ఉందనీ, లక్షలాది మంది ఐటీ నిపుణులున్నారని వివరించారు. ప్రపంచానికే వ్యాక్సిన్లను ఎగుమతి చేసి వాటిని కనిపెట్టిన సంస్థలు తెలంగాణ గడ్డ మీద ఉన్నాయని చెప్పారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లకుపైగా పాదయాత్ర చేశారని అన్నారు. అందరి బాధలు విన్నారని చెప్పారు. కర్నాటక, తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో అందరి సహకారంతో లాల్ ఖిలాపై కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నామని అన్నారు.

ఆవేదన.. ఆగ్రహం...

- లాబీయింగ్ చేసే వారికే పదవులంటూ నేతల ఆక్రోశం
- మీటింగ్ పూర్తయ్యే వరకూ ఉండాలంటూ కేటీఆర్ ఆదేశం
- బీఆర్ఎస్ హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు సన్నాహక సమావేశం తీరిది
- నేడు మల్కాజ్‌గిరిపై సమీక్ష - రేపు నల్లగొండ నేతలతో భేటీ
- చివరి అంకానికి బీఆర్ఎస్ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్యకర్తలు, నాయకుల ఆవేదనలు.. అగ్రనేతల ఆగ్రహాలు... వెరసి బీఆర్ఎస్ పార్లమెంటు సన్నాహక సమావేశాలు ఆత్మస్తుతి తక్కువ, పరనింద ఎక్కువ అనే టైపులో కొనసాగుతున్నాయి. ఈనెల మూడో తేదీన ప్రారంభమైన ఈ భేటీలు తుది అంకానికి చేరుకుంటున్నాయి. శనివారం హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలపై సమీక్ష నిర్వహించగా, ఆదివారం మల్కాజ్‌గిరి నేతలతో భేటీ నిర్వహించనున్నారు. సోమవారం నల్లగొండ ఎంపీ స్థానంపై నిర్వహించబోయే సన్నాహక సమావేశం... ఈ మొత్తం భేటీల్లో చివరిది కానుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ ఎంపీ స్థానాలపై సమీక్ష సందర్భంగా ఆయా నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు... బీఆర్ఎస్ అధిష్టానంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీ అధికారంలో ఉన్న పదేండ్లు కార్యకర్తలను, క్యాడర్‌ను అస్సలు పట్టించుకోలేదని వారు వాపోయినట్టు వినికిడి. మొదటి నుంచి కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా, కేవలం లాబీయింగ్ చేసిన వారికే వాటిని ఇచ్చారంటూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీల్లో నిజమైన కార్యకర్తలకు స్థానం కల్పించాలంటూ కోరారు.

అయితే ఇదే సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జంట నగరాల నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఎక్కడో ఉన్న ఆదిలాబాద్, భద్రాచలం నుంచి భేటీల కోసం వచ్చిన నాయకులు... ఎంతో ఓపిగ్గా కూర్చుని, సాయంత్రం వరకూ సమావేశంలో కూర్చున్నారని ఆయన తెలిపారు. అయితే హైదరాబాద్, సికింద్రాబాద్ నేతలు మాత్రం తాము మాట్లాడాల్సిన మాటలు మాట్లాడి, వెంటనే వెళ్లిపోతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదనీ, మీటింగ్ పూర్తయ్యే వరకూ సమావేశంలోనే ఉండాలంటూ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా ఎంపీ అభ్యర్థులెవరో చెప్పటం లేదనీ, చివరి క్షణాన ఫలానా ఆయన్ను నిలబెడుతున్నామంటూ చెప్పటం ఆనవాయితీగా మారిందంటూ కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలోనే కొందరు నేతలు వాదించినట్టు సమాచారం. అభ్యర్థులను ముందుగానే క్యాడర్‌కు పరిచయం చేస్తే వెంటనే రంగంలోకి దిగటం సాధ్యమవుతుందని వారు వివరించారు. ఈ క్రమంలో సీనియర్ నేతలు వాదనకు దిగిన వారికి సర్దిచెప్పి, శాంతిపజేశారు.

తెలంగాణ గొంతు కోసిన కాంగ్రెస్ : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

కేఆర్ఎమ్‌బీ పరిధిలోకి సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను తేవాలన్న కేంద్రం నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించటం శోచనీయమని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈ రకంగా కాంగ్రెస్... తెలంగాణ గొంతు కోసిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కేఆర్ఎమ్‌బీ విషయంలో కాంగ్రెస్ నేతలు, మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించటం విడ్డూరంగా ఉందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులను ఆ బోర్డు పరిధిలోకి చేర్చకుండా కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్లు ఆపగలిగారని చెప్పారు.

ఎలక్టోల్ క్యాంపేయన్‌కు భారీ స్పందన

- మొదటి రోజు 43,176 ధరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అర్హులైన ఓటర్ల నుంచి ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచారానికి భారీ స్పందన లభించిందని తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఏర్పాటు చేసిన ఈ క్యాంపేయిన్‌లో మొదటి రోజు మొత్తం 43,176 ధరఖాస్తులు అందాయన్నారు. అందులో ఫాం-6 ద్వారా 25,347, ఫాం-7 ద్వారా 7,984 ఫాం-8 ద్వారా 9,845 వచ్చినట్టు తెలిపారు. నేడు కూడా అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పౌరులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కసీటూ రాదు

- కృష్ణా జలాలపై ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకుపోలేదు?
- బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదనీ, కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు, సంతోశ్‌కుమార్ పోటీచేసినా ఓటమి తప్పదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఎద్దేవాచేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటాకు ఒప్పందం చేసుకుంది కేసీఆరేననీ, ఒకవేళ తెలంగాణకు అన్యాయం జరిగితే అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకుపోలేదని ప్రశ్నించారు.

తెలంగాణకు 299 టీఎంసీలు చాలని కృష్ణా జలాల పంపకాల సమావేశంలో కేసీఆర్ సంతకం పెట్టింది వాస్తవం కాదా? ఈ విషయం ఆనాడు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తే బీజేపీని బద్నాం చేసేందుకు ప్రచారం మొదలుపెడుతున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఏం లాభం జరిగిందో అమరవీరుల స్థూపం వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అందరికంటే ఎక్కువ స్థానాలను తమ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులు, కార్యకర్తలకు కనీసం గౌరవించకపోవడం వల్లనే నేడు ఆ పార్టీకి ఇలాంటి దుస్థితి దాపురించిందని విమర్శించారు.

పార్లమెంటు ఎన్నికల్లో వందలకోట్లు సమర్పించుకున్న వారికే బీఆర్ఎస్ టిక్కెట్లు అమ్ముకుంటారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి, రాణా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

హైద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

- కేసీఆర్‌కు బీఆర్ నేత కమలాకర్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ లోకసభ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పట్నం కమలాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు విన్నవించారు. పార్టీ ఆరంభం నుంచి ఉద్యమంలో కలిసి పనిచేసానని గుర్తు చేశారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఈ నియోజక వర్గంలో దాదాపు 2 లక్షలకు పైగా ఉన్నాయని తెలిపారు. పార్టీకి చేసిన సేవతో పాటు నియోజక వర్గంలో ఉన్న తమ వర్గం ఓట్లను దృష్టిలో పెట్టుకుని పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులకు 600 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)లో చైర్మెన్, సభ్యుల నియామకానికి సంబంధించి 600 దరఖాస్తులొచ్చాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా టీఎస్‌పీఎస్సీలో ఖాళీగా ఉన్న చైర్మెన్, సభ్యుల నియామకానికి అర్హులైన వారి నుంచి ఈనెల 18 వరకు దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. రిటైర్డ్ ప్రొఫెసర్లు, సర్వీసులో ఉన్న వారు, మాజీ ఐఏఎస్, ఐపీఎస్, ప్రస్తుతం పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసినట్టు సమాచారం. ఎక్కువ మంది ప్రొఫెసర్లు దరఖాస్తులను సమర్పించినట్టు తెలిసింది. స్వీకరించిన దరఖాస్తుల నుంచి లేదా ఇతరత్రాగానీ, ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీ/స్క్రీనింగ్ కమిటీ పరిశీలిస్తుంది. అర్హులైన వారి జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. అయితే టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి డాక్టర్ బి జనార్ధన్‌రెడ్డి గతనెల 11న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకైక సభ్యురాలిగా కోట్ల అరుణకుమారి కొనసాగుతు న్నారు.

జలాశయాలలో సోలార్ విద్యుత్ కేంద్రాలు వద్దు!

- తెలంగాణ ఫిషరీస్ సొసైటీ అభ్యంతరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని జలాశయాల్లో సౌరశక్తి ఆధారంగా నీటిపై తెలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలను బేషరతుగా విరమించుకోవాలని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మెన్ పిట్టల రవీందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జలాశయాలలో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడాన్ని ఆయన ఒక ప్రకటనలో తప్పుపట్టారు. సర్కారు తీసుకునే నిర్ణయం వల్ల రాష్ట్రంలో లక్షలాదిమంది మత్స్యకారుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని జలాశయాలలో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలని ప్రతిపాదించిందనీ, దానితో ఉత్పన్నమయ్యే సామాజిక, పర్యావరణ సంబంధమైన సమస్యలపై తమ సంస్థ వ్యక్తం చేసిన అభిప్రాయాలను మన్నించి వాటి నిర్మాణాన్ని పక్కకు పెట్టిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని 130 రిజర్వాయర్లలో దాదాపు రెండు లక్షల మంది మత్స్యకారులు జీవనోపాధిని పొందుతున్నారనీ, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల చేపల వేటకు తీవ్రమైన ఆటంకాలు తలెత్తుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనం నిధులు రూ.107 కోట్లు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మధ్యాహ్న భోజనం పథకం పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు సంబంధించి శనివారం రూ.70 కోట్ల బిల్లులను మంజూరు చేసింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉన్నది. తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల బిల్లుల కోసం రూ.27 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో మధ్యాహ్న భోజనానికి సంబంధించి మొత్తం రూ.107 కోట్లు మంజూరు చేసింది. మరో రూ.తొమ్మిది కోట్లు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉండగా, త్వరలోనే మంజూరు చేయనున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

తెలంగాణ కళాకారులకు కేటీఆర్ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీ షర్టుల పైన జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) చేర్యాల్ పెయింటింగ్‌ని వేసిన తెలంగాణ కళాకారులు రాకేష్, వినయ్‌లకి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఇలాంటి వినూత్నమైన పద్ధతుల వల్ల సాంప్రదాయ కళలకు మరింత డిమాండ్ వస్తుందని శనివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. వాటికి మరింత ఆన్‌లైన్ మార్కెటింగ్, బ్రాండింగ్ అవసరముందని వివరించారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ పొందిన చేర్యాల పెయింటింగ్ వంటి ఉత్పత్తులకు ప్రచారం వల్ల కళాకారులకు ఎంతో లబ్ది చేకూరుతుందని తెలిపారు. రాకేష్, వినయ్‌లు రూపొందించిన టీ షర్టులను తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు.

కొండనుతవ్వి.. ఎలుకను పట్టారు...?

దాసోజు శ్రావణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ దావోస్ పర్యటన... కొండను తవ్వి, ఎలుకను పట్టిన చందంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అక్కడ కూడా ఆయన చిల్లరగానే వ్యవహరించారని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో దాసోజు మాట్లాడుతూ... దావోస్ పర్యటనను సీఎం తన రాజకీయాలకు వేదికగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. ఆ సందర్భంగా రాష్ట్ర ప్రతిష్టను పెంచటం కంటే తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకోవటానికే ఆయన ప్రాధాన్యతనిచ్చారని దుయ్యబట్టారు.

ఉద్యమకారుల్లోని అసంతృప్తిని గుర్తించాం...

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేకే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు సన్నాహక సమావేశాల సందర్భంగా తమ పార్టీకి పునాదులైన ఉద్యమకారుల్లోని అసంతృప్తిని గుర్తించామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు అన్నారు. వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. శనివారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలపై సమీక్షా సమావేశానంతరం కేకే మీడియాతో మాట్లాడారు. పార్టీలో యువతను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరముందని చెప్పారు. బీఆర్ఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేస్తామనీ, ప్రతీ మూడు నెలలకోసారి మండల స్థాయి నుంచి మీటింగులు నిర్వహిస్తామని తెలిపారు.

డీఎంకే ఏ మతానికీ వ్యతిరేకం కాదు

- మసీదు కూల్చివేతను మాత్రం ఒప్పుకోదు : తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్

చెన్నై : అయోధ్యలో బాబ్రీ మసీదు నిర్మాణాన్ని కూల్చివేసి, రాముని గుడిని నిర్మించటంపై డీఎంకే కీలక నాయకుడు, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. డీఎంకే పార్టీ ఏ మతానికీ వ్యతిరేకం కాదనీ, మసీదు కూల్చివేతను మాత్రం సమర్థించదని అన్నారు. "మేము (డీఎంకే) ఏ మతానికి గానీ, మత విశ్వాసానికి గానీ వ్యతిరేకం కాదని కలైంజర్(కరుణానిధి) ఎప్పుడో చెప్పారు. కానీ మసీదును కూల్చివేసి ఆ ప్రదేశంలో గుడిని నిర్మించటాన్ని మేము ఒప్పుకోం. మా పార్టీ కోశాధికారి టి.ఆర్. బాలు చెప్పినట్టే రాజకీయాలను, ఆధ్యాత్మికతను కలపకూడదన్న విషయంలో మేము స్పష్టంగా ఉన్నాం" అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు.



డైరెక్టర్ త్రివిక్రమ్ ఓ అజ్ఞాని

- 'గుంటూరు కారం' సినిమాలో విలన్ల పాత్రల పేర్లను తొలగించాలి
- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్
- త్రివిక్రమ్ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ- ముషీరాబాద్

సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ అజ్ఞానం నుంచి బయటపడాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు అన్నారు. గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సినిమా దర్శకుడు త్రివిక్రమ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. సమ సమాజం కావాలని, ఆకలి, పేదరికం పోవాలని కోరుకున్న మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు పెట్టడం వారిని అవమానించడమేనన్నారు. మహనీయులను అగౌరపరిచే విధంగా ఉన్న సన్నివేశాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. త్రివిక్రమ్‌కు చిత్తశుద్ధి ఉంటే మార్క్స్, లెనిన్ జీవితాల ఆధారంగా సమాజ గమనానికి ఉపయోగపడే విధంగా సినిమాలు తీయగలరా అని ప్రశ్నించారు. పీడీఎస్‌యూ నాయకులు ఎస్.నాగేశ్వరరావు, పి.రామకష్ణ మాట్లాడుతూ.. మార్క్స్, లెనిన్ రచించిన సిద్ధాంతం ఆధారంగా అనేక దేశాల్లో విముక్తి పోరాటాలు జరిగాయని, పేదరికం నుంచి విముక్తి పొందారని తెలిపారు. అలాంటి మహోన్నత వ్యక్తులు పేర్లను విలన్లకు పెట్టడం సిగ్గుచేటన్నారు. తివిక్రమ్ తక్షణమే పేర్లను తొలగించాలని లేకపోతే ఆయన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం గుంటూరు కారం సినిమాలో మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని కోరుతూ ఫిల్మ్ చాంబర్‌లో సెక్రటరీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.మమత, అశోక్ రెడ్డి, లెనిన్, జె.రమేష్, స్టాలిన్, శ్రీమాన్, పీడీఎస్‌యూ నాయకులు పి.మహేష్, ఏఐవైఎఫ్ నాయకులు ధర్మేంద్ర, పీవైఎల్ నాయకులు కృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు చైతన్య యాదవ్, వెంకట్ పాల్గొన్నారు.

దేశాన్ని బలమైన శక్తిగా మార్చడమే లక్ష్యం

- కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్



నవతెలంగాణ - బీబీనగర్

భారతదేశాన్ని అన్ని రంగాల్లోనూ ప్రపంచంలోనే బలమైన శక్తిగా మార్చడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని కేంద్ర విద్యుత్ శాఖ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి రాజ్ కుమార్‌సింగ్ అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదేండ్లలో జరిగిన ప్రగతిని ప్రజల దగ్గరకు తీసుకెళ్లడానికి వికసిత్ భారత్ సంకల్పయాత్రను ప్రారంభించినట్టు తెలిపారు. ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్, తాగునీరు, పేదలకు పక్కా ఇళ్లు అనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఇప్పటివరకు మూడు కోట్ల మందికి పక్కా ఇండ్లు ఇచ్చినట్టు చెప్పారు. ఈ పదేండ్లల్లో 25 కోట్ల మందిని పేదరికం నుంచి పైకి తీసుకొచ్చామన్నారు. ప్రపంచంలో మూడో ఆర్థిక అభివృద్ధి చెందిన దేశంగా నిలిచామని చెప్పారు. అయుష్మాన్ భారత్ ద్వారా ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించామని, జన ఔషధ కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. పేదలకు వైద్య సహాయంలో భాగంగా ఎయిమ్స్ సేవలు విస్తృతం చేశామన్నారు. ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ బాటియా మాట్లాడుతూ.. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఎయిమ్స్ ఆస్పత్రి ఆరు గ్రామాలను దత్తత తీసుకున్నట్టు చెప్పారు. దత్తత గ్రామాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు, సేవలు అందించామన్నారు. వసుంధర సమ భావన సంఘం, ఇతర 20 సంఘాలకు కలిపి మూడు కోట్ల రూపాయల విలువగల చెక్కును కేంద్రమంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల ఆధునిక కలెక్టర్ వీరారెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, కెనరా బ్యాంక్ ఏజీఎం శాంతి కుమార్, స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ జనరల్ మేనేజర్ కుమార్, ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బిపిన్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

22న మాకు భద్రత కల్పించండి

- పోలీసుల్ని ఆశ్రయించిన అయోధ్యలోని ముస్లింలు

అయోధ్య : ఈ నెల 22న రామ మందిరం ప్రారంభం నేపథ్యంలో తమకు భద్రత కల్పించాలని అయోధ్యలోని ముస్లింలు పోలీసుల్ని ఆశ్రయించారు. సోమవారం కొన్ని లక్షల మంది అయోధ్యకు రానున్నారని, అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయనే భయాందోళనలు కలుగుతున్నాయని పోలీసులకు ముస్లింలు వెల్లడించారు. అయోధ్యలో నివాసం ఉండే హిందువులు గురించి తమకు ఎలాంటి భయం లేదని, అయితే బయట నుంచి వచ్చే వ్యక్తులు ఏమి ఆలోచిస్తున్నారో, ఏమి ప్లాన్ చేస్తున్నారో తమకు తెలియదని ముస్లింలు తెలిపారు. 'ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగవని అధికారులు మాకు హామీ ఇచ్చారు. అయితే లక్షలాది మంది యాత్రికుల్లో ఖచ్చితంగా భిన్నమైన ఉద్దేశాలు కలిగి ఉంటారు' అని ముస్లింలు తెలిపారు. అయోధ్యలో 1990, 1992 సంవత్సరాల్లో మతపరమైన సంఘటనలు జరిగిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ' ఈ నెల 22 నుంచి అయోధ్యకు పెద్ద సంఖ్యలో బయటి వ్యక్తులు సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు. కాబట్టి అయోధ్యలో నివసిస్తున్న ముస్లింలు ప్రాణ, ఆస్తి, ప్రార్థన స్థలాలు గురించి భయపడుతున్నారు. అలాగే గత అనుభవాల దృష్ట్యా తీన్ వాలీ మసీదు, గోల్ చౌరహా సయ్యద్‌బారా, బేగంపురా, దురాహీ కువాన్, మొఘల్‌పుర వంటి ప్రాంతాల్లో కట్టుదిట్టమైన నిఘా, భద్రత కోసం అభ్యర్థిస్తున్నాం' అని ముస్లింలు తెలిపారు. ఈ మేరకు అయోధ్య డివిజన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇప్పటికే కొందరు ముస్లింలు తమ పిల్లలను, మహిళా కుటుంబ సభ్యులను ఇతర పట్టణాల్లోని బంధువులు, స్నేహితుల ఇళ్లకు పంపినట్లు తెలిపారు.

రోడ్డు పక్కన రేలింగ్‌ను ఢీకొట్టిన కారు

- ముగ్గురు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారు రోడ్డు పక్కన రేలింగ్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కారు శనివారం తెల్లవారు జామున చాంద్రాయణ గుట్ట నుంచి మామిడిపల్లి వెళుతున్నది. అయితే అతివేగం, నిర్లక్ష్యంగా నడపటం వల్ల మార్గమధ్యలో హార్డ్‌వేర్ పార్క్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టింది. దాంతో కారు నుజ్జు నుజ్జు కావటంతోపాటు డ్రైవింగ్ చేస్తున్న హుస్సేని హలాం పత్తే దర్వాజాకు చెందిన మహమ్మద్ సాజిద్(18), హస్సన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అక్బర్(22), లంగర్‌హౌస్‌కు చెందిన వివాహిత నజ్రియా బేగం(23) అక్కడికక్కడే మృతిచెందారు. హస్సన్‌నగర్‌కు చెందిన నాయిమొద్దిన్, ముస్కాన్ మేహరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ ప్రయివేటు ఆస్పత్రికి పంపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో అలసత్వం చూపొద్దు

- క్షేత్రస్థాయి పర్యటనలు పెరగాలి
- వన్యప్రాణుల మరణాలు మళ్లీ చోటుచేసుకోవద్దు : ఫారెస్టు అధికారులతో పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



అటవీశాఖ అధికారులు విధుల్లో అలసత్వం చూపకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం డోబ్రియల్ సూచించారు. తరుచూ క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. వన్యప్రాణుల మరణాలు మళ్లీ చోటుచేసుకోకుండా చూడాలని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ నుంచి అటవీ శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి పాత్ర చాలా కీలకమనీ, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కి చెప్పారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో రెండు పెద్ద పులులు చనిపోవటం అత్యంత బాధాకరమన్నారు. అటవీశాఖ చేపట్టిన పలు చర్యల వల్ల కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కారిడార్) పులులకు శాశ్వత నివాసంగా మారుతోందనీ, ఇలాంటి సమయంలో పులులు మరణించకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండేదన్నారు.

అటవీ అధికారులు, సిబ్బంది పనితీరులో అలసత్వం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చీఫ్ కన్జర్వేటర్ స్థాయి నుంచి బీట్ అధికారి వరకు ప్రతీ ఒక్కరూ తరచుగా క్షేత్ర పర్యటనలు చేయాలనీ, కేటాయించిన అటవీ బీట్‌లలో ఫుట్ పెట్రోలింగ్ చేయాలని (కాలినడక పర్యవేక్షణ) చెప్పారు. అడవులకు నష్టం చేసేవారిని, వన్యప్రాణులను హతమార్చే వారిని శిక్షించేందుకు అత్యంత కఠినమైన అటవీ చట్టాలు ఉన్నాయనీ, వాటి ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్ఫార్మర్లతో పాటు, నిఘా వ్యవస్థను పటిష్టపర్చుకోవాలని సూచించారు. అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు పెంచాలని సూచించారు. చెక్ పోస్టులను పటిష్టం చేయటంతో పాటు, నైట్ పెట్రోలింగ్‌ను మరింతగా పెంచాలనీ, ఆధునిక సాంకేతికతను వాడాలని ఆదేశించారు.

సమర్థవంతంగా క్యాచ్ ద ట్రాప్ కొనసాగింపు : పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎం.సీ పర్గెయిన్

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన క్యాచ్ ద ట్రాప్ (ఉచ్చులు, వలలను పట్టుకోవటం) సమర్థవంతంగా కొనసాగుతున్నదనీ, ఇప్పటి వరకు 1320 ఉచ్చులను అటవీ శాఖ స్వాధీనం చేసుకున్నదని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎంసీ.పర్గెయిన్ చెప్పారు. సుమారు ఏడు వందల కేజీల ఇనుప వస్తువులను సిబ్బంది పట్టుకున్నారని తెలిపారు. అచ్చంపేట, కాగజ్ నగర్ జిల్లాల్లో 12 చొప్పున కేసులు నమోదయ్యాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాలకు చెందిన చీఫ్ కన్జర్వేటర్లు, ఫీల్డ్ డైరెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు, డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు మావోయిస్టులు మృతి

- మృతుల్లో ఇద్దరు మహిళలు
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో శనివారం తెల్లవారుజామున పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బలమేంద్ర సమీపంలోని బెళంగుట్ట కొండల్లో జరిగింది. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. బీజాపూర్ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 19వ తేదీన అడవుల్లో మద్దె ఏరియా కమిటీకి చెందిన డీవీసీఎం వినోద్ కర్మ, ఆవుపల్లి ఎల్ఓఎస్ రాజు పుణేం, ఏసీఎం విశ్వనాథ్, గుడ్డు తేలం తదితరులు 20 నుంచి 25 మంది మావోయిస్టులు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దాంతో బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలమేంద్ర, డీఆర్‌జీ బీజాపూర్ కోబ్రా 210 మందితో కూడిన సంయుక్త పోలీస్ బృందం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌కు బయలుదేరి అడవులను జల్లెడ పట్టడం ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో 20వ తేదీన ఉదయం 7.30 గంటలకు బెళం గుట్ట కొండల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళలతో కలిపి మొత్తం ముగ్గురు మావోయిస్టులను హతమర్చారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ప్రచార సామగ్రి, మావోయిస్టు యూనిఫామ్‌లు, మందులు, ఇతర నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు నిరంతరంగా పెట్రోలింగ్, సోదాలు నిర్వహిస్తున్నారు.

యశోద ఆస్పత్రిలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్‌షాప్

ఎక్మోపై మూడ్రోజుల కార్యక్రమం

నవతెలంగాణ-బేగంపేట్



హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో ఎక్మో సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా ఎక్మో(ఈసీఎంఓ)పై 13వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. మూడ్రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌కు దేశ నలుమూలల నుంచి సుమారు 1000 మందికి పైగా ఎక్మో వైద్యులు, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు. దశాబ్ద కాలంలో భారతదేశంలో జరిగిన అతిపెద్ద ఎక్మో సమావేశాలలో ఇది ఒకటి.

ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. దాదాపు 40 ఏండ్ల కిందటే ఎక్మోకు రూపకల్పన జరిగినా పరిశోధనలు, వాడకలో అనుభవాల కారణంగా ఎక్మో ఉపయోగించడం చాలా తక్కువగా ఉండేదన్నారు. ఇప్పుడు ఎక్మో పరికరం వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న సమయాల్లో గుండె, ఊపిరితిత్తులు పనిచేయని సమయంలో ఉపయోగకరంగా మారిందన్నారు. దేశంలో కోవిడ్ మహమ్మారి తర్వాత ఎక్మో అవసరం పెరిగిందని చెప్పారు. కోవిడ్ సమయంలో ఎక్కువ మంది రోగులను 'ఎక్మో' సహాయంతో కాపాడిన ఆస్పత్రుల్లో యశోద హాస్పిటల్స్ ఒకటి అన్నారు. ఎక్మో మద్దతు, ఊపిరితిత్తుల మార్పిడితో ప్రాణాలను కాపాడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో 100 కంటే ఎక్కువ ఎయిర్ అంబులెన్స్ బదిలీలు యశోద హాస్పిటల్స్‌కు జరిగాయని తెలిపారు. ఈ సదస్సు నైపుణ్యాన్ని పంచుకోవడంపై దృష్టి సారించి, రోగుల సంరక్షణలో ఆవిష్కరణ, సహకారం, శ్రేష్టతను పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

యశోద హాస్పిటల్స్ సీనియర్ క్రిటికల్ కేర్ మెడిసిన్ స్పెషలిస్ట్, డాక్టర్ వెంకట్‌రామన్ కోలాలి మాట్లాడుతూ.. మరణం అంచు నుంచి మళ్లీ నిండు జీవితం వైపు మళ్లించే పరికరం ఎక్మో అన్నారు. వ్యక్తి గుండె, ఊపిరితిత్తులు పని చేయని సమయంలో ఎక్మో పరికరాన్ని ఉపయోగించి ఆ వ్యక్తి శ్వాసకోశాలు, గుండె చేసే పనులను శరీరం బయట చేస్తారని తెలిపారు. ఎక్మో ఆపరేటింగ్‌లో ఉన్న వివిధ సంక్లిష్టతలను అర్థం చేసుకోవడంతోపాటు ఎక్మో వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునే విధంగా ఈ సదస్సు రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ సదస్సు లో అడల్ట్ అండ్ పీడియాట్రిక్ వైద్యులు, పారామెడికల్ స్టాఫ్ పెర్ఫ్యూనిస్ట్ నర్సింగ్, రెస్పిరేటరీ థెరపిస్ట్‌లు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో విశ్రాంత కలెక్టర్ ఎంవీ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలోని అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పించాలని విశ్రాంత కలెక్టర్ ఎంవీ రెడ్డి డిమాండ్ చేశారు. 'అసైన్డ్ భూముల శాశ్వత హక్కుల సాధన సమితి' ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ పేర్లతో పిలుస్తున్న 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని కోరారు.హక్కులు లేకపోవడంలో దాదాపు 15 లక్షల కుటుంబాలు అభద్రాభావంతో వాటిని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆ భూములకు అమ్ముకునే హక్కులు లేవన్నారు. చట్టంలో మార్పులు, చేర్పులు చేసి ఆయా భూములను వారికి అప్పగించాలని కోరారు. భూములున్నా...తమ అవసరాలకు అమ్ముకునే వీలు లేకపోవడం అన్యాయన్నారు. ప్రభుత్వ అవసరాలకు మాత్రం అసైన్డ్ భూములు యాద్చేచ్ఛగా ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటిని కొన్నారని తెలిపారు. వారు ఇతరులకు విక్రయించిన తర్వాత ఇండ్లు నిర్మించుకున్నారని చెప్పారు. ఆ ఇండ్లకు అన్ని అనుమతులున్నా వారికి అమ్ముకునే హక్కులేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 20 ఏండ్ల తర్వాత ఇలాంటి భూములను అమ్ముకోవచ్చని ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందన్నారు. అనేక రాష్ట్రాలు అసైన్డ్ భూములను బదలాయించేందుకు అవకాశం కల్పించాయన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పినట్టు రాష్ట్రంలో కూడా అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు మన్నె నర్సింహ్మారెడ్డి, గుమ్మి రాజ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, బక్క జడ్సన్, హర్షవర్ధన్‌రెడ్డి, ఇందిరాశోభన్ పోశాల, చంద్రశేఖర్ మాట్లాడారు.

హైకోర్టుకు వర్సిటీ భూములను కేటాయించొద్దు

జీవో 55ను రద్దు చేయాలి: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

వ్యవసాయ, ఉద్యానవన వర్సిటీలకు చెందిన 100 ఎకరాల భూమిని కొత్త హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ ఇచ్చిన జీవో 55ను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు నిర్మాణానికి బీఎస్పీ వ్యతిరేకం కాదన్న ఆయన.. అవసరమైతే వర్సిటీ భూముల్లో కాకుండా కేబీఆర్ పార్క్, ఇందిరా పార్క్, బయోడైవర్సిటీ పార్కుల్లో హైకోర్టు నిర్మాణం చేపట్టాలని సవాల్ చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ వ్యవసా య విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఎదుట 12 రోజులుగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులను ఆయన పరామర్శించి వారికి మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పులే మళ్ళీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందన్నారు. ప్రపంచానికి అన్నం పెట్టే రైతాంగానికి నూతన వంగడాలను సృష్టించి, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వ్యవసాయ శాస్త్ర వేత్తలను అందించే వర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మాణం చేపడితే వర్సిటీ బయో డైవర్సిటీ దెబ్బతింటుందని తెలిపారు. అరుదైన పక్షులు, జంతువులు, వృక్షజాతుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రభుత్వం వర్సిటీ భూము లను బలవంతంగా గుంజుకొని, హైకోర్టు కేటాయించడమంటే వ్యవసాయరంగాన్ని తుంగలో తొక్కి, గ్రామీణ ప్రాంత యువతను విద్యకు దూరం చేయడమేనని ఆరోపించారు. ఎన్నో ఏండ్లుగా వర్సిటీలో మెడికల్ ప్లాంట్స్, విత్తనాలు లాంటి అనేక వంగడాలపై ఎన్నో రకాల పరిశోధనలు జరిగాయని గుర్తుచేశారు. విమానాశ్రయానికి, ఐటీ కంపెనీలకు దగ్గరున్న వర్సిటీలో హైకోర్టు నిర్మాణం చేపట్టడమంటే రియల్ ఎస్టేట్‌ను పెంచడమేనని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీవో 55ను రద్దు చేసి, ఇతర ప్రభుత్వ భూముల్లో హైకోర్టును నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం భూముల కేటా యింపును నిరసిస్తూ ఆగ్రో బయోడైవర్సిటీలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విజయ్ ఆర్య, జిల్లా నాయకులు ప్రవీణ్, స్వప్న, మల్లగాళ్ల యాదగిరి, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి రాచమల్ల జయసింహ, అసెంబ్లీ అధ్యక్షులు యాపచెట్టు యాదగిరి పాల్గొన్నారు.

వ్యవసాయానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించండి

- మంత్రి తుమ్మలకు కిసాన్ కాంగ్రెస్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ రంగానికి, రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీమేరకు వచ్చే బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కిసాన్ కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శనివారం సచివాలయంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మెన్ అన్వేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి సమర్పించారు. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ విధానాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. వాస్తవ సాగు భూముల విస్తీర్ణాన్ని నిర్ధారించడం ద్వారా సాగు కాని భూములకు కూడా నిధులు ఖర్చు చేయకుండా నియంత్రణ విధించాలని సూచించారు.

2500 ఎకరాలకు లేదా వెయ్యి మంది రైతులకు ఒకరి చొప్పున ఏఈవోలను నియమించాలని కోరారు. రైతుకు సేవలందించేందుకు వారికి రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. రైతు వేదికలను వ్యవసాయ అనుబంధ శాఖ సమన్వయ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల కంపెనీల మధ్య సమన్వయం కోసం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నోడల్ ఏజెన్సీగా ఒక ప్లాట్ ఫారం ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ప్రతి సీజన్‌లో వాస్తవ సాగుదారులను గుర్తించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మోసం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ కమిటీ

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దళితులను మోసం చేసేందుకే బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కమిటీని నియమించిం దని ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ సంపత్‌కుమార్ విమర్శించారు. ఆ కమిటీని నియామకాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు చారకొండ వెంకటేష్, సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.పదేండ్ల తన హయాంలో బీజేపీ దేశానికి ఏమీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉషా మెహ్రా కమిటీ నివేదిక సిద్ధంగా ఉందని, చిత్తశుద్ధి ఉంటే దానిని అమలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దళితులను దగా చేసేందు కు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కమిటీ పేర దళితులను మోసం చేసిందని తెలిపారు.

ధరణిపై లోతైన విచారణ జరిపిస్తాం

- కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్‌పై లోతైన విచారణ జరిపిస్తామని కిసాన్ కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుందని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో మంత్రి హోదాలో దావోస్ పర్యటించిన కేటీఆర్ కాకిలెక్కలు చెప్పారని విమర్శించారు. విధ్వంసం అయిన వ్యవస్థను చక్కబెట్టడానికి కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయమైనా ఇవ్వాలని సూచించారు.

ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నేతలు అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో భూముల రిజిస్ట్రేషన్ వ్యవస్థ చాలా బాగుందనీ, దాన్ని అధ్యయనం చేస్తామన్నారు. ధరణిపై త్వరలో మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

పునాస త్రైమాసిక సాహిత్య పత్రికను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమి నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలలో భాగంగా సాహితీవేత్తల కోసం ప్రత్యేకంగా 'పునాస' అనే సాహిత్య పత్రికను ప్రచురించడం శుభపరిణామమని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి చాంబర్‌లో తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురించిన 'పునాస' త్రైమాసిక సాహిత్య పత్రికను ఆయన ఆవిష్కరించారు.తెలుగు సాహిత్యంలో సృజన శీలతను ప్రతిబింబించే లక్ష్యంతో తెలంగాణ సాహిత్య అకాడమి పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

ఈ పత్రికలో అనేకమంది సాహిత్యకారులు రచించిన వ్యాసాలు, కథలు, కవిత్వంతోపాటు అనేక పుస్తకాల సమీక్షలు ప్రచురించడం బాగుందన్నారు. రాష్ట్రంలో రచయితలు, కవులు ఎంతో మంది ఉన్నారనీ, వారి నుంచి మరిన్ని రచనలను రాబట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ ఎండీ రమేష్ నాయుడు, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలాచారి, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి



నవతెలంగాణ - ముషీరాబాద్

గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ రాంనగర్ కూరగాయల మార్కెట్ వద్ద ప్రధాన రహదారి పక్కన గత కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తూ జీవితం సాగిస్తున్న వ్యక్తి (45) మృతి చెంది కిందపడి ఉన్నాడు. స్థానికులు గమనించి ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలకు దర్యాప్తు చేపట్టారు

ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన డీసీ



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

ఓటర్ నమోదు కేంద్రాని గోషామహల్ నియోజకవర్గం లోని గంఫౌండ్రి డివిజన్ ఉమెన్స్ కాలేజ్ పోలింగ్ కేంద్రం నెం లు 81.82.83 లలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన గోషామహల్ సర్కిల్ - 14 జిహెచ్ఎంసి డిప్యూటీ కమీషనర్ బాలయ్య, సూపర్వైజర్లు,నవీన్. గోపి కృష్ణ, బి ఎల్ వో లు స్వప్న, సుజాత, గోషామహల్ కాంగ్రెస్ నాయకుడు సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఐడీచే విచారణ జరిపించాలి

- 26న ఇందిరా పార్క్ వద్ద నిరసన దీక్ష
- నవరంగ్ కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జీనత్ బేగం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఐడీ చేత విచారణ జరిపించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మహమ్మద్ జీనత్ బేగం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ ప్రాజెక్టుపై అవినీతికి పాల్పడిన గత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డిలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. మేఘా కాంట్రాక్టు లైసెన్స్ రద్దు చేయాలన్నారు. రూ.33 వేల కోట్లతో ముగించవలసిన ప్రాజెక్టును రీ-డిజైన్ల పేరుతో రూ.1లక్ష 33 వేల కోట్లు ఖర్చు చేసి కేసీఆర్ ప్రభుత్వం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ప్రాణహిత ప్రాజెక్టును గత ఉమ్మడి రాష్ట్ర సీఎం వైయస్.రాజశేఖర్ రెడ్డి తక్కువ ఖర్చుతో పూర్తి చేసి 16.27 లక్షల ఎకరాలకు సాగునీరు, జలయజ్ఞం పేరుతో నీటిని అందించారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం వారి కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును కట్టించిందని, ప్రజలు, రైతులకు మేలు చేయడం కోసం కాదన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ప్రాణహితలపై సీఐడీ చేత విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమలపై తమ పార్టీ తరపున పలుమార్లు రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.ఈ నెల 26న ఇందిరా పార్క్ వద్ద భారీ నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.ఈ నిరసన దీక్షకు వివిధ ప్రజా సంఘాలు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నేతలు, ప్రజలందరూ పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. ఈ దీక్షతో రాష్ట్ర డీజీపీ నుంచి ఎలాంటి స్పందన రాకపోతే అనంతరం డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు.



ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘంగా హెచ్‌వన్ యూనియన్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్1 కు ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ కేకే తివారి ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘంగా గుర్తించి సర్టిఫికెట్ అందజేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ అధ్యక్షులు రాష్ట్ర ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు మిద్దెల జితేందర్ గాంధీభవన్‌లో హెచ్ వన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డికి ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం సర్టిఫికెట్ ను వారు అందజేశారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ అనుబంధంతో తెలంగాణ వైద్య ప్రజారోగ్య శాఖలో హెచ్1 యూనియన్ బలోపేతం చేయాలని సూచించారు ప్రభుత్వంతో మీ సమస్యలను ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ అనుబంధం ఇచ్చినందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి కేకే తివారి, రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే రాష్ట్ర సంఘం అన్ని జిల్లాల్లో బలోపేతం చేస్తూ ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కొండా పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి రాజశేఖర్, కోశాధికారి శివకుమార్, జాయింట్ జనరల్ సెక్రెటరీ అఫ్తాబ్, అహ్మద్ ఖాన్, హనుమంత రెడ్డి, మత్స్యగిరి టి.రవీందర్, రాములు, యామిని, రామేశ్వరి చారి నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వంశీధర్‌గౌడ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధక్షులుగా నీటి పారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కె.వంశీధర్‌గౌడ్‌ను ఎన్నుకున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రమ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి నాయకోటి రవి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.



మహిళల అభివృద్ధి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

- సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు

నవతెలంగాణ-అంబర్‌పేట

జనాభలో సగభాగమైన మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ముద్ర రుణాలను మంజూరు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నట్టు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. శనివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ శ్రీనివాస్ నగర్ లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ విద్యానగర్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా డబ్బు... ప్రజా భద్రత అనే పేరుతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధి పథకాల ద్వార రుణాలు పొంది నలుగురికి ఉపాధి కల్పించాలని కోరారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతకు, మహిళలకు ఆధునిక సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ఈ పథకాలను ప్రవేశపెట్టినారని పేర్కొన్నారు. అనంతరం ఆరుగురికి ముద్ర రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి కృష్ణ యాదవ్, బ్యాంక్ డీజీఎం ఎస్వీఎస్వీ రెడ్డి, డీజెచ్ఎంషా, ఛీఫ్ మేనేజర్ గోపాల్ రావు, విద్యానగర్ బ్రాంచ్ మేనేజర్ పసునూరి ప్రశాంత్, నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్ రాజ్, డివిజన్ అధ్యక్షులు చుక్క జగన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్ట్

- ప్రేమించి గర్భవతిని చేసి.. ట్యాబ్లెట్లతో అబార్షన్ చేయించిన వైనం
- సరూర్‌నగర్‌లో ఘటన

నవతెలంగాణ-చైతన్యపురి

ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి ఓ యువతితో ఆరు నెలల పాటు సహజీవనం చేసి గర్భవతి కావడంతో టాబ్లెట్లతో అబార్షన్ చేయించి తనకేమీ తెలియదంటూ మోసం చేసిన యువకుడుపై సరూర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తరుణ్ అనే యువకుడు నాగోల్ లో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్నాడు. నాగోల్ బండ్లగూడ తట్టి అన్నారం ప్రాంతానికి చెందిన దళిత యువతి ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతూ 2019లో సెక్యూరిటీ గార్డ్‌గా హిందూ అరణ్యలో చేరింది. కొంతకాలానికి అక్కడే విధులు నిర్వహిస్తున్న తరుణ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఇద్దరు ఒకరినొకరు ఇష్టపడ్డారు. తరుణ్ ఆమెను పెండ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి 2023 ఫిబ్రవరిలో లింగోజిగూడ డివిజన్ సాయి నగర్ లో ఓ గదిని అద్దెకు తీసుకొని ఆరునెలల పాటు సహజీవనం చేశాడు. అదే సమయంలో యువతి గర్భం దాల్చింది. దాంతో యువకుడు ఏప్రిల్‌లో యువతికి టాబ్లెట్లు ఇచ్చి అబార్షన్ చేయించాడు.

యువతి తనను పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో కులాలు వేరంటూ ఆ యువతిని కులం పేరుతో దూషిస్తూ చిత్రహింసలకు గురిచేశాడు. కొంతకాలానికి ఆ యువతిని మోసం చేసి ముఖం చాటిసాడు. దీంతో బాధితురాలు, సామాజిక కార్యకర్తల సహాయంతో సరూర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు యువతిని మోసం చేసిన తరుణ్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు తోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

వికలాంగుల హక్కుల చట్టం అమలుకు కృషి చేస్తాం



- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ-ముషీరాబాద్

వికలాంగుల హక్కుల చట్టం అమలుకు కృషి చేస్తామని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆల్ ఇండియా డిజబుల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిగా రాష్ట్రంలో అమలయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానన్నారు. వికలాంగుల పెన్షన్ ఒకటవ తేదీ నుంచి 5వ తేదీ లోపు బ్యాంక్ అకౌంట్‌లో పడేలా పెంచిన 6 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. అర్హులైన వికలాంగులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లులు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కేటాయించాలని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ లో వికలాంగులకు రోస్టర్ పాయింట్‌లో పది లోపు తగ్గించి వెంటనే ఉద్యోగాలు ఇచ్చే విధంగా కృషి చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యానికి, వారి న్యాయమైన డిమాండ్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సోమవారం మధ్యాహ్నం 12.20కు ప్రసవానికి ముహూర్తం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్టాపన ఉంది. నెలలు నిండిన తన భార్యకు సరిగ్గా అదే ముహూర్తంలో ప్రసవం చేయాలని ఓ జంట కోరినట్టు కిమ్స్ కడల్స్ సికింద్రాబాద్ వైద్యులను యూరో గైనకాలజిస్ట్ డాక్టర్ నిర్మల తెలిపారు. నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఒకటైన కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో ఓ జంట ఇప్పటికే అడ్మిషన్ కూడా తీసుకున్నారని తెలిపారు. షాద్‌నగర్ సమీపానికి చెందిన వీరు, భార్య పీజీ చేయగా, భర్త బీహెచ్ఈఎల్ వద్ద ఉద్యోగం చేస్తుంటారు. వీరికి ఇది మొదటి కాన్పు కావడంతో ఆమె తన పుట్టింటికి వచ్చి, కిమ్స్ కడల్స్ సికింద్రాబాద్ ఆస్పత్రిలో చూపించుకుంటున్నారు. వీళ్లబాల రాముడి ప్రతిష్టాపన జరిగే సమయానికే ప్రసవం అయ్యేలా చూడాలని కోరినట్టు తెలిపారు. ఆమెకు ప్రసవ సమయం దగ్గర పడటం, ఎలాంటి సమస్యలు లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం సరిగ్గా 12.20 గంటలకే శిశువు పుట్టేలా చూడాలని వైద్యులను కోరినట్టు తెలిపారు. మరొకరు కూడా అడిగినా, ఆమెకు కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు ఉండటంతో రెండు రోజులు ముందుగానే ప్రసవం చేయాల్సి వచ్చిందని తెలిపారు. కాగా యూరో గైనకాలజిస్ట్ డాక్టర్ నిర్మల తదితరుల నేతృత్వంలో ఇక్కడ అత్యంత సంక్లిష్టమైన కేసుల్లో కూడా సుఖ ప్రసవాలు చేస్తుంటారు.



డాక్టర్ నిర్మల

చేవెళ్ల ఎంపీపై బీజేపీ మాజీ ఎంపీ ఫిర్యాదు

నవతెలంగాణ-బంజారాహిల్స్

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అడ్మిన్ ఎస్ఐ రమేష్‌కు అందజేశారు. మూడు రోజుల కిందట తనకు అతను ఫోన్ చేసి దుర్భాషలాడాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు వచ్చిన బెదిరింపు ఫోన్ కాల్ పై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రాజకీయ కారణాలు తప్ప తమ మధ్య ఏమీ లేదన్నారు. ఓ సంస్కారం లేని వ్యక్తి చేసిన వ్యాఖ్యలపై తప్పనిసరి పరిస్థితుల్లో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. అతని పేరు సైతం చెప్పడానికి మనసు ఒప్పుకోవడం లేదని అన్నారు.



కేటీఆర్‌కు కార్పొరేటర్లు శుభాకాంక్షలు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ని తెలంగాణ భవన్ లో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాస రావు, నార్నె శ్రీనివాస రావు , ఉప్పలపాటి శ్రీకాంత్, ఆవుల రవీందర్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు

ఉద్యోగులు కోల్పోయిన సర్వీసును రెగ్యూలర్ చేయాలి

- పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ అసోసియేషన్ అధ్యక్షులు రవికృష్ణ

నవతెలంగాణ-ముషీరాబాద్

పోస్టల్, ఆర్ఎంఎస్ లో పని చేస్తూ 1981-90 వరకు కోల్పోయిన ఉద్యోగుల సర్వీసును రెగ్యూలర్ చేయాలని పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ అసోసియేషన్ అధ్యక్షులు రవికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో రవికృష్ణ మాట్లాడుతూ ఈ విషయమై 1986లో కోర్టులో కేసు గెలిచామని హైకోర్టులో కూడా తీర్పు తమకే వచ్చిందని చెప్పారు. అయితే డిపార్మెంట్లో ఉన్న ఉన్నతాధికారులు మొండిగా వ్యవహరిస్తు కేసు వేయడం జరిగిందన్నారు. దీన్ని వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగులు కోల్పోయిన సర్వీస్, ఇంక్రిమెంట్, ప్రమోషన్లను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఎస్ అధ్యక్షులు మనోహర్, కార్యదర్శి వై.డి.ప్రసాద్, శ్రావణ్ కుమార్, జైచంద్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ హాల్ భవనాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ లోని అశోక్ నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ నూతన భవనాన్ని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్‌తో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. కేంద్ర మంత్రి ప్రత్యేక నిధులతో రూ. 65 లక్షల వ్యయంతో అన్ని హంగులు, సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించినందుకు అశోక్ నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజెవైఎం నగర పూర్వ అధ్యక్షులు ఎ.వినయ్ కుమార్, ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, అసెంబ్లీ కన్వీనర్ రమేశ్ రామ్, డివిజన్ సీనియర్ నాయకులు సదానంద, నందు, శ్రీకాంత్, వీఎస్‌టీ రాజు, సత్తి రెడ్డి,ఆకుల సురేందర్,సురేష్,నవీన్ కుమార్,సాయి కుమార్, ఆనంద్ రావు,సంతోష్,అభిషేక్,నీరజ్, ప్రశాంత్, సంయుక్త రాణి, అశోక్ నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి, కార్యదర్శి సూర్యప్రకాష్, పద్మావతి, ఐఎస్ఎన్ మూర్తి,సభ్యులు రమేశ్, నాగలక్ష్మి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌కు... ‘బెస్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్లేస్‌మెంట్ (సౌత్)’ అవార్డు





నవతెలంగాణ-సిటీబ్యూరో

‘బెస్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్లేస్‌మెంట్ (సౌత్)’ అవార్డు నేషన ల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)కు దక్కింది. ‘అసోచామ్’ ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డ్ - 2023 కార్యక్రమం శుక్రవారం న్యూఢిల్లీలో ‘6th International sustainability conclave’ జరిగిన సమావేశంలో అవార్డులను న్యాక్ డైరెక్టర్లు శాంతి శ్రీ, ఏం. రాజి రెడ్డికి అందజేశారు. తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఒక ప్రధాన వత్తి విద్య శిక్షణ ప్రదాతగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌ల కోసం ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రామ్‌లతోపాటు పీ.జీ. డిప్లొమా కోర్సులను అందిస్తోం ది. నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు న్యాక్‌లో పనిచేస్తున్నారు. న్యాక్‌లో ఉచిత శిక్షణ, బోర్డింగ్, బస్సు సౌకర్యాలతో 2022-23 సంవత్సరానికిగాను 20,384 మంది విద్యార్థులకు వివిధ నైపుణ్య శిక్షణలను అందించారు. నిరుద్యోగ యువతకు ప్రముఖ కంపెనీలలో ప్లేస్‌మెంట్ అందించారు. సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు న్యాక్ దాదాపు 500లకు పైగా పేరున్న నిర్మాణ కంపెనీలతో ఎంప్యానెల్ చేసుకుంది. న్యాక్‌లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు ఎల్ అండ్ టీ, మై హెూమ్స్, టాటా, ఆదిత్యా కన్‌స్ట్రక్షన్స్, డీఈసీ ఇన్‌ఫ్రా లిమిటెడ్,హల్‌మార్క్ బిల్డర్స్, ఏఆర్‌కె ఇన్‌ఫ్రా, అశోకా బిల్డర్స్, క్రాస్ ప్రాజెక్ట్, షాపూర్జీ, మేఘా, ప్రెస్టీజ్, కన్‌స్ట్ర క్షన్స్‌తోపాటు తదితర ప్రముఖ కంపెనీలలో యువతకు శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతకు విజయవంతమైన శిక్షణలు అందిస్తున్నందుకుగాను న్యాక్ డైరెక్టర్ జనరల్ కే.భిక్షపతిని తెలంగాణ ప్రభుత్వ రోడ్లు, భవనాల శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యే కంగా అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూర్చేందుకు నైపుణ్యాభివద్ధి శిక్షణ కార్యకలాపాలను మరింత పెంచడానికి న్యాక్ చైర్మెన్, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితోడ్పాటును అందిస్తున్నారని తెలిపారు. న్యాక్‌కు అవార్డుకు రావడంతో న్యాక్ డైరెక్టర్లను మంత్రి అభినందించారు.

కోయంబత్తూర్‌లో ఈఎస్‌సీఐ స్టాల్ ప్రారంభం





నవతెలంగాణ-సిటీబ్యూరో

కోయంబత్తూర్‌లో శుక్రవారం జరిగిన ‘ఐడబ్ల్యూడబ్ల్యూఏ’ వార్షిక సమావేశంలో హైదరాబాద్ గచ్చిబౌలీలోని ‘ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా’ (ఈఎస్‌సీఐ) స్టాల్‌ను టీఎస్ఏయూ వీసీ గీతాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్‌రావు ఈఎస్‌సీఐ కాలేజీలో అందిస్తున్న వివిధ కోర్సుల గురించి వివరించారు. దేశంలోనే ఈఎస్‌సీఐ కాలేజీ పేరుప్రతిష్టలు సంపాదించిందని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించేదుకు ఈఎస్‌సీఐలో శిక్షణా కార్యక్రమాలు ఎంతో తోడ్పడ్తాయని చెప్పారు. ఈఎస్‌సీఐలో ఒకే గొడుగు కింద పలు సేవలు అందిస్తున్నామన్నారు. అదనంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు, కన్సల్టెన్సీ సేవలు, డీపీఆర్ తయారీ వంటి ఇతర కార్యక్రమాలు విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు.

నాటకం అదరహో..

- నవ్విస్తూ నిజాన్ని చాటి చెప్పిన ‘పెట్రోమాక్స్ పంచాయత్’ హిందీ నాటక ప్రదర్శన

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

కర్టెన్ కాల్ థియేటర్ సమర్పణలో శనివారం బొగ్గుల కుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియం లో జరిగిన “పెట్రోమాక్స్ పంచాయత్” హిందీ నాటకం ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంది.డాక్టర్ వెంకట్ గోవాడ నాటకీకరణ చేసిన ఈ నాటక హిందీ మూలం ఫణీశ్వర్ నాథ్ రేణు, దర్శకత్వం సురభి సంతోష్.

ముందుగా ఈ నాటకాన్ని కర్టెన్ కాల్ థియేటర్, 2022 లో, తెలుగు లో ప్రదర్శించినట్టు తెలిపారు. తెలుగులో 25 కి పైగా ప్రదర్శనలు, రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా బహుమతులు కూడా గెలుచుకుందన్నారు. దీన్ని హిందీ లో కూడా ప్రదర్శిస్తున్నమని డైరెక్టర్ సురభి సంతోష్ తెలియజేశారు, ఈ నాటకాన్ని మహారాష్ట్రలోని షోలాపూర్ దగ్గర ఒక మారుమూల గ్రామంలో జరిగిన కథగా చూపిస్తున్నాం అని చెప్పారు. నాటకాన్ని తిలకించిన ప్రేక్షకులు, నాటకం నవ్విస్తూ ఆద్యంతం ఆకట్టుకుందని చెప్పారు, టీమ్ సభ్యులందరికి, కర్టెన్ కాల్ థియేటర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నాటకం 50 ఏండ్ల క్రితం జరిగిన కథ లా చూపించినా కూడా పాటలు, నృత్యాలతో, చక్కటి హాస్యంతో నేటి తరం ప్రేక్షకులను కూడా అలరించే విధంగా, మహారాష్ట్ర లోని ఒక ప్రాంతంలో జరిగిన కథ గా దీన్ని చూపిస్తున్నారు. కాబట్టి మహారాష్ట్ర మాండలికాన్ని కూడా ఉపయోగించుకుంటూ దర్శకుడు ఈ నాటకాన్ని చక్కగా డిజైన్ చేశారని చెప్పారు. పెట్రోమాక్స్’ పంచాయతీ కథామూలం: ఫణీశ్వర్నాథ్ ‘రేణు’నాటకీకరణ: డా.వెంకట్ గోవాడ,దర్శకత్వం: సంతోష్ సురభి వహించారు. ఊరంటే పచ్చని పైర్లే కాదు ప్రేమ ఊసుల జంటలే కాదు దుర్మార్గపు ఆలోచనలుంటై ఎత్తులకు పై ఎత్తులుంటై పంచాయతీ అంటే కష్టమొచ్చినోడికి న్యాయం చెప్పేది కాదు పంచాయతీ అంటే నొప్పి గల్గినోడికి నొప్పి తీర్చేడిది కాదు పనికిమాలిన పంచాయతీలుంటై పెట్రోమాక్స్ పంచాయతీలుంటై యాభై ఏండ్ల కిందటైనా గిప్పుడైనా గీ సమాజానిది ఒకటే తీరు. మంచికీ-చెడుకీ, ప్రేమకీ-కర్కశత్వానికీ మధ్యల బలైపోతున్నోల్లే ఎక్కువ. ఇండ్ల పాత్రలు నవ్విస్తూ ఊసులు చేపై, కవ్విస్తూ దుర్మార్గపు ఆలోచనలు చేస్తై, ఎత్తులకు పై ఎత్తులను మనలకు సూపెడ్తై. మరండ్ల నొప్పెవడిదో, న్యాయమెవడిదో సూద్దమ్ రాండ్రి. సూసినంక మీరే చెప్పుండ్రి పంచాయతీ ప్రేమదా? పెట్రోమాక్స్ దా? రాండ్రి. సూసి మీరే సెప్పుండ్రి న్యాయమెందో కర్టెన్ కాల్ థియేటర్ వాల్ల”పెట్రోమాక్స్ పంచాయత్”తో ముగిసింది



మహిళా కిక్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

‘ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్’ పోటీలు హైదరాబాద్ ఎల్బీ ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభం అయినట్టు రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ తెలిపారు. బాలికల ఆత్మ రక్షణ కోసం ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించిన ‘ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్’ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

ఈ పోటీల్లో 10 ఏండ్ల వయస్సు పైబడిన అమ్మాయిల నుంచి 55 ఏండ్ల మహిళల వరకు వివిధ క్యాటగిరీల్లో పాల్గొంటునట్టు పేర్కొన్నారు.ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా శిక్షణ ఇస్తామని తెలిపారు.

గురుకుల నోటిఫికేషన్ ఆధారితంగానే అభ్యర్థుల నియామకాలు చేపట్టాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-సిటీబ్యూరో

గురుకుల నోటిఫికేషన్ ఆధారితంగానే అభ్యర్థుల నియామకాలు చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావిద్ డిమాండ్ చేశారు. శనివారం డీవైఎఫ్ఐ నగర కార్యలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2023 సంవత్సరంలో గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు నోటిఫికేషన్ ప్రకారమే రిక్రూట్మెంట్ నిర్వహించాలన్నారు. కొంతమంది నియామక బోర్డ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల అభ్యర్థుల మధ్య తారతమ్య భేదాలు సృష్టించి, పరీక్షలను నిర్వహించినా ఫలితాలు వెల్లడించకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. పరోక్షంగా ఉన్నత న్యాయస్థానానికి తప్పుడు నివేదికలను సమర్పించి నియామకాలను ఆలస్యం చేసిందన్నారు. ఆ కారణంగానే గురుకుల అభ్యర్థులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సత్వరమే కాంగ్రెస్ ప్రభుత్వం అభ్యర్థుల సమస్యలపై ఉన్నత స్థాయి కమిటీని నియమించి అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అభ్యర్థుల పక్షాన నిలబడి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

నవతెలంగాణ
మేడ్చల్-ఉప్పల్
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

రోనాల్డ్ రాస్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనార్డ్‌రాస్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఉప్పల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులపై, ఓల్డ్ మీర్‌పేట్ బండబావి గ్రౌండ్ అభివృద్ధిలో భాగంగా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు బాక్స్ డ్రెయిన్ మంజూరు చేయాలని కోరారు. చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీ, బహ్వాన్ కాలనీ స్టాంమ్ వాటర్ డ్రైన్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, నేమూరి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎర్ర లలిత గార్డెన్‌లో జరిగిన చాక్లెట్ స్కూల్ 10వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నవీన్‌గౌడ్, శ్రీకాంత్, స్కూల్ ప్రిన్సిపాల్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ నిర్మాణాలకు అనుమతులు ఎవరిచ్చారు!

- బోడుప్పల్ కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోరా?
- గతంలో అడ్డుకున్న సిబ్బందిపై దౌర్జన్యం చేసిన నిర్మాణదారులు.. !



నవతెలంగాణ-బోడుప్పల్

కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా నగరంలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని నూతన పురపాలక చట్టంలో పొందుపరిచారు. కానీ బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో మాత్రం పరిస్థితులు మరోలా ఉన్నాయి.

అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులు అవసరం లేదా?

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో కార్పొరేషన్ అనుమతులు లేకుండానే ఇబ్బడి ముబ్బడిగా చేపడుతున్న నిర్మాణాలకు అనుమతులు అవసరం లేదా అంటే ఏమో అంటున్నారు అధికారులు. నిర్మాణాల ఫీజుల


బోడుప్పల్‌లో బరితెగించిన 'అక్రమార్కులు'

రూపంలో వచ్చే పన్నులతో కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచడానికి శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నామని, అయితే స్థిరమైన నగర ప్రణాళిక విభాగం అధికారులు లేకపోవడం, ఇంకా ఇతర పనులను తమకే అప్పగించడం తో కొన్ని రకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు వాపోతున్నారు. దీనికి తోడు కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాల వెనుక కొందరు ప్రజాప్రతినిధులు కూడా ఉండడంతో చర్యలు తీసుకోవడా నికి ఇబ్బందులు వస్తున్నాయనేది అధికారుల నుంచి వస్తున్న సమాధానం.



సిబ్బందిపైనే జులుం..
అయినా చర్యలు శూన్యం..

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల రెవెన్యూ సర్వే నెంబరు 20 (అ)లో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున షెడ్ నిర్మాణం చేపడుతున్న విషయం తెలుసుకున్న కార్పొరేషన్ నగర ప్రణాళిక విభాగ అధికారులు, సిబ్బంది అక్కడికి వెళ్లి నిర్మాణాన్ని ఆపేందుకు ప్రయత్నం చేయగా సదరు నిర్మాణదారులు సిబ్బందిని నిర్బంధించి బెదిరింపులకు పాల్పడ్డారు. అప్పట్లో ఈ వార్తా సంచలనంగా మారడంతో స్పందించిన ఉన్నాతాధికారులు సదరు నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. మళ్లీ ఏమైందో.. ఎవరు మద్దతు ఇచ్చారో..కానీ మళ్లీ ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

నోటీసులు జారీ చేస్తాం

నగరంలోని పలు చోట్ల జరుగుతున్న అనుమతులు లేని నిర్మాణాలపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి నోటీసులు జారీ చేస్తాం.

-వీరస్వామి, టీపీవో, బోడుప్పల్ కార్పొరేషన్.

ప్రారంభానికి సిద్ధమైన
నాచారం డివిజన్ వార్డు కార్యాలయం



నవతెలంగాణ-కాప్రా

నాచారంలో రూ.75లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నాచారం డివిజన్ వార్డు కార్యాలయ పనులు పూర్తి కావచ్చాయి. శనివారం కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శే ఖర్ అధికారులతో కలిసి వార్డు కార్యాలయాన్ని పరిశీలి ంచారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. త్వరలో నే వార్డు కార్యాలయాన్ని ప్రారంభించి డివిజన్ ప్రజలకు, అధికారులను అందుబాటులోకి తెస్తామన్నారు. ఇంకా రెండు అదనపు ఫ్లోర్ల నిర్మాణానికి ఎస్టిమేషన్లు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ మల్లికార్జున గౌడ్, ముత్యంరెడ్డి, రామకృష్ణ, విఠల్ యాదవ్, రాజు నర్సింగ్ రావు, అశోక్, కట్ట బుచ్చన్న గౌడ్, స్వామి, డీఈ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కార్పొరేటర్ బన్నాల గీత
- కల్యాణపురి సీసీ రోడ్డు పనులు పరిశీలన



నవతెలంగాణ-ఉప్పల్

పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. చిల్కానగర్ డివిజన్‌లోని కల్యాణపురి కాలనీలో రూ.80 లక్షల వ్యయంతో వేసిన సీసీరోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌లోని బస్తీలలో, కాలనీలలో సీవరేజ్, స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైపులైన్ల పనులు పూర్తయిన ప్రాంతాల్లో ప్రణాళిక బద్ధంగా నూతన సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎలక్షన్‌లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్డుకు సమయానుసారం క్యూరింగ్ చేయాలని, రోడ్డు ఇరువైపులా మట్టి నింపి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, బాలు, శ్యామ్ కల్యాణపురి కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

22న విద్యా సంస్థలకు సెలవు ఇవ్వాలని వినతి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ జిల్లా పరిధిలోని విద్యా సంస్థలకు ఈనెల 22న సెలవు ప్రకటించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాధికారి విజయ్ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22న అయోధ్యలో శ్రీరాములవారి ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్ర మం జరుగుతున్న సందర్భంగా దేశమంతా పండుగ వాతావరణం నెలకొననుందన్నారు.కేంద్ర ప్రభుత్వం పరిధిలో నడుస్తున్న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు సైతం సెలవు ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనం పద్మ, రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, మండల అధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.

భారత క్రికెటర్ తిలక్ వర్మకు.. ఘన సత్కారం



నవతెలంగాణ-శామీర్‌పేట

భరత క్రికెటర్ తిలక్ వర్మను తూంకుంట నాయకులు సన్మానించారు. శనివారం మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని మందాయిపల్లిలో హైదరాబాద్ వర్సెస్ సిక్కిం టీంల మధ్య రంజీ ట్రోఫీ జరిగింది. ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ హైదరాబాద్ జట్టు తరపున ఆడగా హైదరాబాద్ జట్టు ఘనవిజయం సాధించింది. ఈ సందర్భంగా మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన తూంకుంట నాయకులు రాజపుత్ భరత్ సింగ్, కొడిమేల ఆంజనేయులు, చిర్రబోయిన రాంచందర్ యాదవ్‌లు తిలక్ వర్మను శాలువాతో సత్కరించారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మల్కయ్య, రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తోకల మల్కయ్య, రవీందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా ఎన్నికల అధికారి బాలబోయిన విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎన్నికల్లో జిల్లా నుంచి ఈ ఇద్దరి నామినేషన్లు దాఖలయ్యాయి. ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా వీరిద్దరికి పలువురు పాత్రికేయులు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛ తీర్థ్ క్యాంపెయిన్‌లో పాల్గొన్న మర్రి దీపికా నర్సింహారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

స్వచ్ఛ తీర్థ్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలోని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వచ్ఛ మేడ్చల్ నిర్మాణంలో పట్టణ ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట ల్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ పరిధిలో ఓటరు నమోదు కార్యక్రమం

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఓటర్ స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను ఆదివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీఎస్‌వీఎన్ త్రిల్లేశ్వర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లు పౌరులందరూ ఫాం 6కు ఐడీప్రూఫ్, అడ్రస్ ప్రూఫ్ జతపరిచి నూతన ఓటరు నమోదుకు బీఎల్ ఓలకు ఇవ్వాలని సూచించారు. ఓటరు ఐడీలో సవరణలు ఉంటే ఫాం 8 ద్వారా సరిచేసుకోవాలని సూచించారు.

పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ముప్పు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పీఏ కుమారుడు ఆరోన్, కుమార్తె ఆరోహి మొదటి పుట్టినరోజు వేడుకల్లో నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఐ స్ప్రౌట్ 17వ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ మేనేజ్డ్ ఆఫీస్ స్పేస్ ప్రొవైడర్ ఐ స్ప్రౌట్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ ఆరో ఆర్బిట్‌లో తన ప్రీమియం సెంటర్‌ను శనివారం ప్రారంభించింది. 2017లో హైదరాబాద్‌లో ఒకటి ప్రారంభించగా ఇది భారతదేశంలో వారి 17వ కేంద్రంగా నమోదైంది. కొత్త కేంద్రం 2,50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, ఐదు అంతస్తుల్లో 4000 సీట్లను అందిస్తోంది. వినూత్న కాన్సెప్ట్‌లు, క్లయింట్-స్నేహపూర్వక ప్లాన్‌లకు పేరుగాంచిన ఐ స్ప్రౌట్ టెక్ కంపెనీల అధిక సాంద్రతతో ఆధునిక శివార్లలో ఆఫీస్ స్పేస్‌ల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవస్థాపకులు సుందరి పాటిబండ్ల, శ్రీని తీర్థాల బహుళజాతి కంపెనీల మధ్య కార్యాలయ సంస్కృతి పునరుద్ధరణకు అనుగుణంగా స్నేహపూర్వక, పరిశుభ్రమైన కార్యాలయ వాతావరణం ప్రాముఖ్యతను వివరించారు. ఐ స్ప్రౌట్ సీఈఓ సుందరి పాటిబండ్ల తమ వ్యాపార ఆలోచనలను ఆచరణీయ సంస్థలుగా మార్చడానికి వారి నిబద్ధతను వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, పూణే, విజయవాడ వంటి నగరాల్లో పని చేస్తున్న ఐ స్ప్రౌట్ ఢిల్లీ-ఎన్ సి ఆర్, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్‌లకు విస్తరించాలని సన్నాహాలు చేస్తుంది. మొత్తం 50 కేంద్రాలు, 2 మిలియన్ చదరపు అడుగుల కార్యాలయాలను 2024 చివరి వరకు చేయాలని లక్ష్యంతో సాగుతుంది. లాంచ్ ఈవెంట్‌లో హై-ప్రొఫైల్ కార్పొరేట్, బిల్డర్లు, బిజినెస్ డెలిగేట్‌ల ఉనికిని ప్రదర్శించారు. చక్కటి సేవలందించే, ఆకర్షణీయమైన వర్క్‌స్పేస్‌లను రూపొందించ డంలో ఐ స్ప్రౌట్ అంకిత భావాన్ని ప్రదర్శిస్తుంది. ప్రతి ఐ స్ప్రౌట్ కేంద్రం ఒక ప్రత్యేకమైన థీమ్‌తో రూపొందించబడింది. కంపెనీ లక్ష్యం కేవలం వర్కింగ్ స్పేస్‌ను అందించడమే కాకుండా వర్క్‌స్పేస్ అనుభవాన్ని పునర్నిర్వచించడమే.

విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులదే ప్రథమ పాత్ర

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- టీచర్స్, లెక్చరర్స్, విద్యాసంస్థలకు అంబిషన్స్ పురస్కారాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులదే ప్రథమ పాత్ర అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గతంలో తరగతి గదిలో ఉపాధ్యాయులు ఏం నేర్పితే అదే నేర్చుకునే వారనీ, ఇప్పుడు మార్పు వచ్చిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రతిరోజూ విద్యార్థులతో ఉపాధ్యాకులకు ఒక పరీక్ష లాంటిదని పేర్కొన్నారు. అంబిషన్స్ ఆధ్వర్యంలో నాలుగేండ్లుగా ఉన్నత ప్రమాణాలు గల విద్యాసంస్థలు, విశిష్ట గల అధ్యాపకులకు అంబిషన్స్ ఎడ్యుకేషన్ కెరీర్ కౌన్సిలర్స్ ఎక్సలెన్స్ సి 2024 అవార్డ్స్‌తో టీచర్స్, లెక్చరర్లకు, విద్యాసంస్థలకు ఈ అవార్డ్సును అందజేశారు. ఈ కార్యక్రమాన్ని బంజారాహిల్స్‌లోని రాడిషన్ హెూటల్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చైర్మెన్ ఆఫ్ ట్రస్ట్ అనురాగ్ యూనివర్సిటీ, అవినాష్ కాలేజీ చైర్మెన్ అవినాష్ బ్రాంమదేరా, హెచ్ఎస్‌బీ కాలేజీ బెంగళూరు చైర్మెన్ డాక్టర్ జయ ప్రకాష్, నగరం సాయిరాం ఫౌండర్ ఆఫ్ అంబిషన్స్ కెరీర్ కౌన్సిలర్ ఈ అవార్డ్స్‌ని అందజేశారు. ఈ అవార్డ్స్‌తో తమను సత్కరించటం చాలా ఆనందంగా ఉందని విద్యా సంస్థలు, అధ్యాపకులు తెలిపారు.

రోడ్డు సమస్యలు లేకుండా పరిష్కరిస్తాం



- మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్‌లోని అన్ని కాలనీల్లో రోడ్డు సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీజంగయ్య యాదవ్ అన్నారు. శనివారం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో రూ. 9లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ కుతాది రవీందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ప్రతీ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులకు, సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. లేని యెడల చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు బర్ల దేవేందర్ ముదిరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీ, బీఆర్ఎస్ నాయకుడు ఫయ్యాం, పిట్ల విజయ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

అరులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్ర మాన్ని కమిషనర్ రాజేంద్ర కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసు కోవాలన్నారు. ఓటు ఒకచోట నుంచి మరోచోటికి మార్చించుటకు, ఎవరైనా ఓటును డిలీట్ చేసుకోవడానికి ఫామ్ 6, 7, 8 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. రెండు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, బీఎల్‌వోలు, మున్సిపల్ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చిన అధికారులు



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని సర్వే నెంబర్ 586లోని ప్రభుత్వ భూముల్లో 60 గజాల చొప్పున నిర్మించిన పలు అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో కూల్చేశారు. తహశీల్దార్ అశోక్ కుమార్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేతలు ప్రారంభించారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. అమాయక ప్రజలను మభ్యపెట్టి ప్రభుత్వ భూములను అమ్మకాలు, కొనుగోలు చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

సెయింట్ జోసెఫ్ కాలనీ నుంచి నేతాజీ నగర్ వరకు నిర్మించే 450 మీటర్ల మెయిన్ రోడ్డు నిర్మాణ పనులను చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రయినేజీ నిర్మాణ పనులను పూర్తి చేసిన అనంతరం రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు. స్థానికులు రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యే వరకు జీహెచ్ఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కాలనీవాసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీలతో కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని అంగన్వాడీ సిబ్బందితో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని గర్భిణులకు, బాలింతలకు అందజేస్తున్న పోషకాహారం, చిన్నారు ల ఇస్తున్న టీకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేసి, మందులు అందజేయాలని అంగన్వాడీలకు సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై కమిటీలతో కాలయాపన చేయొద్దు



- దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బూదాల బాబురావు

నవతెలంగాణ-బాలానగర్

కేవలం పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం కమిటీ వేసిందని మాదిగలపై చిత్తశుద్ధి లేని బీజేపీ ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయడం తగదని దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బూదాల బాబురావు అన్నారు. ఇంతకు ముందే రెండు కమిటీలు కేంద్ర ప్రభుత్వం వేసిందని జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్, ఉషా మెహ్రా కమిషన్ ఆధారంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే పార్లమెంటులో ప్రవేశ పెట్టాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసమే కమిటీ పేరిట కేంద్ర బీజేపీ ప్రభుత్వం, మాదిగలను మోసం చేస్తుంది. ఓట్ల కోసమే కమిటీ పేరిట మాదిగల ఓట్లు దండుకోవాలని చూస్తుంది. వెంటనే పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించకపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి గట్టిగా సమాధానం చెప్తామంటూ బూదాల బాబురావు హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని మరియమ్మ, కాలనీలో నివసించే నరసింహచారి (52) అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, స్థానిక నాయకులను ఆదేశించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డి.వి.జి ట్రస్ట్ ద్వారా రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, కటికరవి, సాయిగౌడ్ తదితరులు ఉన్నారు.

25న జాతీయ ఓటరు దినోత్సవం



- జేఎన్టీయూలో ఘనంగా ఏర్పాట్లు
- హాజరుకానున్న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్
- ఏర్పాట్లను పరిశీలించిన జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25వ తేదీన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి జేఎన్టీయూలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ గౌతమ్, అధికారులు అవసరమైన ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. జేఎన్టీయూ కాలేజీ ఆడిటోరియంలో కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గవర్నర్ ప్రసంగించే సమయంలో సభావేదికతో పాటు పాల్గొనే వీఐపీల కోసం, వసతులను పరిశీలించారు. అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జేఎన్టీయూలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ హాజరు కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారికి పార్కింగ్ తదితర వివరాల విషయమై పోలీసులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్, ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్, పోలీసు అధికారులు, జేఎన్టీయూ అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం పనిచేయాలి



- మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు, సంక్షేమం కోసం పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేత, డిఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎరవెల్లి జగన్‌తో పాటు విద్యార్థి సంఘాల నేతలు తెలంగాణ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిఎస్ఎఫ్ స్థాపించిన నుంచి ఇప్పటివరకు పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం డిఎస్ఎఫ్ నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. అనంతరం జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేత, డిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు ఎరవెల్లి జగన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వాలని కోరారు. సాంకేతిక విద్య కోసం నిధులు ఎక్కువగా కేటాయించాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ముందు వరుసలో ఉండి కొట్లాడిన పాలిటెక్నిక్ విద్యార్థులు, తెలంగాణ వచ్చిన తర్వాత వారి సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కరణ కోసం డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ జేఎన్టీయూ హెచ్ యూనివర్సిటీ ఇన్‌చార్జి అభిషేక్, జేఎన్టీయూహెచ్ స్టూడెంట్ లీడర్ ప్రవీణ్ చారి, అల్లం శివకుమార్, డిఎస్ఎఫ్ మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చింతల అఖిల, సోను పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాలపై మత రాజకీయాలు వద్దు

- ఈ నెల 22న ఒక పూట సెలవు ప్రకటించడం బీజేపీ అధికార దుర్వినియోగమే
- దేశంలోని ప్రతీ పౌరునికి వారి వారి ఇష్టాలకు అనుగుణంగా ఎంపిక చేసుకునే హక్కుంది

నవతెలంగాణ-బాలానగర్

ప్రజల విశ్వాసాలపై మత రాజకీయాలు వద్దని, ప్రతి ఎన్నికలకు ముందు బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయాలు చేస్తోందని, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు 'నరేంద్ర మోడీ రాజకీయ కార్యక్రమం'గా మార్చేశాయని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు తెలిపారు. కాగా అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొనేందుకు వీలుగా ఈ నెల 22న ఒక పూట సెలవును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 22 వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర సంస్థలు, పారిశ్రామిక సంస్థలు మూతబడతాయని ప్రకటిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెమోరాండం జారీ చేసిందని పేర్కొన్నారు. ఇది పూర్తిగా మతపరంగా జరగాల్సిన వ్యవహారంలో ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా అడుగులు వేస్తోందని తెలిపారు. ప్రజలు తమ మతవిశ్వాసాలు, వ్యవహార శైలికి సంబంధించి ఇది వ్యక్తిగతమని, ప్రజలు వారి వారి ఇష్టాలకు అనుగుణంగా ఎంపిక చేసుకునే హక్కు దేశంలోని ప్రజలు కలిగివున్నారన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం దీపం వెలిగించాలని, గంటలు కొట్టాలని, సెలవులు ప్రకటిస్తూ ఇటువంటి సర్క్యులర్ జారీ చేయడం ద్వారా ప్రభుత్వం తన అధికారాలను తీవ్రంగా దుర్వినియోగ పరుస్తోందని, రాజ్యాంగానికి మతం రంగు పులమరాదని, రాజ్యాంగానికి, సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు.

రాజ్యాంగ విలువలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు



సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కూడా గట్టి అంబానీ, ఆధాని దారపోస్తున్నారు. ప్రతీది ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల్లో వ్యతిరేక మొదలైం దన్నారున. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం మత రాజకీయలను అవలంబిస్తూ రాజ్యాంగ విలవలను మంట గలుపుతున్నారు.

మోటార్ వెహికల్ యాక్ట్ ఎత్తివేయ్యాలి



- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

షాపూర్ నగర్ పొట్లూరి నాగేశ్వరరావు భవన్‌లో కుత్బుల్లాపూర్ మండలం ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ అధ్యక్షత వహించగా, యూసుఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ మోడీ ప్రభుత్వం లారీ ట్రాక్, ఆటో డ్రైవర్లకు నష్టం కలిగించే మోటార్ వెహికల్ ఆక్ట్ 2023 ను తీసుకువచ్చి అనుకోకుండా ప్రమాదం జరిగినా, మరణం సంభవిస్తే రూ. 10 లక్షలు, 7సంవత్సరాల జైల్ శిక్ష తీసుకురావడం అన్యాయమన్నారు. ఎవ్వరూ కూడా కావాలని ఆక్సిడెంట్ చేయరని కావున వెంటనే ఆ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కార్మికులు మరింత సంఘటితమై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా.మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత మహిళ రవాణా వల్ల ఇబ్బందులకు గురవుతున్న ఆటో డ్రైవర్ లకు ప్రత్యామ్నాయ ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉండి వారి సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమించాలని దానికి సీపీఐగా సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా అధ్యక్షుడు స్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని 11 మందితో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా రాజ కుమార్, కార్యదర్శిగా ఎల్లస్వామి, కోశాధికారిగా కుమార్, గోపి, గౌస్, కృష్ణ, జహంగీర్, పూర్ణచందర్ ఎన్నికయ్యారు.

ముగిసిన జాతీయ సమైక్యతా శిబిరం



నవతెలంగాణ-దుండిగల్

కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ, జాతీయ సేవా పథకం హైదరాబాద్ రీజినల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సౌజన్యంతో వారం రోజుల పాటు జరిగిన జాతీయ సమైక్యతా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఆర్ఐటీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్ రెడ్డి , ఏపి స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాపి.అశోక్ రెడ్డి, రీజినల్ డైరెక్టర్ ఎం.రామక్రిష్ణ , ఎంఎల్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డా. కె. శ్రీనివాస్ రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి, కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ సమైక్యతా శిబిరాల్లో పాల్గొనడం విద్యార్థులకు గొప్ప అవకాశమని, ఇలాంటి శిబిరాలు ఇతర రాష్ట్రాల్లో ఉండే సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకోవడానికి దేశ సమైక్యత కోసం వాలంటీర్లలో ఒక బలమైన సహృద్భావ వాతావరణాన్ని కల్పిస్తాయని వాలంటీర్లను అభినందించారు. అనంతరం మల్కాజిగిరి ఎమ్మెల్యే కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో విద్యార్థులు ఎల్లవేళలా ముందు ఉండడానికి తాము నిత్యం ప్రోత్సహిస్తునే ఉంటామని తెలిపారు. తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం శ్రీరంగవరం గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో పాటు ఎన్నో రకాల సేవా కార్యక్రమాలను పలు గ్రామాల్లో నిర్వహించిందని పేర్కొన్నారు. తాము కూడా గత మూడు, నాలుగు సంవత్సరాలుగా అరుంధతి ఆసుపత్రిని నెలకొల్పి ఎంతో ఖర్చుతో కూడుకున్న శాస్త్ర చికిత్సలు, డయాగ్నొస్టిక్ టెస్టులు ఉచితంగా పేద ప్రజలకు అందజేస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తద్వారా దేశ సమైక్యత కోసం పాటుపడాలని కోరారు.ప్రిన్సిపాల్ డా. కె శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా తమ కళాశాలలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహించే అవకాశం రావడం తమ కళాశాల ఎన్ఎస్ఎస్‌లో ఎంత చురుకుగా ఉంటుందని తెలిపారు. ఈ క్యాంపు యొక్క అలవాట్లను తమ నిత్య జీవితంలో కూడా అలవరుచుకొని దేశ సేవలో నిమగ్నం కావాలని ఈ సందర్భంగా వాలంటీర్లను కోరారు. రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఎంతో చురుకుగా ఉండి ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొనడం చూసి ఈ కళాశాలకు జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహించే అవకాశం ఇచ్చామని తెలియజేశారు. ఈ క్యాంపును ఎంఎల్ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చాలా చక్కగా నిర్వహించారని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని అభినందించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వాలంటీర్లకు ఈ వారం రోజుల పాటు యోగా, శ్రమదానం, వ్యక్తిత్వ వికాస శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొనడం వాలంటీర్ల వ్యక్తిత్వానికి అలాగే పై చదువుల కోసం ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఆఫీసర్ ఆర్ సైదా, సంజయ్ కుమార్, జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్. శోభా రాణి, ఎంఎల్ఆర్ఐటి ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, ఎస్.ఉదయ్ రంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్స్‌ను ఇబ్బందులకు గురిచేయొద్దు



- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి నియోజకవర్గంలో స్ట్రీట్ వెండర్స్‌ను ఇబ్బందులకు గురిచేయద్దని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నేరేడ్ మేట్‌లోని పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో స్ట్రీట్ వెండర్స్ ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణాలను మున్సిపల్ అధికారులు కూల్చి వేశారు. దీనిని నిరసిస్తూ శనివారం మల్కాజిగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద శాంతియుతంగా చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ స్ట్రీట్ వెండర్స్ జీవనం సాగిస్తున్నారని వారి సాధక బాధలు తనకు తెలుసునన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ వెండర్స్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

సూరారం విలేజ్, 11కె.వి ఫీడర్, రాజీవ్ గృహకల్ప, 1 రాజీవ్ గృహకల్ప 2, 11 కె.వి ఫీడర్‌లలో మరమ్మత్తుల, విద్యుత్ వైర్లకి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3:00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూరారం విలేజ్, రాజీవ్ గృహకల్పలోని అన్ని బ్లాకులు, భవాని నగర్, 60 గజాలు, టిటి నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు అంతరాయానికి సహకరించాలని డిపిపల్లి విద్యుత్ శాఖ ఏఈ. సురేందర్ రెడ్డి తెలిపారు.

మహనీయులు మనందరికీ మార్గదర్శకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సామాజిక తత్వవేత్తలు మహనీయులు మనందరికీ మార్గదర్శకులని, ఆ మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ పోరాడుతుందని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళల బాలపీరు అన్నారు. శనివారం బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో బాచుపల్లి సీఐ జే.ఉపేందర్ చేతుల మీదుగా కేవీపీఎస్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ కేవీపీఎస్ జిల్లా నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎస్.బాలపీరు మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమాలు ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని, ప్రతిఘటన శక్తిని పెంపొందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కోసం పోరాటాలు నిర్వహించామని అదే విధంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కోసం ఉద్యమం చేసి సాధించామని అన్నారు. నేటికీ కొనసాగుతున్న కులవివక్షత, అంటరానితనం, సామాజిక అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మల్లికార్జున్, నవతెలంగాణ చిక్కడపల్లి బుక్ హౌసింగ్ ఇన్‌చార్జి వి.రఘు తదితరులు పాల్గొన్నారు.

24న జాతీయ బాలికల దినోత్సవం

- వారం రోజులపాటు కార్యక్రమాలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

భేటీ బచావో భేటీ పడావో పథకంలో భాగంగా ఈ నెల 24వ తేదీన జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వారంరోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యా పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీబీబీపీ ప్రతిజ్ఞ బ్యానర్ పైన సంతకాల సేకరణ సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో, డీఈఓ, సీడీపీఓస్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే శాంతి భద్రతల పరిరక్షణ



- అల్వాల్ సీఐ రాహుల్ దేవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజలు, పోలీసుల పరస్పర సహకారం, సమన్వయంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని అల్వాల్ సీఐ రాహుల్ దేవ్ అన్నారు. శనివారం ఆయన అల్వాల్ స్టేషన్ పరిధిలోని ఉత్సవ నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. ఈ నెల 22వ తేదీన అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ట, విగ్రహం మహోత్స వం సందర్భంగా దేవాలయాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా తగు చర్యలు తీసుకోవా లని నిర్వాహకులకు సూచించారు. అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకు నే బాధ్యత శ్రీరామ భక్తులదే అన్నారు. అందుకనే ముందుగానే సమాచారం తెలియపరచాలని, తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ప్రజల కోసమే పోలీసు వ్యవస్థ ఉందని, ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలే, తప్ప చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని సూచించారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చిన ప్పుడు ఎవరు సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఐ ప్రమోద్ కుమార్, ఎస్సై సురేష్, స్థానిక శ్రీరామ భక్త సమాజం భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్
- చిత్తారమ్మ దేవి జాతరపై సమీక్ష

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్, పరిధి చిత్తారమ్మ దేవాలయంలో 27 వరకు 9 రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎటువంటి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, అధికారులకు, ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఈ మేరకు "చిత్తారమ్మ జాతర" ఏర్పాట్లపై ఎమ్మెల్యే అధ్యక్షతన శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే జాతరలల్లో చిత్తారమ్మ దేవి జాతర కూడా ఒకటని అన్నారు. ఈ జాతరలో అధికారులు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. చిత్తారమ్మ జాతరపై సమీక్ష సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఆలయ కమిటీ ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. పోలీసులు, విద్యుత్, జలమండలి, ట్రాఫిక్ విభాగం, వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మెన్ కూన అంతయ్య గౌడ్, ధర్మకర్తల మండలి సభ్యులు రాచకొండ బాలరాజ్, అమురి ఇంద్రసేనగుప్త, గాజుల రామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, బాలానగర్ డీసీపీ ఎస్.శ్రీనివాసులు, పలు పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

ప్రజలందరూ అభివృద్ధిని ఆదరించారు



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ 4వ డివిజన్ నందు శనివారం 9వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద కృతజ్ఞత యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తొమ్మిదేండ్లలో చేపట్టిన అభివృద్ధి గుర్తుంచుకొని, తర్వాత ఐదేండ్లలో చేపట్టే అభివృద్ధిని ఆశించి మీలో ఒకడిగా, మీ ప్రజా ప్రతినిధిగా నన్ను ఎన్నుకొని ఇంతటి అఖండ విజయాన్ని అందించినందుకు కుత్బుల్లాపూర్ ప్రజానీకానికి ధన్యవాదాలు తెలియజేసేందుకు ఈ కృతజ్ఞత యాత్ర చేపట్టానన్నారు. మీ ఓటుతో నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆయా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వివిధ శుభకార్యాలకు ఆహ్వానించడంతో పాటుగా కాలనీల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులపై ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా పూర్తి కాక నిలిచి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



కేటీఆర్‌తో సమావేశమైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్‌జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుని శనివారం తెలంగాణ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలపై పలు విషయాలు చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.



లాల్ దర్వాజాలో సెంటర్ బిందు హైస్కూల్‌లో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బాబు రాజా, మాజీ వార్డ్ నెంబర్ బీజేపీ నగరనాయకుడు దినేష్ అంబారే తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

ఆన్‌లైన్‌లో సమస్యలు తెలపటానికి ఈ మెయిల్ అవకాశం కల్పించాలి



● ఏఎస్ఏ ఓయూ కమిటీ వినతి

నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు తమ హాస్టల్, కాలేజీ లో ఉన్న సమస్యలు తెలియజేయడానికి పకడ్బందీంగా ఆన్‌లైన్ ఫిర్యాదుల సిస్టమ్‌ని ఏర్పాటు చేయాలని చేయాలని శనివారం ఎఎస్ఏ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు తమ సమస్యలు చెపుకోవడానికి తరుచూ యునివర్సిటీ అధికారుల ఆఫీసుల చుటూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని, హాస్టల్ కనీస అవసరాలు లేకపోవడంతో అనేక సమస్యలు అలానే ఉండిపోతు న్నాయన్నారు. కాలేజీలో నెలకొన సమస్యల కోసం నేరుగా చెప్పడం కంటే డైరెక్ట్‌గా ఆన్‌లైన్‌లో తెలపటానికి అవకాశం కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళా విద్యార్థులు అలాంటి సమస్యలు చెప్పటానికి ముం దుకు వచ్చే పరిస్థితి లేదని ఈలాంటి అన్ని సమస్యలు ఆన్‌లైన్ ఫిర్యాదులు చేసేందుకు సిస్టమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎవరికి అలాంటి భయం లేకుండా తమ సమస్యలు నేరుగా యునివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకు పోవడానికి ఆన్‌లైన్ ఫిర్యాదుల ఈ మెయిల్ ద్వారా తమ కాలేజీలో లేదా హాస్టల్ నెలకొన సమస్యలు చెపుకోవచ్చు. ఈ సిస్టమ్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ఉపయోగంతో పాటు సమస్యలు నేరుగా త్వరగా పరిస్కారానికి అవకాశం ఉందన్నారు. ఇలాంటి ఒక మంచి ప్రజాస్వామిక వాతావరణం కల్పించాలని ఏఎస్ఏసెక్రెటరీ, రిజిస్ట్రార్ ప్రశాంత్ కోరారు.

అసైన్డ్ భూముల యజమానులకు హక్కులు కల్పించాలి

● మాజీ కలెక్టర్ ఎంవీ రెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

అసైన్డ్ భూముల యజమానులకు హక్కులు కల్పించాలని మాజీ కలెక్టర్ ఎంవీరెడ్డి, పలు వురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం అసైన్డ్ భూములకు శాశ్వత హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 1977 పీవోటీ చట్టం ప్రకారం ఆభూములను సాగుచేసుకో లేరని, కనీసం కొడుకు చదువుకోసం, కూతురు పెండ్లి కోసం భూమిని అమ్ముకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ చట్టాన్ని సవరించి వాటపై పూర్తి స్థాయిలో హక్కులు కల్పించాలని, రిజిస్ట్రేషన్ చేసుకునే వెసలుబాటు కల్పించాలన్నారు. ఎంటీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసైన్డ్ భూములు ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ఉందని అన్నారు.

ఆ భూములపై వారికి పూర్తి హక్కులుంటాయని, ఈచట్టం వల్ల వారు వాటిని సద్విని యోగం చేసుకునే పరిస్థితి లేదని, చట్టాన్ని సవరించడం ద్వారా వాటిపై హక్కులు కల్పించాలని కోరారు.అసైన్డ్ భూములకు శాశ్వత హక్కుల సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మి రాజ్‌కుమార్‌రెడ్డి, మన్నె నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు రూ.5లక్షల కుటుంబాల ఆధీ నంలో ఉన్నాయన్నారు. అర్హులైన వారందరికీ వాటిపై హక్కులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ కాంగ్రెస్ పార్టీ మ్యాని ఫెస్టోలో పెట్టిన విధంగా హామీని నిలబెట్టుకోవాల న్నారు. అవసర మైతే ఉద్యమిస్తానన్నారు. ఆప్ నాయకురాలు ఇందిరా శోభన్, తెలంగాణ ఎక్స్ సర్వీస్‌మేన్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రదీప్ కుమార్, మాజీ తహసీల్దార్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో సమస్యలు తలెత్తకుండా చర్యలు



● జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

నవతెలంగాణ-బంజారాహిల్స్

డివిజన్ పరిధిలోని బాలిరెడ్డి నగర్‌లో జరుగుతున్న సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ వెంకటేష్ వాటర్ బోర్డు అధికారులు స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఉన్న సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని, పనుల్లో ఎటువంటి నాణ్యత లోపం ఉన్న ఉపేక్షించేది లేదన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ పవన్, జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు నాని, డాక్టర్ శ్రీను, మహేష్, జోసెఫ్, హనీఫ్, రహీమ్, హరీష్, నవీన్ పాల్గొన్నారు.

చేనేతను ఆదరించండి : నటి భవ్యశ్రీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో బంజారాహిల్స్ రోడ్.నెంబర్.12లో కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటు చేసిన జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన టాలీవుడ్ వర్ధమాన నటి భవ్యశ్రీ, నిర్వాహకులు తిరుపతి సతీష్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉం దని, నేటికి వాటిపై వన్నె తగ్గలెదన్నారు. నేటితరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్ప త్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. చేనేత కారుల శ్రమనూ గుర్తించి ఆదరిస్తూ వినియో గించాలని, అప్పుడే వారి కష్టానికి తగ్గా ఫలితం తమ వంతుగా ఇవ్వగలమన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతున్నదని, ఈ ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుండి చేనేత కారులు, చేతిపని బృందాలు తమ సిల్క్‌హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటి రియల్ వంటి 50 వేల రకాల వస్త్రో ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు సతీష్ తెలిపారు.

కంప్యూటర్ కోర్సులతోనే ఉపాధి అవకాశాలు



● ప్రిన్సిపాల్ స్నేహ ప్రభ

నవతెలంగాణ-ఓయూ

సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాల, హబ్సిగూడలో టెక్స్ అకాడమీ ద్వారా విద్యార్థులకు ఉచితంగా కంప్యూ టర్ కో ర్సులను అందించడానికి బీఎస్సీ, బీకాం, బీబీఏ విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఉచిత ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ స్నేహ ప్రభ తెలిపారు. వారు మాట్లా డుతూ విద్యార్థులకు ఇలాంటి ఉచిత కోర్సులు, ఉపాధి అవకాశాలు అందించే డ్రైవ్‌లు విద్యా ర్థుల జీవితాలకు కచ్చితంగా సహాయపడతాయ న్నారు. కోర్సులు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యో గాలు కల్పిస్తామని, టెక్స్ అకా డమీ గ్రూప్ ఆఫ్ కంపె నీలలో ఉద్యోగులుగా ప్రవేశాలు కల్పిస్తామని మోహన్‌దాస్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ చెప్పారు. విద్యార్థులకు కోర్సులు, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ప్రిన్సిపాల్, యాజమా న్యానికి మోహన్ దాస్ కృతజ్ఞతలు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవీందర్ దయాత్రి మాట్లా డుతూ ఉచిత ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించినందుకు టెక్స్ అకాడమీకి ధన్యావాదాలు తెలుపుతూ, ఎంపికైన విద్యా ర్థిని రూపాని మనీషాకు,ఉచిత కోర్సులు, ఉద్యోగాలకు ఎంపికైనందుకు అభినందనలు తెలిపారు.ఈ సంద ర్భంగా పద్మజ సీనియర్ లెక్చరర్ మాట్లాడుతూ విద్యా ర్థులు చదువుతో పాటు జీవితంలో నిరంతర కృషి తపన తో ఎన్నో విజయాలు సాధించవచ్చన్నారు. కార్యక్ర మం లో సీనియర్ లెక్చరర్లు శశికళ, సరస్వతి, మైత్రి , జరీనా లావణ్య విజయలక్ష్మి, సబిత,నవిత, భావన, ప్రవల్లిక, అజీర సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల హబ్సిగూడ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.



తెలంగాణా భవన్‌లో శనివారం సికింద్రాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావే శానికి సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్, డిప్యూటీ స్పీకర్‌మోతె శ్రీలతశోభన్ రెడ్డి, కార్మిక నేత మోతెశోభన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.
నవతెలంగాణ-ఓయూ

జలమండలి ఎండీ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఎం క్యాంపు ఆఫీసు, చుట్టు పక్కల పరిసర ప్రాంతాలకు తాగునీరు, డ్రయినేజీ వ్యవస్థను మెరుగు పర్చడానికి చేపట్టిన పనులను జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని సూచించారు. జలమండలి చేపట్టే మరమ్మతులు, మ్యాన్ హెూల్ నిర్మాణం, పైపు లైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్-1 అజ్మీరా కృష్ణ, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యానివర్సిటీలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక సమావేశాన్ని శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమకారులు ఏకగ్రీవంగా తమ సంస్థను "తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదికగా" వేదికగా ఉండాలని తీర్మానించారు. ఈ వేదికను కంచర్ల బద్రి రాష్ట్ర చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళ చైర్మెన్‌గా దోనేవి కృష్ణలత, అలాగే వైస్ చైర్మన్ గా ఓయూ నుంచి డాక్టర్ అందే కృష్ణ, పి.రాధిక, తెలుగు యానివర్సిటీ నుండి నారుమళ్ళ మహదేవ్, పాలమూరు నుండి రంజిత్ పుట్ట, ఇఫ్లూ నుండి సూరప్రకాష్ గౌడ్‌లను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా నలిగంటి శరత్, శేఖర్ పూసపల్లి, డా.చంద్రయ, కొత్తపల్లి బాలరాజ్, బొట్టు అంజయ, మరియు బొడ్డు చంద్రకాంత్ సభ్యులు గా ఎన్నుకున్నారు.కో ఆర్డినెటర్స్‌గా డా.డి.సురేష్,సంతోష్,సురేష్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విధివిధానాలు. కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని రాష్ట్ర చైర్మన్ కంచర్ల బద్రి తెలిపారు.

బాపు సున్నిత సునిశిత మనస్వి



నవతెలంగాణ-కల్చరల్

సినీ దర్శకుడు చిత్రకారుడు బాపు సున్నిత సునిశిత మనస్వి అని, అయన తీసిన ప్రతి చిత్రం కళాఖండం అని ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పీ.విజయబాబు అన్నారు. కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో శ్రీత్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై బాపు 90వ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ నటుడు సాహిత్య వేత్త, దర్శకుడు తనికెళ్ల భరణికి బాపు పురస్కార ప్రధాన సభ జరిగింది ముఖ్య అతిథిగా విజయ బాబు పాల్గొని పురస్కారం బహూకరించి మాట్లాడారు.నటనలో నవ రసాలను పలికించే శక్తి భరణి కి వుందని ఇందుకు కారణం రచయితగా అయన అక్షరాల్లో ప్రతి పాత్ర అవిస్మృతం అవుతుందని వివరించారు. అంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన భరణి కి జీవిత సాఫల్య పురస్కారం బహుకరిస్తామని ప్రక టించారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ భరణి కేవలం నటుడు మాత్రమే కాదని, జీవితాన్ని కాచి వడబోసిన ఉన్నత వ్యక్తిత్వం కలవారని వివరించారు. నాట్య గురువు డాక్టర్ భారతి అధ్యక్షత వహించిన సభలో కళా పోషకులు కె.ఈ.రాజు, ఏం.వేంకటేశ్వర రావు స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో బాపు 90వ జయంతి పురస్కరించుకొని 90మంది నాలుగేళ్ల బాలల నుంచి ఎనభై ఏళ్ల వయోధికుల వరకు వేసిన చిత్రాలు జై ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు ఇనట్టు సుభాషిణి ప్రకటించి సర్టిఫికేట్లు భరణి ద్వారా అందించారు. రికార్డ్ నమోదు పత్రం సంస్థ అధ్యక్షులు పుష్పలత , కార్యదర్శి సురేందర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కారులో మంటలు..మూడు కార్లు దగ్ధం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఓ ప్రయివేటు హెూటల్ పార్కింగ్ స్థలంలో కారుకు మంటలంటుకొని మూడు కార్లు దగ్ధమయిన ఘటన బంజారాహిల్స్ రోడ్డునెం.4లో చోటు చేసు కుంది. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 4లో సరిత రెసిడెన్సీ వద్ద ఒక హెూటల్ పార్కింగ్ స్థలంలో కారును డ్రైవర్ స్టార్ట్ చేస్తుండగా స్పార్క్ నుంచి మంటలు చెలరేగినట్లు తెలిపారు. అ సమయంలో పక్కనే పార్క్ చేసి ఉన్న రెండు కార్లకు కూడా ఆ మంటలు అంటుకుని దగ్ధమయినట్లు తెలి పారు. దాదాపుగా ఈ ప్రమాదంలో మూడు కార్లు పూర్తిగా దగ్ధమయినట్లు పోలీసులు తెలిపారు. ఫైర్ సేఫ్టీ అధికారులు రంగంలో దిగి మంటలను అదుపు చేసినట్లు తెలిపారు.



పార్కింగ్ ప్లేస్‌లో తగలబడ్డ కార్ల ద్వారా మంటలు సరిత రెసిడెన్స్ మూడవ అంతస్తు వరకు ఎగసిపడ్డాయని, ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఓయూలో ఏం జరుగుతుంది..?



● ఓయూలో జరిగిన సంఘటలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలి
● మొన్న ఉన్నత విద్యా ప్రిన్సిపాల్ సెక్రటరీ నేడు ఇంటిలిజెన్స్ అధికారులు

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. దానిలో భాగంగానే ఇటీవలే రక్షణ కల్పించాలని ఓయూ పీహెచ్డీ విద్యా ర్థినిలు, మరుసటిరోజే పీజీ విద్యార్థినిలు ఆహారం నాణ్యత లేదని రాస్తారోకోలు చేపట్టిన విషయం తెల్సిందే. దీనితో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సెకరేటరి లేడీస్ హాస్టల్స్‌కు సంబంధించిన పూర్తి స్థాయిలో సమాచారాన్ని నివేదికను ఇవ్వాలని కోరాగా, ఓయూ అధికారులు సదరు నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఇక ఇది ఇలా ఉండగా శనివారం ఉదయం ఇంటిలిజెన్స్ విభాగం అధికా రులు కూడా వివిధ అంశాలపై పూర్తిస్థాయిలో సమగ్రమైన సమాచారాన్ని ఇవ్వాలని కోరగా ఓయూ అధికారులు వారికి అందజేశారు. దీనితో ఓయూలో అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ఏ సమాచారాన్ని అడుగుతారోనని కొంత సందిగ్ధంలో ఉన్న ట్లు సమాచారం. మరొక వైపు గత ప్రభుత్వం ఓయూను అన్ని రంగాల్లో నిర్వీర్యం చేసి ఓయూ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఓయూ పట్ల ప్రత్యేకదృష్టి, శ్రద్ధను సారిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, విద్యా వేత్తలు తమ అభిప్రా యాలను వ్యక్తం చేస్తున్నారు. ఇక ఓయులో ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు కూడా సీఎం రేవంత్ రెడ్డి ఓయూ తప్పకుండా సముచిత న్యాయం చేస్తారని, ఖాళీగా ఉన్న బోధన, భోదనేతర పోస్టులు భర్తీ చేస్తారని, ఓయూ అభివృద్ధికి నిధులు కేటాయిస్తారని ఆశతో ఉన్నట్లు తెలిపారు.

మాదిగ సామాజిక వర్గానికి సమానమైన వాటా కల్పించాలి



● తెలంగాణ ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలో యాభై లక్షల పైగా జనాభా, ఎస్సీ జనాభాలో 12 శాతం వున్న మాదిగ సామాజిక వర్గానికి రాజకీయ అధికారంలో సమాన వాటా దక్కలేదని మేడి పాపయ్య మాదిగ అసంతృప్తి వ్యక్తం పరచారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ తెలంగాణా రాష్ట్రం ఆధ్వర్యంలో మేడి పాపయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి మంత్రి పదవితో పాటు, ఒక రాజ్యసభ సీటు రెండు ఎంపీ సీట్లు, ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవులు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం మాదిగలను అన్ని అవకాశాలలోనూ విస్మరించడమే కారణమని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తప్పు పునరావృతం కాకూడదని మేడి పాపయ్య మాదిగ పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి, మేడి పాపయ్య మాదిగ నాయకత్వాన్ని బలపరచి, ఎమ్మార్పిఎస్ తెలంగాణా రాష్ట్రం భవిష్యత్తులోనూ చేయబోయే న్యాయబద్ధమైన పోరాటాలకు మద్దతుగా వుంటామని తెలియజేశారు.ఎనభై శాతానికి పైగా వున్న బీసీ ఎస్సీ ఎస్టీలకు రాజ్యాధికారాన్ని భిక్షగా అడగడం లేదని, ఇది మా హక్కుగా డిమాండ్ చేస్తున్నా మని జాజుల శ్రీనివాస్ గౌడ్ వివరించారు.ఈ సమావేశానికి ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ఎమ్మార్పిఎస్ తెలంగాణా రాష్ట్రం వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గెలవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమస్త తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | జనవరి 21,20204 | www.navatelangana.com

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

● గోగులపాటి కృష్ణమోహన్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సామాజిక, సాంస్కృతిక, సాహిత్య సేవాసంస్థ నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గోగులపాటి కృష్ణమోహన్ విజ్ఞప్తి చేశారు. సిఎంఆర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో కుత్బుల్లాపూర్ భాగ్యలక్ష్మి కాలనీ లోని నేతాజీ హైస్కూల్‌లో ఈ రోజు (ఆదివారం) నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. ఇట్టి వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారికి అవసరమైతే శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా అందజేస్తారని ఆయన తెలిపారు. ముఖ్యంగా పేద, మద్యతరగతి కుటుంబాలకు ఈ ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతుందని కావున స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

● ఫతేనగర్ డివిజన్ స్థానికుల ఆవేదన



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. నిత్యం అంతర్గత అక్కడక్కడ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తుంటే మరో పక్క డివిజన్ పరిధిలో ఓల్డ్ ఎయిర్ పోర్టు రోడ్డు, అంతర్గత రోడ్లపై నిత్యం మురుగు దర్శనమిస్తోంది. గత నెల రోజులుగా మురుగు ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా నైపర్ 11వ వార్షికోత్సవం



● గ్రాడ్యుయేషన్, బంగారు పతకాలు అందుకున్న

192 మంది విద్యార్థులు

నవతెలంగాణ-బాలానగర్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, హైదరాబాద్ (నైపర్) లో తన 11వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో వివిధ విభాగాలలో అత్యుత్తమ విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు కాన్వకేషన్ సమయంలో వారి డిగ్రీలను అందించారు. ప్రముఖ అవార్డు గ్రహీతలలో సోలాయ్ ఎంఆర్ మెడిసినల్ కెమిస్ట్రీ తలారి శశికళ (ఫార్మాస్యూటికల్ అనాలిసిస్), పూజిత పింజలా (ఫార్మకాలజీ , టాక్సికాలజీ), మోమిన్ అల్వియా అష్పాక్ (రెగ్యులేటరీ టాక్సికాలజీ), నైటిక్ జైన్ (ఫార్మాస్యూటిక్స్), కరీనాస్యూటిక్స్ (ప్రోవటెక్నాలజీ) (ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్), అధవ్ స్నేహల్ సంజయ్ (వైద్య పరికరాలు), దామరే రుతుజా అబా (సహజ ఉత్పత్తులు), దేవసాని నమ్రతా దత్తాత్రయ (ఫార్మాకోఇన్ఫర్మేటిక్స్), కీర్తిగా దేవి ఎస్ఎస్ (రెగ్యులేటరీ అఫైర్స్). ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణిష్ చావ్లా, ఐఏఎస్, ఫార్మాస్యూటికల్స్ విభాగం కార్యదర్శి, డా. సత్యనారాయణ చావా, లారస్ ల్యాబ్స్ సీఈఓ. నైపర్-హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ శైలేంద్ర సరాఫ్ ఈ వేడుకకు అధ్యక్షత వహించి, అతిథులకు సాదరస్వాగతం పలికారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రొఫెసర్ శైలేంద్ర సరాఫ్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో నైపర్-హైదరాబాద్ యొక్క17 సంవత్సరాలలో ఎన్ఐఆర్ఎఫ్ 1వ ర్యాంక్‌తో సహా ఇన్‌స్టిట్యూట్ సాధించిన విజయాలు పరిశోధన, పరిశ్రమల ప్రాజెక్ట్‌లు, విద్యార్థుల నైపుణ్యానికి సంబంధించిన సమగ్ర అభివృద్ధిని సాధించామనారు. ఫార్మసీ మెడిసిన్‌లో భారతదేశాన్ని దాని ప్రారంభం నుంచి అత్యాధునిక పరిశోధనల ద్వారా స్వావలంబనగా మార్చడానికి దోహదపడిందన్నారు. గత 2022-23 విద్యా సంవత్సరంలో 175 పరిశోధన ప్రచురణలు, 53 పుస్తక అధ్యాయాలు, 10 ఫైల్ చేసిన పేటెంట్లు, 3 మంజూరు చేసిన పేటెంట్‌లతో గణనీయమైన మైలురాళ్లను సాధించామన్నారు. వివిధ పరిశ్రమలు, విద్యా సంస్థలతో కలిసి న్యూట్రిషనల్ సప్లిమెంట్లను పరీక్షించడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని స్థాపించడానికి నేషనల్ యాంటీ-డోపింగ్ ఏజెన్సీతో సహకరిస్తుంది. అదనంగా, నిధులు సమకూర్చబడిన ఫార్మా ఫోకస్ ఇంక్యుబేటర్ అవిస్కరన్, 45 మంది వ్యవస్థాపకులను విజయవంతంగా పొదిగించింది ఇన్‌స్టిట్యూట్ బల్క్ డ్రగ్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించే ప్రక్రియలో ఉందని

ఈ కాన్వకేషన్‌లో ప్రముఖ అతిథి అరుణిష్ చావ్లా మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ చేసిన విద్యార్థులను వారి ఔషధ నైపుణ్యం ద్వారా దేశ సంక్షేమానికి సహకరించేలా ప్రోత్సహించారు. డాక్టర్ సత్యనారాయణ చావా అంకితభావం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఫార్మాస్యూటికల్ రంగంలో ఆవిష్కరణ. ప్రొఫెసర్ శైలేంద్ర సరాఫ్ గ్రాడ్యుయేట్ల విజయాల పట్ల గర్వం వ్యక్తం చేశారు మరియు ఫార్మాస్యూటికల్ విద్య మరియు పరిశోధనలలో శ్రేష్ఠతకు సంస్థ యొక్క నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, అనేక మంది ప్రముఖ అతిథులు వారి జ్ఞానం, అనుభవాలను పంచుకున్నారు. అరుణిష్ చావ్లా గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ ఫార్మాస్యూటికల్ రంగం యొక్క విజయాలు భారత దేశాన్ని ఫార్మసీకి విశ్వగురువుగా భావిస్తామన్నారు. అతను గ్రాడ్యుయేట్‌లను భారతదేశం యొక్క సంపన్న యుగంలో భాగం కావాలని ప్రోత్సహించాడు. తన నిజజీవిత అనువర్తనాలు, ఉత్పత్తుల పారిశ్రామికీకరణకు పరిశోధనను అనువదించడం యొక్క ప్రాముఖ్యతను అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ చావా మాట్లాడుతూ పట్టభద్రులైన విద్యార్థులు ఫార్మా రంగంలోకి రావడానికి ఇదే సరైన అవకాశమని, ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్ ద్వారా పొందుపరిచిన మూలవిలువలను కొనసాగించడం ద్వారా దేశాభివృద్ధిలో చురుగ్గా పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించారు. అతను గ్రాడ్యుయేట్‌లను ఇన్‌స్టిట్యూట్ ఖ్యాతిని పెంపొందిం చాలని కోరారు. అతిథులు, ప్రముఖులు, పూర్వ విద్యార్థులు వర్ధమాన శాస్త్రవేత్తలతో జ్ఞానం, అనుభవాలను పంచుకోవడానికి ఈ కాన్వకేషన్ ఒక వేదికగా ఉపయోగపడింది. ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో వ్యవస్థాపకులు. ప్రతిధ్వనించే సందేశం గ్రాడ్యుయేట్లు దేశ ప్రయోజనాల కోసం శ్రద్ధగా పని చేయాలని, వారికే కాకుండా వారు అనుబంధించబడిన సంస్థలకు, ముఖ్యంగా వారి తల్లిదండ్రులకు కూడా ప్రశంసలు తీసుకురావాలని వారు కోరారు.

కొత్త ఓటర్ల నమోదు, పేర్లు సవరణలు



నవతెలంగాణ-దుండిగల్

కేంద్ర ఎన్నికల కమీషనర్ ఆదేశాల ప్రకారం శనివారం, ఆదివారం కొత్త ఓటర్ల నమోదుతో పాటు, పేర్ల సవరణలు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ స్పెషల్ క్యాంపెయిన్ నిరవహిస్తుందని దుండిగల్ మున్సిపల్ కమీషనర్ కే. సత్యనారాయణ రావు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు నమెదు చేసుకోవాలనుకుంటే వారు ఫారం-6, ఓటు లో మార్పులు చేసుకోవాలనుకొనే వారు ఫారం-8, అడ్రస్ మార్పు చేసుకొనేవారు ఫారం-8ఏ, ఓటరు ఎవరైనా చేనిపోయిన వారిని ఫారం-7, ఫారంల ద్వారా మీ మీ బూత్ లెవల్‌లలో ఆఫీసర్స్ వద్ద నెడు నమోదు చేసుకోవచ్చు అన్నారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం 9 గంటలకు నుంచి బిఎల్ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఈ సందర్భంగ శనివారం బహదూర్ పల్లి, దుండిగల్ వర్డ్‌లో గల పోలింగ్ బూత్‌లను అయన పరిశీలించారు. ఈ కార్యక్రమములో బిఎల్ఓ లు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో దూసుకెళ్తున్న ఫతేనగర్



● కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆశీస్సులతో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ పరిధిలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దూసుకోపోతున్నారు. శనివారం అందులో భాగంగా స్వయంగా పైప్ లైన్ రోడ్డు, నేతాజీ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన జీహెచ్ఎంసీ ఏఈ పవన్, జవాన్ పోచయ్యతో కలిసి పర్యావేక్షించారు. సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రైన్, వీడీసీసీ రోడ్డు పనులు పూర్తి కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వెంటనే కార్పొరేటర్, స్థానిక ప్రజలతో మాట్లాడి నేరుగా సమస్యలు తెలుసుకున్నారు. కార్పొరేటర్ వెంట స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు అధ్యక్షుడు వి.స్వామి, కార్యదర్శి వెంకట్రామ నరసయ్య పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తుందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఫతేనగర్ డివిజన్ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతున్న దని తెలిపారు. నియోజకవర్గం లోని మిగతా డివిజన్‌లకు ఆదర్శంగా నిలుస్తున్నదని నేతాజీ కాలనీ అధ్యక్షుడు స్వామి అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో డివిజన్‌లో ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేపట్టి స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్, కంచి స్వామి, సోమేష్, కరుణాకర్, నాయుడు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి దేవాలయాన్ని పరిశుభ్రం చేసిన కార్పొరేటర్లు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని శనివారం స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పరిశుభ్రం చేశారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని ఆమె శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ నెల 22 వ తేదీన అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో దేశంలోని హిందూ దేవాలయాలను పరిశుభ్రం చేయాలనీ భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని తాను పరిశుభ్రం చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



నేరేడ్‌మెట్: అయోధ్యలో ఈ నెల 22 న శ్రీరాముడి ఆలయ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా భారత దేశంలోని అన్ని ఆలయాలను శుద్ధి జరపాలని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ షఫీనగర్‌లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు. కార్పొరేటర్ తనే స్వయంగా కార్యకర్తలతో, కాలనీవాసులతో కలిసి ఆలయ పరిసరాలను, గర్భగుడిని కడిగి శుద్ధి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఏ పండుగ వచ్చినా, మనం మొదట ఇల్లు శుద్ధి చేసుకుని, తర్వాత తోరణాలు కట్టి పూజా కార్యక్రమాలు చేస్తామన్నారు. అదే విధంగా బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ రోజున కూడా ప్రతి ఆలయం శుద్ధిచేసి, తోరణాలు కట్టి, రామనామజపంతో, కీర్తనలతో, హెూమాలు, క్రతువులు నిర్వహించి, అన్నదానాలు చేయాలని కార్పొరేటర్ కోరారు.



కూకట్‌పల్లి: జనవరి 22 న అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో, దేశంలోని హిందూ దేవాలయాలను పరిశుభ్రం చేయాలని, భారత ప్రధాని నరేంద్ర మోది పిలుపు మేరకు, ఆలయాల పరిశుభ్రం కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, చెన్నమనేని స్రవంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఆల్విన్ కాలినీ ఆంజనేయ స్వామి దేవాలయంతో పాటు మరికొన్ని ఆలయాలలో, ఆలయాల పరిశుభ్రం కార్యక్రమంలో పాల్గొన్న, మేడ్చల్ జిల్లా బి.జె.పి అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, నరేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, చెన్నమనేని స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



వివేకానందనగర్‌లోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు స్వగృహంలో, ఫతే నగర్ శివాలయం హట్స్ నూతన కార్యవర్గం సభ్యులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావును కలిసారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావును శాలువాతో సత్కరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు నర్సింహులు, సెక్రటరీ కుర్మయ్య, ఉపాధ్యక్షులు కృష్ణ, నర్సింహులు, బీజేపీ నియోజకవర్గ ఓబీసీ కో కన్వీనర్ సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్ పల్లి

అయోధ్య రాములోరి కానుకలతో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

అయోధ్యలో రామమందిరం నిర్మాణమనేది ప్రతి హిందువు చిరకాల వాంఛ అని రామాంజనేయ చారిట బుల్ ట్రస్ట్ నిర్వాహకులు అలివేలు వాణి తెలిపారు. శనివారం బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా రామాంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ బాల రామునికి వెండి మొలతాడు, బంగారపు కాళ్ళ కడియాలు అంద చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉడుత భక్తిగా తమ వంతు సహకారం అందచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా స్థానిక బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వీటికి పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం నాడు తాము ఇక్కడ నుంచి బయలు దేరి అయోధ్యకు చేరి, బాల రామునికి కానుకగా సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశీ, ప్రణయ్ కుమార్, రజిని, సోనీ చైత్ర తదితరులు పాల్గొన్నారు.

టీవీఆర్ మోడల్ హై స్కూల్‌లో ఘనంగా 'ఫ్రూట్స్ డే'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ నందు మేనేజింగ్ డైరెక్టర్ టీ.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం "ఫ్రూట్స్" డే ఘనంగా నిర్వహించారు. ఎల్కేజీ, యూకేజీ చిన్నారులు వివిధ రకాల ఫ్రూట్స్ వేషధారణలో అందరినీ అలరించారు. పౌష్టికాహార విలువలు ఆరోగ్యాన్ని అందించే పండ్లను గూర్చి శరీరంలో రక్తాన్ని పెంపొందించే పండ్లను గూర్చి ఆరోగ్యపరమైన, వివిధ రకాల పండ్లను ప్రదర్శిస్తూ పోషక విలువలను వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి మాట్లాడు తూ.. ఫ్రూట్స్ యొక్క ప్రాముఖ్యతను విద్యారులకు తెలిపారు. ప్రతిరోజు ఫ్రూట్స్ తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు బరువు నియంత్రణలో ఉంటుందన్నారు. మనకు మేలు చేసే విటమిన్లు, పోషకాలు, పీచు, పోలిక్ యాసిడ్, సూక్ష్మ పోషకాలు వీటిలో సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ఇవన్నీ అవసరం అన్నారు. చిన్నారులను చైతన్యపరిచిన అధ్యాపక బృందాన్ని, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com



బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బొక్క నరసింహారెడ్డి నాల్గోసారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నరసింహారెడ్డిని ఆయన నివాసంలో రామిడి శు రకర్ణారెడ్డి ఆధ్వర్యంలో యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిడి శూరకర్ణ రెడ్డి, బండి దీక్షిత్ యువ మోర్చారాష్ట్ర అధికార ప్రతినిధి, హరిశ్వర్ రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ కలిశారు. తర్వాత ప్రత్యేకంగా శు భాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కాశీ విశ్వనాథ్



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇనిస్పెక్టర్‌గా కాశీ విశ్వనాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఐగా పనిచేస్తున్న కె కిరణ్ కుమార్ సైబర్ క్రైంకు బదిలీ అయ్యారు. మంచాల పోలీస్ స్టేషన్ లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కాశీ విశ్వనాథ్ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. అనంతరం ఆయనకు ఎస్ఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది స్వాగతం పలికారు.

వరద నీటి కాల్వ పనుల పరిశీలన



• ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - ఎల్బీనగర్

గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని సరూర్ నగర్ చెరువు కట్ట కింద చేపట్టిన టన్నలింగ్ పనులను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడ్డిఅన్నారం డివిజన్ నందు వరదనీటి సమస్యలు తీర్చే ప్రయత్నంలో భాగంగా టన్నలింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపు 95 శాతం పనులు పూర్తి అయినట్లు చెప్పారు. మిగతా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గతంలో వరదనీటి సమస్యల కోసం రెండు గేట్లు పెట్టించినట్లు గుర్తుచేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమేష్ ముదిరాజ్, రమణ రెడ్డి, ప్రదీప్, విక్కీ, అధికారులు ఇరిగేషన్ డి.ఈ.పవన్, కాంట్రాక్టర్ రమేష్ నాయుడు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారం కోసం త్వరలో చర్యలు

• ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ - చైతన్యపురి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం కోసం త్వరలో చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అర్థ గణాంక శాఖ డైరీ- 2024ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి మారం జగదీష్, టీఎన్జీవో సహ అధ్యక్షులు, టెస్సా అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ అర్థ గణాంక శాఖ డిపార్ట్మెంటల్ ఫోరం డైరీని 2006 సంవత్సరం నుంచి నిరాటంకంగా విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలైన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, పెండింగ్ డీఏలు, సీపీయేస్ రద్దు, 317- జీవోలో జరిగిన అన్యాయాలను సరి చేయాలన్నారు. ఉద్యోగులకు చందాతో కూడిన ఆరోగ్య కార్డ్స్ మంజూరు చేయాలని, ఆంధ్రాలో పని చేస్తున్న 84 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కోరినట్లు తెలిపారు.

అనంతరం అర్ధ గణాంక శాఖ నూతన స్టాఫింగ్ పాటర్న్ గురించి, ఉప గణాంక అధికారి పోస్టును మల్టీ జోన్ పోస్టుగా మార్చడానికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి త్వరలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్థ గణాంక శాఖ సంచాలకులు దయానందం, టేస్సా కార్యదర్శి హరికృష్ణ, మంత్రి ప్రగడ శ్రీనివాస్, వేణు మాధవ్ , శివ కుమార్, నరసింహా చారి, వెంకట రమణ, నగేష్ , దుర్గేష్, రవి, తెలంగాణ నాలుగో తరగతి ప్రతినిధి రవీందర్, డివైఎస్ ఓ మనోహర్ పాల్గొన్నారు.

'విద్యార్థులను తీర్చిదిద్దడానికి
తల్లిదండ్రుల సహకారం అవసరం'



నవతెలంగాణ - ధూల్‌పేట్

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని ఎస్.వి.నగర్ పురానాపూల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అఫ్జల్ గంజ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజాకుమారి అన్నారు. పాఠశాల ప్రాంగణంలో టీచర్స్, పెరెంట్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ పాఠశాల విద్యను అభ్యసించేటప్పుడు అలవడాలని అన్నారు. పదో తరగతి పరీక్షలు జరిగే వరకు టీ.వీలకు, సినిమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఎంసి ఎన్నికల నోటిఫికేషన్ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు పండితులు డాక్టర్ ఎస్.విజయభాస్కర్, ఉపాధ్యాయులు బల్వంత్ రెడ్డి, అశోక్ బాబు, సుచరిత, బబిత, కౌసర్ ఫాతిమా, పి.ఇ.టి.ఎస్.శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఢిల్లీ గణతంత్ర పెరేడ్‌కు
సిటీ కళాశాల విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ - ధూల్ పేట్

ఢిల్లీలో జరిగే 75వ గణతంత్ర వేడుకల పెరేడ్‌లో తమ కళాశాల ఎన్‌సిసి కాడెట్లు బీఎస్సీ విద్యార్థి రాజశేఖర్, బీకాం విద్యార్థి మణికంఠ ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.బాల భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల కాడెట్లు ప్రతి సంవత్సరం వివిధ క్యాంపులలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారన్నారు. అలాగే ఢిల్లీలో గణతంత్ర వేడుకల పెరేడ్‌లో పాల్గొంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని తెలిపారు. అనంతరం ఎంపికైన కాడెట్లను, ఎన్‌సీసీ యూనిట్ అధికారి డాక్టర్.కృష్ణవేణిని ప్రిన్సిపాల్, అధ్యాపక వర్గం అభినందించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



• మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్ పరిధిలో ఉన్న వైకుంఠపురం కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి శనివారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు మర్రి జగన్మోహన్ రెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, నాయకులు బంగారి బాబు, సుబాన్ యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా : కౌన్సిలర్ ఐలయ్య



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికే ఐలయ్య అన్నారు. కమ్మగూడ రాజ్ రంజిత్ కాలనీ, నవభారత్ కాలనీ, ప్రగతి నగర్, న్యూ ప్రగతి నగర్ కాలనీల్లో రూ.33లక్షలతో చేపట్టిన బీటీ, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఐలయ్య శనివారం శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి సహకారంతో తమ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్లు ప్రాధాన్య క్రమంలో వేయిస్తున్నట్లు తెలిపారు. నాలుగున్నర ఏండ్లలో వార్డులోని అన్ని కాలనీలకు నిధులు కేటాయించి, పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ రంజిత్ కాలనీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరిరెడ్డి, నవభారత్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, మనోహర్, ప్రగతి నగర్ వాసులు తిరుపతి రెడ్డి, మురళి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలి

కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్

నవతెలంగాణ -నాగోల్

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. నాగోల్ డివిజన్ మన్సూరాబాద్‌లోని వాంబే కాలనీలో జలమండలి అధికారులతో కలిసి శనివారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హిందూ స్మశానవాటిక వద్ద నెలకొన్న డ్రైనేజీ లైన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులను కోరారు. కాలనీలో ఎలాంటి డ్రైనేజీ సమస్య రాకుండా శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దాల ఐలయ్య, వస్పారి మల్లేష్, శ్రీధర్ గౌడ్, సునీల్, దేవేందర్, మనోజ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



యువత స్పోర్ట్స్ వైపు మొగ్గు చూపాలి



• ఫలక్ నుమా ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర

నవతెలంగాణ - ధూల్ పేట్ / సంతోష్ నగర్

యువత స్పోర్ట్స్ వైపు మొగ్గు చూపాలని ఫలక్ నుమా ఇనిస్పెక్టర్ రాఘవేంద్ర అన్నారు. రవీంద్ర నాయక్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శని వారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రారంభించి, మాట్లాడారు. ఈ టోర్నమెంట్లో 8 టీంలుగా భాగస్వాములు కావడం జరిగిందన్నారు. యువత, విద్యార్థులు ఎప్పుడు స్పోర్ట్స్‌లో ముందు ఉండాలని సూచించారు. చెడు మార్గం వైపు పోకుండా చదువుతూ స్పోర్ట్స్ వైపు వెళ్లి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బంజారా వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ యువకులకు స్పోర్ట్స్‌లో ప్రోత్సహించడానికి ఈ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. యువత భవిష్యత్ కోసం తమ కమిటీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీలో రామ్ టీమ్ - కె మనోజ్ నాయక్, యువన్ టీమ్ - ఎం శ్రీకాంత్ నాయక్, దిల్దార్ స్నేహితులు - కె నవీన్ నాయక్, పవర్ హంటర్స్- అర్జున్ నాయక్, పాలకుల బృందం - జి దుర్గా ప్రసాద్, ఎప్పటికీ స్నేహితులు - కె ప్రవీణ్ నాయక్, ధగడ్ సాయి- జె గోపీ నాయక్ జట్టులు కొనసాగాయన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ కమిటీ నాయకులు హరీశ్ నాయక్, శ్రీను, చిన్న, మహేష్, నగేష్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైరల్ వ్యాధులను ఎదుర్కోవడానికి సమగ్ర విధానం అవసరం

• సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ దిలీప్ గుడే



నవతెలంగాణ-సిటీబ్యూరో

కరోనా వైరస్ ద్వారా ఎదురయ్యే సవాళ్లతో భారతదేశం మళ్లీ పోరాడుతున్నందున, నివారణ చికిత్స రెండింటికీ సమర్థవంతమైన వ్యూహాలను అన్వేషించడం చాలా కీలకం. టీకా ప్రచారాలు, మాస్క్ ధరించడం, భౌతిక దూరాన్ని పాటించడం వంటి ప్రజారోగ్య చర్యలు వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో కీలకమైనవి. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య అధికారులచే ఆమోదించబడిన ఈ పద్ధతులు సంక్రమణ ప్రమాదాన్ని తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. చికిత్స డొమైన్‌లో, నిరంతర పరిశోధన విభిన్న విధానాలను పరిశీలిస్తోంది. ముఖ్యంగా, దీర్ఘ కాలం పనిచేసే, విస్తృత-స్పెక్ట్రమ్ టెట్రాసైక్లిన్ యాంటీబయాటిక్ అయిన డాక్సీసైక్లిన్ వంటి యాంటీబయాటిక్స్ చక్కటి వాగ్దానాన్ని ప్రదర్శించాయి. ఇది ఎస్ఏఆర్ ఎస్-సీఓవీ-2కి వ్యతిరేకంగా ఇన్ విట్రో యాక్టివిటీతో పాటు, శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి, ప్రతికూల ఫలితాలను తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ముఖ్యంగా ముందుగానే వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగుల్లో! అయినప్పటికీ, యాంటీవైరల్ మందులు, రోగనిరోధక మాడ్యులేటర్లు, సహాయక చికిత్సలు సమిష్టిగా కోవిడ్ -19 చికిత్స అభివద్ధి చెందుతున్న ప్రకృతి దశ్యాన్నీ రూపొందిస్తాయని అంగీకరిస్తూ, సంపూర్ణ దక్పథాన్ని నొక్కి చెప్పడం చాలా కీలకం. డాక్టర్ దిలీప్ గుడే వివరిస్తూ, "ముందుగా తగిన చికిత్స ప్రాముఖ్యతను గుర్తించడం, పలు ఆరోగ్య సమస్యలు ఉన్న పరిస్థితులతో అధిక-ప్రమాదకర వ్యక్తులను పర్యవేక్షించడం చాలా కీలకం. రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు, సత్వర వైద్య సంరక్షణ వ్యాధి పురోగతిని నిర్వహించడంలో, తీవ్రమైన ప్రతికూలతలను నివారించడంలో సహాయపడుతుంది" అని తెలిపారు. ఈ నివారణ చర్యలను ప్రోత్సహించడంలో ప్రజల అవగాహన, విద్య పాత్రను అతిగా చెప్పలేం. యాక్సెస్ చేయగల, ఖచ్చితమైన సమాచారం, వ్యక్తులు సమాచారంతో నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది. వైరస్‌కు వ్యతిరేకంగా సమిష్టి కృషికి దోహదపడుతుంది.

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా సంరెడ్డి



నవతెలంగాణ - సంతోష్ నగర్

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి సంరెడ్డి సురేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలను అందజేశారు. తర్వాత శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి, గౌర దేవేందర్, యాదగిరి సురేందర్, కొప్పుల దినేష్, సంతోష్, దినేష్, మనోజ్, ఉదయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు శిబిరాలు



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఓటరు గుర్తింపు కార్డులకు సంబంధించిన వేర్వేరు దరఖాస్తులను స్వీకరించేందుకు శనివారం, ఆదివారం ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత ముసాయిదా ఓటరు జాబితాతో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కొత్త ఓటరు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు. అదేవిధంగా ఎలాంటి తప్పులున్నా సవరణలు కోసం, ఫోన్ నంబర్ యాడింగ్, తదితర సవరణ కోసం అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

నవతెలంగాణ - ధూల్ పేట్

ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని మలక్‌పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, చార్మినార్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ నియోజకవర్గాల ఎలక్ట్రాల్ రిజిస్ట్రేషన్ అధికారులు జయంత్, నాగమణి, సురేందర్, సరిత, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్‌లు సూచించారు. ఈ మేరకు ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం సందర్భంగా శనివారం చార్మినార్ జోనల్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ నమోదు, పరిశీలన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే ఓటర్లుగా తమ పేరు నమోదు చేసుకున్నవారు మరోసారి ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలన్నారు. ఓటర్ ఐడీ కార్డ్ లో ఏమైనా తప్పులు ఉన్నవారు స్థానిక పోలింగ్ కేంద్రాల్లో శనివారం, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉన్న బీఎల్‌ఓలను సంప్రదించి సవరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ప్రమాద రహిత సమాజాన్ని నెలకొల్పాలి'



నవతెలంగాణ -నాగోల్

ప్రమాద రహిత సమాజాన్ని నెలకొల్పడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని ఆర్టీవో సురేష్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం నాగోలులోని ఆర్టీవో కార్యాలయంలో దరఖాస్తుదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలలు పాటిస్తూ, బాధ్యతాయుతంగా వాహనాన్ని నడపాలని సూచించారు. వాహనాలను నడిపే సమయంలో ఫోన్లు మాట్లాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్ నగర్

క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలని హైదరాబాద్ జిల్లా సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ శనివారం వాహనదారులకు గులాబీ పువ్వు అందజేశారు. సంతోష్ నగర్ ట్రాఫిక్ సీఐ నరసింహా నాయక్, ఎస్ఐలు సత్యనారాయణ, వెంకటప్ప, సిబ్బందితో కలిసి సంతోష్ నగర్ ఐఎస్ సదన్ చౌరస్తా వద్ద జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.





మహనీయుడు కోరిన మహిళా ఉద్యమం

'ప్రతి వంటగత్తె ఓ రాజకీయవేత్త కావాలి' అని సోవియట్ కమ్యూనిస్ట్ విప్లవ వీరుడు లెనిన్ ఏనాడో కలలు కన్నాడు. కానీ నేటికీ మన దేశంలో చాలా మంది మహిళలు ఇంకా వంటగదికే పరిమితం చేయబడుతున్నారు. ముఖ్యంగా గత పదేండ్లుగా మనువాదుల పాలనలో దేశం మగ్గిపోతున్నది. మహిళల పరిస్థితి మరింత దిగజారిపోతున్నది. ఎన్నో పోరాటాలు చేసి నాలుగ్గోడలు దాటి అడుగు బయట పెట్టిన ఆమెను తిరిగి గదిలో బంధించే ప్రయత్నం మతోన్మాదుల కనుసన్నల్లో తీవ్రంగా జరుగుతుంది. ఇటువంటి నేపథ్యంలో మహిళా అభ్యున్నతిని కలలు కన్న ప్రపంచ కమ్యూనిస్టు వైతాళికుడైన లెనిన్ మహాశయుని శత వర్ధంతి జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ఆయన కోరిన మహిళా ఉద్యమం గురించి మననం చేసుకోవడం, ఆయన మార్గంలో నడవడం నేటి మహిళా లోకానికి అత్యవసరం.

1933 నాటికి మహిళా ఉద్యమ నేత క్లారాజెట్కిన్‌కు డెబ్బై ఐదేండ్లు నిండాయి. ఊపిరి పీల్చుకోవడానికి ప్రతి నిమిషానికీ గిజగిజలాడి పోతున్న సమయం అది. అప్పటికే తన శక్తి నానాటికి ఉడిగి పోతున్నట్టు ఆమె గ్రహించింది. అయితే పని చేయడం మాత్రం మానుకోలేదు. మృత్యుశయ్యపై పరుండి ప్రపంచ మహిళలకు లెనిన్ ప్రసాదించిన హక్కుల పత్రాన్ని ఆమె రాసింది. దానిలోని చివరి వాఖ్యలు.. "ఒక మహాలక్ష్యం ప్రపంచాన్ని వెలుగొందజేస్తున్నది. ఈ చరితాత్మక సమయంలో ఎడతెగని పోరాటం జరపవలసిన అవసరం ఎంతైనా ఉంది. కష్టపడి పని చేసే స్త్రీలందరూ తమ కర్తవ్యాన్ని గుర్తించి, తదనుగుణమైన పోరాటం సాగించ వలసిన తరుణం వచ్చింది. స్త్రీలలో గల స్వల్ప అంతరువులు ఈ పవిత్రమైన సమయంలో అడ్డు రాకూడదు. అజ్ఞాతంగావున్న ఊరూ-పేరూ లేని కోట్లాది వీరవనితల్లారా, మీరు విస్తృత ప్రాతిపదికపై పయనించండి. మీ లక్ష్యం తప్పక సిద్ధిస్తుంది. లెనిన్ ప్రసాదించిన హక్కుల పత్రాన్ని అమలు పరచే వారిలో మీ స్థానాన్ని తప్పక స్వీకరించండి. చిరస్మరణీయమైన ఆయన ఉపదేశాలను, రచనలను ప్రపంచమంతటా అమలులో పెట్టండి. లెనిన్ ఆశయాన్ని ఆచరణలోపెట్టే భాగ్యానికి మీరే నోచుకోండి. లెనిన్‌కు నిజమైన శిష్యురాండ్రుకండి" అంటూ రాశారు.

అత్యవసర భాగంగా...

క్లారా జెట్కిన్ అంటే లెనిన్‌కి చాలా అభిమానం. సమర్ధతగల విప్లవకారిణిగా, సంపూర్ణ మార్క్సిస్టుగా, రెండవ ఇంటర్నేషనల్లో అవకాశవాదానికి బద్ధశత్రువుగా ఆమెను లెనిన్ చాలా గౌరవించేవారు. అనేక విషయాలను గూర్చి ఆమెతో మనసువిప్పి మాట్లాడేవారు. ఆమెతో జరిపిన సంభాషణలు ఆయనకు ఆనందం కలిగించేవి. లెనిన్‌ని గూర్చి క్లారా స్మృతులు, ఆయనను గూర్చి ఆమె రాసిన వ్యాసాలు, ఇచ్చిన ఉపన్యాసాలు ఆయన పట్ల ఆమెకు ఎంతటి గౌరవభావం వుండేదో తెలియజేస్తాయి. 'మహిళల హక్కులను గురించిన సమస్యను లెనిన్ నాతో అనేక సార్లు చర్చించారు. మహిళా ఉద్యమం సాధారణంగా ప్రజా ఉద్యమంలో అత్యవసర భాగంగా ఉంటుందనీ, కొన్ని పరిస్థితుల్లో అది నిర్ణయాత్మక పాత్ర వహించ వచ్చుననీ ఆయన అభిప్రాయం. కనుకనే లెనిన్ మహిళా ఉద్యమానికి చాలా ప్రాముఖ్యతనిచ్చారు. స్త్రీలకు సమాన హక్కులనేది ప్రతి కమ్యూనిస్టుకు ప్రధానమైన నిర్వివాదమైన అంశమని లెనిన్ భావన' అంటారు క్లారా.

మహిళలు లేకుండా కష్టం

'అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి బోల్షివిక్ పార్టీ మాత్రమే అమూల్యమైన, తర్ఫీదు పొందిన, కాకలు తీరిన కార్యకర్తలను అందజేసింది. అదే సమయంలో చరిత్రలో గొప్ప మార్గదర్శిగా కూడా ఉంది' అని క్లారా అంటే... లెనిన్ చిన్న మందహాసంతో 'అది పూర్తిగా నిజమే. శ్రామిక వర్గ మహిళలు పెట్రో గ్రాడ్‌లోనూ, మాస్కో లోనూ ఇంకా దూరంగా ఉన్న పట్టణాలు, పారిశ్రామిక కేంద్రాల్లోనూ విప్లవం కొనసాగుతున్నప్పుడు అద్భుతమైన కృషి చేశారు. వారు లేకుండా మనం విజయం సాధించగలిగి వుండే వాళ్ళం కాదు. లేదంటే ఉద్యమం విజయవంతం కావడం చాలా కష్టంగా మారేది. వారు పడుతున్న బాధలు, లేమిని సహించ డంలో వారి ఓర్పు ఎటువంటిదో ఒకసారి ఆలోచించండి. వారు సోవియట్‌ను రక్షించుకోవాలనుకొంటున్నారు. కాబట్టే స్వాతంత్ర్యాన్ని, కమ్యూనిజాన్నీ కోరుతున్నారు. కాబట్టే ఇవన్నీ సహించుతున్నారు' అన్నారు.

కమ్యూనిజం ద్వారానే మహిళా విముక్తి

మహిళా ఉద్యమ అవసరం గురించి క్లారాతో మాట్లాడుతూ లెనిన్ 'మొదట మీరు మహిళా ఉద్యమంలో పని చేసే కార్యకర్తల సమావేశంలో ఉపన్యసించి, తర్వాత దాని విషయంపై చర్చించడం మంచిది. దీనిపై ఒక థీసిస్ రాయండి. దాన్నొక కమిటీ పరిశీలిస్తుంది. మహిళల విముక్తి కమ్యూనిజం ద్వారానే సాధ్యమని మీ థీసిసులో నొక్కి చెప్పాలి. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తులకున్నంత కాలం మహిళలు మానవ మాత్రులుగా, సమాజ సభ్యులుగా జీవించజాలరని స్పష్టం చేయాలి. ఈ రెంటికిగల సంబంధం పరిష్కార సాధ్యం కాదని విశదీకరించాలి. మహిళల విముక్తికై సాగే బూర్జువా ఉద్యమాల నుండి మన ఉద్యమాన్ని వేరు చేసుకోవాలి. ఆ విధంగా మహిళా సమస్యలను సామాజిక సమస్యల్లో, కార్మిక వర్గ సమస్యల్లో భాగంగా పరిశీలించడానికి పునాది ఏర్పరచిన వారమవుతాం. తద్వారా దాన్ని శ్రామికవర్గపోరాటంతో, విప్లవంతో దృఢంగా బంధించబడే వీలుపడుతుంది. మహిళా కమ్యూనిస్టు ఉద్యమం ప్రజా ఉద్యమంగా వుండాలి. మొత్తం ప్రజా ఉద్యమంలో అదొక భాగంగా ఉండాలి. ఒక్క శ్రామికోద్యమంలో భాగంగానేగాక, పీడిత ప్రజలందరి ఉద్యమంలో, అణచబడిన వారందరి ఉద్యమంలో, పెట్టుబడిదారీ విధానానికి బలి అయ్యే వారందరి ఉద్యమంలో భాగంగా మహిళా ఉద్యమం ఉండాలి. కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడం శ్రామికవర్గ చారిత్రాత్మక కర్తవ్యం. ఈ వర్గపోరాటంలో మహిళా ఉద్యమ ప్రాముఖ్యత చాలా వుంది. మన పోరాటంలో ముఖ్యంగా కమ్యూనిస్టు నిర్మాణంలో పట్టణాలలోని, పల్లెలోని శ్రామిక మహిళలను లక్షల సంఖ్యలో సమీకరించాలి. మహిళలు లేకుండా నిజమైన ప్రజా ఉద్యమం ఉండజాలదు.



క్లారాజెట్కిన్‌తో లెనిన్


మహిళా కమ్యూనిస్టు ఉద్యమం ప్రజా ఉద్యమంగా వుండాలి. మొత్తం ప్రజా ఉద్యమంలో అదొక భాగంగా ఉండాలి. ఒక్క శ్రామికోద్యమంలో భాగంగానేగాక, పీడిత ప్రజలందరి ఉద్యమంలో, అణచబడిన వారందరి ఉద్యమంలో, పెట్టుబడిదారీ విధానానికి బలి అయ్యే వారందరి ఉద్యమంలో భాగంగా మహిళా ఉద్యమం ఉండాలి. కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడం శ్రామికవర్గ చారిత్రాత్మక కర్తవ్యం.

ప్రత్యేక సంఘాలు అవసరం

నిర్మాణ రంగంలో మనం చేసే కార్యాలు మన సిద్ధాంత అవగాహన నుండి ఉద్భవిస్తాయి. స్త్రీలైనా, పురుషులైనా కమ్యూనిస్టు పార్టీలో సమాన హెూదాగల సభ్యులే. వారందరికీ సమానమైన విధులు, హక్కులు ఉంటాయి. ఈ విషయంలో అభిప్రాయ భేదాలు లేవు. మహిళలను చైతన్యవంతం చేయడం, పార్టీతో వారికి సాన్నిహిత్యం కలిగించి పార్టీ పలుకుబడి కిందికి వారిని తీసుకురావడానికి కమ్యూనిస్టులు క్రమబద్ధంగా పని చేయాలి. నిస్తబ్ధత నుండి బయటపడి కార్యరంగంలో ప్రవేశిస్తున్న మహిళలలో



బోధనా కార్యక్రమం తీసుకురావాలి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన జరిగే శ్రామిక వర్గ పోరాటాల్లో వారిని సమీకరించి విజ్ఞానవంతుల్ని చేయాలి. మిల్లుల్లో పని చేసే స్త్రీలు, తమ కుటుంబాలకు వంటవండే శ్రామిక మహిళలు మాత్రమే కాదు నా దృష్టిలో ఉన్నది. రైతు స్త్రీ, మధ్యతరగతిలో కింది శ్రేణికి చెందిన వివిధ తరగతుల మహిళలు కూడా నా మనసులో ఉన్నారు. వీరంతా పెట్టుబడిదారీ విధానానికి బలౌతున్నవారే. అయితే వారికి రాజకీయాల్లో అభిరుచి ఉండదు. సమాజ వ్యతిరేక మనస్తత్వం, వెనుకబడిన మనస్తత్వం వీరిలో ఎక్కువగా కనిపిస్తుంది. వీరి కార్యకలాపాలు బహుపరిమితమైనవి. వారి జీవిత విధానంలోనూ ప్రత్యేకత ఉంటుంది. కాబట్టి ఇలాంటి మహిళలతో పని చేయడానికి ప్రత్యేక సంఘాలుండాలి. ప్రత్యేక ఆందోళనా పద్ధతులు అవసరం. అంతేగాక నిర్మాణంలో ప్రత్యేక రూపాలు అవసరం. ఇది బూర్జువా 'స్త్రీ జనోద్ధరణ' కాదు. ఆచరణలో విప్లవానికి అత్యావశ్యకమైన విషయం' అంటూ పంచుకున్నారు.



మహిళా ఉద్యమాన్ని తప్పక నిర్మించాలి

ఇంకా ఆమె లెనిన్‌ను గుర్తు చేసుకుంటూ "1920లో నన్ను మర్యాదకపూర్వకంగా పలకరించిన తర్వాత లెనిన్ నాతో మాట్లాడుతూ 'స్పష్టమైన నిశ్చితమైన సిద్ధాంత ప్రాతిపదికపై శక్తివంతమైన అంతర్జాతీయ మహిళా ఉద్యమాన్ని మనం తప్పకుండా నిర్మించాలి. మార్క్సిస్టు సిద్ధాంతం లేకుండా సరియైన ఆచరణ ఉండబోదు, ఇది స్పష్టం. దురదృష్టవశాత్తు రెండవ ఇంటర్నేషనల్ మహాసభ మహిళా సమస్యను చర్చించకుండా వదిలి వేసింది. ప్రస్తావించినా దీనిపై ఒక నిశ్చితమైన వైఖరి అవలంభించడానికి వ్యవధి లేకపోయింది. కమిటీ దశలోనే ఇది నిలిచిపోయింది' అన్నారు.

లెనిన్ శత వర్ధంతి స్మృతిలో...

(మహిళా ఉద్యమం పట్ల లెనిన్ దృక్పథం గూర్చి క్లారాజెట్కిన్ జ్ఞాపకాలు)

ప్రాణ ప్రతిష్ట రోజు సెలవెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనకు సంబంధించిన ఏ విధానమైనా అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ఇష్టాలపై ఆధారపడి ఉండకూడదని వారు తమ పిటిషన్‌లో వాదించారు. దేశభక్తి కలిగిన లేదా చరిత్రకు సంబంధించిన వ్యక్తిని గుర్తు చేసుకునేందుకు సెలవు ప్రకటించవచ్చునని, కానీ సమాజంలో ఓ వర్గాన్ని లేదా మతాన్ని సంతృప్తి పరచడానికి సెలవు ఇవ్వరాదని తెలిపారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం ప్రకారం సెలవులు ప్రకటించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కట్టబెడుతూ 1968 మే 8న హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌ను కూడా న్యాయ శాస్త్ర విద్యార్థులు సవాలు చేశారు. 'విద్యా సంస్థల్ని మూసివేస్తే చదువులకు నష్టం వాటిల్లుతుంది. బ్యాంకింగ్ సంస్థల్ని మూసివేస్తే ఆర్థిక నష్టం జరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాలను మూసివేస్తే పరిపాలనకు సంబంధించిన పనులు నిలిచిపోతాయి' అని పిటిషనర్లు వివరించారు. 'సెలవులు ప్రకటించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాన్ని కల్పించే చట్టం ఏదీ లేదు. లౌకిక స్వభావం కలిగిన మార్గదర్శకాలూ లేవు. ఇలాంటి పరిస్థితుల్లో మెజారిటీ సమాజాన్ని...అది కూడా రాజకీయ ఉద్దేశాల కోసం...ప్రసన్నం చేసుకునేందుకు ఇలాంటి ప్రకటనలు చేయడం అధికార దుర్వినియోగమే అవుతుంది. అది భారత లౌకిక స్వరూపాన్ని నాశనం చేస్తుంది' అని తెలిపారు. రామ మందిర ప్రాణ ప్రతిష్ట కోసం సెలవు ప్రకటించడం ప్రభుత్వ ఖజానాకు ఖర్చే తప్ప మరోటి కాదని, ఇలాంటి వాటిని రాజ్యాంగంలోని 27వ అధికరణ నిషేధిస్తోందని పిటిషనర్లు వాదించారు.

ఆరు గ్యారంటీల అమలు కోసం పోరాడుతాం : కాసం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆరు గ్యారంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల పక్షాన పోరాడుతామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల ముందు ఏవేవో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు? కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు గుంజడం కోసమా? కేసీఆర్ కుటుంబాన్ని అవినీతి నుంచి రక్షించడం కోసమా? అని ప్రశ్నించారు. జ్యుడీషియల్ విచారణ పేరుతో కాలయాపన చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన విషయంలో దశదిశా లేదనీ, పదవుల మోజులో రాజకీయం చేద్దామనే ఆలోచనలో ఆ పార్టీ నేతలున్నట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి లాంటి వారే ప్రకటిస్తున్నారనీ, అలాంటప్పుడు బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అదానీది అవినీతి సొమ్ము అయితే తెలంగాణలో పెట్టుబడుల కోసం అతని కంపెనీతో ఎలా ఒప్పందం చేసుకున్నారని రేవంత్‌రెడ్డిని నిలదీశారు.

కొమురవెల్లిలో కొత్త రైల్వే స్టేషన్

- రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొమురవెల్లి దేవాలయానికి వెళ్లే భక్తుల కోసం కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలపడం పట్ల కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే స్టేషన్ ఏర్పాటులో ప్రత్యేక చొరవ తీసుకున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు శనివారం కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కొమురవెల్లి రైల్వే హాల్ట్ స్టేషన్ కోసం పలుమార్లు లేఖ రాశాననీ, ఈ అంశాన్ని ప్రత్యేకంగా రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. మనోహరాబాద్ - కొత్తపల్లి మధ్యన నిర్మిస్తున్న కొత్త రైల్వే మార్గంలో లక్డారం - దుద్దెడ స్టేషన్ల మధ్యన కొమురవెల్లిలో కొత్త హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కొమురవెల్లి మల్లన్న భక్తులకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన కానుక ఇది అని పేర్కొన్నారు.

మేడారం జాతరకు మరో రూ.30 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

చేయడానికి అవసరమైన నిధులు, ఉన్న అడ్డంకులు, ఫారెస్టు క్లియరెన్స్‌లు, అవసరమైన భూసేకరణపై అధికారులతో చర్చించామన్నారు. నీటిపారుదల శాఖ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పురోగతి, పేరుకుపోయిన బిల్లుల పరిష్కారంపై ఆరాతీశామన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి దేవాదుల తదితర ప్రాజెక్టుల పనులు పూర్తి కాలేదని, ప్రధాన కాలువల నిర్మాణం పూర్తి చేయకుండానే లక్షలాది ఎకరాలకు సాగునీరిచ్చినట్టు గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుందని తెలిపారు.

మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం తాగునీరందడం లేదని చర్చల్లో తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం జారీ చేసిన 59 జీవోతో ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని, వాటిపై దృష్టి సారించి ఆ భూములు పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రజా అవసరాల మేరకు మాస్టర్‌ప్లాన్‌లో సవరణలు చేసి అమలు చేస్తామని ఒక ప్రశ్నకు వివరణనిచ్చారు.

మూడు నెలల్లో 'కాళోజీ' పూర్తి

కాళోజీ కళాక్షేత్రాన్ని పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో 3 నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాల పునర్విభజన సున్నితమైన అంశమని, ప్రజాభిప్రాయం మేరకే మార్పులుంటాయన్నారు. నాడు వైఎస్ఆర్ నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు తగ్గకుండా కొత్తగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే 200 యూనిట్లలోపు వారికి కరెంటు బిల్లులు మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెలలో మేడారం జాతర ఉన్న నేపథ్యంలో ఈనెల 30న మేడారం వచ్చి అక్కడ ఏర్పాట్లను పరిశీలించనున్నట్టు తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని, ఒక్కో నియోజకవర్గంలో రూ.300 కోట్ల మేరకు శంకుస్థాపనలు చేసి పనులు చేయకుండా వదిలేసిందని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో 40 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని విప్ డాక్టర్ రామచంద్రునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించని నాటి మంత్రి కేటీఆర్ ఇప్పుడు సర్పంచ్‌ల బిల్లుల గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు. విలేకరుల సమావేశంలో పరకాల, భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, పాలకుర్తి, వర్ధన్నపేట, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, కె.ఆర్ నాగరాజు, డాక్టర్ మురళీనాయక్, ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆవిర్భావం

మార్చి3,4,5 తేదీల్లో ఖమ్మంలో ఆలిండియా మహాసభ : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యదర్శి పోటు రంగారావు వెల్లడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూడు విప్లవ పార్టీలైన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇన్షియేటివ్ కలిసి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఏర్పడాలని నిర్ణయించాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి, ఐక్యతా సమావేశ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోటురంగారావు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆవిర్భావం సందర్భంగా ఖమ్మంలో మార్చి 3,4,5 తేదీల్లో ఆలిండియా మహాసభను జరుపుతామని తెలిపారు. మూడోతేదీ బహిరంగ సభ ఉంటుందనీ, నాలుగు, ఐదు తేదీల్లో 300 మంది ప్రతినిధులతో మహాసభ జరుగుతుందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని మార్క్స్‌భవన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ..ఆర్ఎస్ఎస్, బీజేపీ దేశాన్ని మత ప్రాదిపదికన చీల్చాలని చూస్తున్నాయని విమర్శించారు. మోడీ సర్కారు ఓవైపు దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నదనీ, మరోవైపు ప్రజలను మతం పేరుతో విభజిస్తున్నదని వివరించారు. నేడు దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను సాధించడం కోసం రాముడినీ, మతాన్నీ పెద్ద ఎత్తున బీజేపీ వాడుకుంటున్నదని విమర్శించారు. మతసామరస్యాన్ని కోరుకునేవారంతా బీజేపీ రాజకీయ కోణాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య భారత దేశం కోసం, సోషలిస్టు



వ్యవస్థ స్థాపన కోసం తాము కృషిచేస్తామన్నారు. ఇతర విప్లవ శక్తులను కలుపుకుని బలమైన విప్లవోద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. సీపీఐ(ఎంఎల్)ఆర్ఐ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం మాట్లాడుతూ.. శత్రువులంతా ఒక్కటవుతుంటే కమ్యూనిస్టు పార్టీలు మాత్రం చీలిపోతుండటం ఆందోళన కరమన్నారు. విప్లవం కోసం పనిచేస్తున్న వారంతా ఒకే పార్టీగా ఐక్యంగా కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ.రామచందర్, కె.రంగారెడ్డి, కె.రమ, వి.కృష్ణ, ఆర్.చంద్రశేఖర్, చంద్ర అరుణ, ఎం. అన్వేష్, ఎస్-ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు దేశాల ఏర్పాటే శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు, ఖండనలు వెల్లువెత్తిన తరుణంలో జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం గాజాలో నెలకొన్న పరిస్థితులు ఎలా వున్నాయో మనందరికీ తెలుసు, ఆ మానవతా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అరకొర చర్యలు సరిపోవు, అక్కడి బాధితులకు తక్షణమే ఉపశమనం కలిగించగల శాశ్వత పరిష్కారం అవసరమని' జై శంకర్ స్పష్టం చేశారు. తీవ్రవాదం, బందీలుగా నిర్బంధించడం కూడా ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని మనం స్పష్టం చేయాల్సి వుందన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లోని సంక్షోభాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆధునిక కాలంలో ఎక్కడ, ఏ సమయంలో ఘర్షణలు చెలరేగినా వాటి పర్యవసానాలు అన్ని చోట్లా వుంటాయని చెప్పారు. స్వేచ్ఛాయుత పాలస్తీనా దేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సురక్షితమైన సరిహద్దుల మధ్య పాలస్తీనియన్లు ప్రశాంతంగా జీవించేలా రెండు దేశాల ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా మనందరం ఉమ్మడిగా కృషి చేయాలని కోరారు. ఏ పక్షం తీరును కూడా జై శంకర్ ఖండించలేదు. పాలస్తీనాకు భారత్ అందించిన మానవతా సాయం గురించి మాత్రమే పునరుద్ఘాటించారు. ఇప్పటివరకు భారత్ 70టన్నుల సాయాన్ని అందించిందన్నారు. వాటిలో 16.5 టన్నుల ఔషధాలు, వైద్య సామాగ్రినే వున్నాయన్నారు. ఇటీవల టెహరాన్‌లో పర్యటించిన జై శంకర్ ప్రాంతీయ పరిస్థితులపై, ఎర్ర సముద్రంలో భద్రతకు ఎదురవుతున్న ముప్పులపై ఇరాన్ నేతలతో చర్చించారు. గాజా యుద్ధం ఆరంభమైనప్పటి నుండి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోడీలు పశ్చిమాసియా ప్రాంత నేతలతో మాట్లాడుతునే వున్నారు. శుక్రవారం బహ్రైన్, ఈజిప్ట్ విదేశాంగ మంత్రులతో జై శంకర్ భేటీ అయ్యారు. పశ్చిమసియాలో నెలకొన్న పరిస్థితులపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం క్యూబా ఉపాధ్యక్షుడు సాల్వడార్ వాల్డెస్ మీసా నామ్ సదస్సులో మాట్లాడుతూ, గాజాపై ప్రస్తుతం ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం ఇప్పటివరకు చరిత్రలో నమోదైన అత్యంత దారుణమైన మారణహోమాల్లో ఒకటని అన్నారు.

కరెంటు బిల్లులు కట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పక్కనబెట్టి ముందు మీరు వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను అమలు చేయండి...' అని హితవు పలికారు. రేవంత్ అహంకారంతో మాట్లాడుతున్నారనీ, అలాంటి వారిని బీఆర్ఎస్ తన ప్రస్థానంలో కొన్ని వేల మందిని చూసిందని వ్యాఖ్యానించారు. మఖలో పుట్టి పుబ్బలో పోయే పార్టీ అంటూ అనేక మంది తమ పార్టీని అవమానించారనీ, కానీ రెండున్నర దశాబ్దాలుగా నికరంగా నిలబడి, రేవంత్ లాంటి అనేక మందిని అది మట్టికరిపించిందని హెచ్చరించారు. తెలంగాణ జెండా (బీఆర్ఎస్)ను ఎందుకు బొందపెడ్తవ్..? తెలంగాణను తెచ్చి, అభివృద్ధి చేసినందుకా..? మీ దొంగ హామీలను ప్రశ్నించినందుకా..? అని నిలదీశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు కలిసి పోయాయనీ, రానున్న పార్లమెంటు తర్వాత కూడా అవి ఇదే రకంగా వ్యవహరిస్తాయని విమర్శించారు. కాంగ్రెస్‌కు రేవంత్ ఒక ఏకనాథ్ షిండేలా మారటం ఖాయమని చురకలంటించారు. ఆయన రక్తమంతా బీజేపీదేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. రేవంత్ ఒక చోటా మోడీలా మారిపోయారు, గతంలో అదానీ గురించి అడ్డగోలుగా మాట్లాడిన ఆయన... ఇప్పుడు రోజూ అదే అదానీ వెంట పడుతున్నారని విమర్శించారు. డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అని పేర్కొన్న సీఎం... ఇప్పుడు వారికి ట్రిపుల్ ఇంజిన్‌గా మారారని దుయ్యబట్టారు. స్విట్జర్లాండ్‌లో అదానీ, రేవంత్ అలయ్ బలయ్ చేసుకున్నారని అన్నారు. వారి ఒప్పందాల అసలు లోగుట్టును బయటపెట్టాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

కిషన్... ఐదేండ్లలో ఏం ఒరగబెట్టారు...?

సికింద్రాబాద్ నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్ర మంత్రి పదవిని చేపట్టిన కిషన్‌రెడ్డి... గత ఐదేండ్ల నుంచి రాష్ట్రానికి ఏం ఒరగబెట్టారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ కడితే, కిషన్‌రెడ్డి మాత్రం సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లోని లిఫ్టులను జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రిగా ఇదే ఆయన చేసిన అతి పెద్ద పనంటూ విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీని నిలువరించేది, అడ్డుకునేది ముమ్మాటికీ బీఆర్ఎస్సేనని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఆ పార్టీతో తమకు గతంలో పొత్తు లేదు, భవిష్యత్తులోనూ ఉండబోదని స్పష్టం చేశారు.

సివిల్ సప్లయిస్‌ను నిర్వీర్యం చేశారు

(మొదటిపేజీ తరువాయి)

గొప్పలు చెప్పుకుందని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ చేతుల్లో పెడితే అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2.82 కోట్ల మంది లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసినప్పుడు కూడా సివిల్ సప్లయిస్ శాఖకు ఇంత అప్పుల భారం లేదని గుర్తు చేశారు. ఎంత భారం ఉన్నా లబ్దిదారులకు ఇబ్బందులు రాకుండా బియ్యం పంపిణీ చేయడంతో పాటు రైతుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. అలాగే విద్యార్థులకు సన్న బియ్యం కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు. పౌరసరఫరా శాఖలో జరిగిన ఆర్థిక ఆరాచకత్వం గురించి వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

ఖర్చు రూ.94 వేల కోట్లు, ఆయకట్టు 40 వేల ఎకరాలు

గత ప్రభుత్వం రూ. 94వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల 40 వేల ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సాగులోకి వచ్చిందని భట్టి విమర్శలు గుప్పించారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.38వేల కోట్లతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు చేపడితే ఇప్పుడు 16లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని వ్యాప్కో సంస్థ తేల్చగా దాన్ని రీడిజైన్ చేసి కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లకు పెంచారని ఆరోపించారు. మేడిగడ్డ డిజైన్‌లోనే భారీ లోపం ఉందని ప్రాథమికంగా గుర్తించామన్నారు. కృష్ణానది పై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీ బోర్డుకు ఈ ప్రభుత్వం అప్పగించలేదని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాతే సీలేరులోని ఏడు మండలాలు ఏపీకి పోయాయన్నారు. డిటెక్టివ్ మైండ్ సెట్ ఉన్నోళ్లే కరెంట్ బిల్లు కట్టొద్దని సూచిస్తారని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేరళ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ధర్నాలో పాల్గొనాలన్న ఎల్‌డీఎఫ్ ఆహ్వానాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ తిరస్కరించింది. యూడీఎఫ్ తీసుకున్న నిర్ణయంపై కేరళ రాజకీయ వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

స్వైటెక్‌కు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్లు వరుసగా ఇంటి బాట పడుతున్నారు. వరల్డ్ నం.1, టాప్ సీడ్ ఇగా స్వైటెక్ (పోలాండ్)కు మూడో రౌండ్లో పరాజయం ఎదురైంది. చెక్ రిపబ్లిక్ అమ్మాయి లిండా నోస్కోవా మూడు సెట్ల పోరులో స్వైటెక్‌కు చెక్ పెట్టింది. అగ్రశ్రేణి క్రీడాకారిణీలు వరుసగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుండగా.. మహిళల సింగిల్స్‌లో మరోసారి కొత్త చాంపియన్‌కు మార్గం సుగమం అవుతోంది!. అలెగ్జాండర్ జ్వెరెవ్, కార్లోస్ అల్కరాజ్,డానిల్ మెద్వదేవ్‌లు మెన్స్ సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు.

- లిండా నోస్కోవా చేతిలో ఓటమి
- మూడో రౌండ్లో నిష్క్రమించిన టాప్ సీడ్
- మెద్వదేవ్, జ్వెరెవ్, అల్కరాజ్ ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్





మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)

మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నం.1కు చుక్కెదురైంది. టైటిల్ ఫేవరేట్‌గా మెల్‌బోర్న్‌లో అడుగుపెట్టిన పోలాండ్ స్టార్ ఇగా స్వైటెక్ వేట మూడో రౌండ్లోనే ముగిసింది. అన్‌సీడెడ్ చెక్ రిపబ్లిక్ అమ్మాయి లిండా నోస్కోవా మూడు సెట్ల సమరంలో స్వైటెక్‌పై సంచలన విజయం సాధించింది. 140 నిమిషాల మహా సమరంలో 3-6, 6-3, 6-4తో స్వైటెక్‌పై లిండా నోస్కోవా గెలుపొందింది. మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో డానిల్ మెద్వదేవ్ (రష్యా), అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) అంచనాలను అందుకున్నారు. మూడో రౌండ్లో అలవోక విజయాలు నమోదు చేసి ప్రీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నారు.

లిండా నోస్కోవా సూపర్

వయసు 19 ఏండ్లు. వరల్డ్ ర్యాంక్ 50. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఎన్నడూ రెండో రౌండ్ దాటలేదు. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌కు చేరుకుంది. ప్రీ క్వార్టర్స్ రేసులో వరల్డ్ నం.1 ఇగా స్వైటెక్‌తో పోరు. చెక్ రిపబ్లిక్ యువ స్టార్‌పై ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. అందుకు తగినట్టుగానే తొలి సెట్ సాగింది. 6-3తో ఇగా స్వైటెక్ తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇక మరో సెట్ నెగ్గితే ప్రీ క్వార్టర్స్‌లో ప్రవేశం. కానీ రెండో రౌండ్లో మొదలైంది లిండా నోస్కోవా మెరుపుల్. 4 ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్ సహా 14 విన్నర్లు సాధించిన లిండా నోస్కోవా.. స్వైటెక్‌కు చెమటలు పట్టించింది. 3-3తో ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్‌ను ఏకపక్షం చేసింది. 4-3తో ఆధిక్యంలో నిలిచిన లిండా నోస్కోవా.. స్వైటెక్ సర్వ్‌ను బ్రేక్ చేసి 5-3తో ముందంజ వేసింది. అలవోకగా తన సర్వ్‌ను నిలుపుకుని 6-3తో రెండో సెట్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. చావోరేవో తేల్చుకోవాల్సిన మూడో సెట్‌లో లిండా నోస్కోవా జోరు కొనసాగించింది. ఆరంభంలోనే స్వైటెక్ సర్వ్‌ను బ్రేక్ చేసింది. 2-1తో ముందంజ వేసింది. స్వైటెక్ సైతం పుంజుకుని బ్రేక్ పాయింట్‌తో సమవుజ్జీగా నిలిచింది. ఈ సమయంలో స్వైటెక్‌ను ఒత్తిడిలో నెట్టి స్వేచ్ఛగా షాట్లు ఆడిన లిండా నోస్కోవా 5-3తో ముందంజ వేసింది. 4-5తో స్వైటెక్ పుంజుకునే ప్రయత్నం చేసినా.. సర్వ్‌ను నిలుపుకున్న లిండా నోస్కోవా సెట్‌తో పాటు ప్రీ క్వార్టర్స్ బెర్త్ దక్కించుకుంది. చెక్ రిపబ్లిక్ అమ్మాయికి ఓ గ్రాండ్‌స్లామ్ ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టడం ఇదే ప్రథమం. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో లిండా నోస్కోవా 10 ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసింది. పాయింట్ల పరంగా 95-91తో పైచేయి సాధించింది. మూడు సెట్ల మ్యాచ్‌లో స్వైటెక్ 13 గేములు గెల్చుకోగా.. లిండా నోస్కోవా 15 గేములు సాధించింది. లిండా నోస్కోవా 35 విన్నర్లతో పైచేయి సాధించగా.. 33 అనవసర తప్పిదాలతో స్వైటెక్ మూల్యం చెల్లించుకుంది. మహిళల సింగిల్స్ ఇతర మ్యాచుల్లో ఊహించిన ఫలితాలే వచ్చాయి. 11వ సీడ్ జెలెనా ఒస్టాపెంకో 1-6, 5-7తో విక్టోరియా అజరెంక చేతిలో పరాజయం పాలైంది. అజరెంక 11 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో సత్తా చాటింది. అమెరికా స్టార్ స్లోనె స్టిఫెన్స్ మూడు సెట్ల మ్యాచ్‌లో నిరాశపరిచింది. 7-6(10-8), 1-6, 4-6తో అనా కలిన్‌స్కాయకు ప్రీ క్వార్టర్స్ బెర్త్ కోల్పోయింది. ఎలినా స్విటోలినా 6-2, 6-3తో గోలుబిక్‌పై గెలుపొందింది. జాస్మైన్ పాలోని 7-6(7-1), 6-4తో అనా బ్లింకోవాను ఓడించింది. చైనా అమ్మాయిల పోరులో వాంగ్ యఫాన్‌పై 6-4, 2-6, 7-6(10-8)తో జెంగ్ గెలుపొందింది. ఫ్రాన్స్ అమ్మాయిల డీలో క్లారా బురెల్‌పై ఒసియనె డొడిన్ 6-2, 6-4తో విజయం సాధించింది. ఎమ్మా నవారో 2-6, 6-2, 1-6తో దయాన చేతిలో పరాజయం చెందింది.

అల్కరాజ్, మెద్వదేవ్ జోరు

పురుషుల సింగిల్స్‌లో స్టార్ ఆటగాళ్లు మెప్పిస్తున్నారు. ఓ ఎండ్‌లో నొవాక్ జకోవిచ్ దూసుకెళ్తుండగా, మరో ఎండ్ నుంచి యువ స్టార్స్ జోరు చూపిస్తున్నారు. రెండో సీడ్, స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ గార్ఫియ ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. మూడో రౌండ్లో చైనా ఆటగాడు షాంగ్‌పై 6-1, 6-1, 1-0తో విజయం సాధించాడు. తొలి రెండు సెట్లను అలవోకగా నెగ్గిన అల్కరాజ్ మూడో సెట్‌లో 1-0తో ఉండగా.. చైనా ఆటగాడు వాకోవర్ ఇచ్చాడు. 3 ఏస్‌లు, ఆరు బ్రేక్ పాయింట్లతో మెరిసిన అల్కరాజ్.. పాయింట్ల పరంగా 59-25తో ఆధిపత్యం చూపించాడు. మూడో సీడ్, రష్యా ఆటగాడు డానిల్ మెద్వదేవ్ వెనక్కి తగ్గటం లేదు. మూడో రౌండ్ మ్యాచ్‌లో ఫెలిక్స్ ఆగర్‌పై 6-3, 6-4, 6-3తో వరుస సెట్లలో విజయం సాధించాడు. 8 ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన మెద్వదేవ్.. 91-75తో పాయింట్ల పరంగా పైచేయి సాధించాడు. ఆరో సీడ్, జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ సైతం మూడు సెట్లలో గెలుపొందాడు. 6-2, 7-6(7-4), 6-2తో అలెక్స్ మైకల్‌సన్‌ను ఓడించాడు. 11 ఏస్‌లు సంధించిన జ్వెరెవ్.. ఐదు బ్రేక్ పాయింట్లతో ప్రత్యర్థిని చిత్తు చేశాడు. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్‌ను 7-4తో సొంతం చేసుకుని సత్తా చాటాడు. గ్రిగర్ దిమిత్రివ్ మూడో రౌండ్లో నునో బోర్గెస్ చేతిలో ఓడాడు. 6-7(3-7), 6-4, 6-2, 7-6(8-6)తో నునో పైచేయి సాధించాడు. 11వ సీడ్ కాస్పర్ రూడ్‌కు పరాజయం తప్పలేదు. కామెరూన్ నోరీ 6-4, 6-7(7-9), 6-4, 6-3తో రూడ్‌ను మట్టికరిపించాడు. 9వ సీడ్ హుబర్ట్ 3-6, 6-1, 7-6(7-4), 6-3తో విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ఆర్థర్ 6-3, 6-3, 6-1తో టాలన్‌పై వరుస సెట్లలో గెలుపొందాడు. టామీ పాల్ 4-6, 6-3, 6-2, 6-7(7-9), 0-6తో మియోమిర్ చేతిలో కంగుతిన్నాడు.

పకడ్బందీగా ఏర్పాట్లు



- 25వేల మంది స్కూల్ స్టూడెంట్స్‌కు ఉచితం
- ఉప్పల్ టెస్టుపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్

నవతెలంగాణ-హైదరాబాద్

జనవరి 25 నుంచి ఉప్పల్ స్టేడియంలో జరుగనున్న భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు మ్యాచ్‌కు పకడ్బందిగా ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు తెలిపారు. 'హెచ్‌సీఏ కొత్త అపెక్స్ కౌన్సిల్ ఎన్నిక అనంతరం జరుగుతున్న తొలి క్రికెట్ మ్యాచ్ ఇది. టెస్టు క్రికెట్‌ను పండుగలా నిర్వహించేందుకు హెచ్‌సీఏ సరికొత్త నిర్ణయాలు తీసుకుంది. ఐదు రోజుల పాటు 25 వేల మంది స్కూల్ స్టూడెంట్స్‌కు స్టేడియంలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఇచ్చాం. స్టూడెంట్స్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా మధ్యాహ్న భోజనం, తాగునీరు ఉచితంగా అందిసున్నాం. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత సాయుధ దళాల కుటుంబ సభ్యులకు సైతం ఉచిత ప్రవేశ అవకాశం కల్పిస్తున్నాం. ఇందుకోసం హెచ్‌సీఏలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం. డిజిటల్ యుగంలో ఆఫ్‌లైన్ టికెట్లు అమ్మకూడదని హెచ్‌సీఏ విధానపర నిర్ణయం. అందుకే టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నాం. టికెట్ల కోసం అభిమానుల నుంచి అపూర్వ స్పందన లభించటం సంతోషకరం. స్టేడియం నలువైపులా పైకప్పు, నూతనంగా ఏర్పాటు చేసిన కుర్చీలు, భారీ ఎల్‌ఈడీ తెరలు, ఆధునాతన ఎల్‌ఈడీ ఫ్లడ్‌లైట్ల సొబగులు, దృశ్యరూపకమైన మైదానం టెస్టు మ్యాచ్ సందర్భంగా అభిమానులకు మరుపురాని అనుభూతులు అందిస్తుందని' జగన్‌మోహన్ రావు తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు ఆర్. దేవరాజ్, బసవరాజు, శ్రీనివాసరావు, దల్జీత్ సింగ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ హ్యాట్రిక్

సిక్కింపై ఇన్నింగ్స్ తేడాతో గెలుపు



నవతెలంగాణ-హైదరాబాద్ :

రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ హ్యాట్రిక్ విజయం సాధించింది. వరుసగా మూడో మ్యాచ్‌ను రెండు రోజుల్లోనే ముగించింది. బోనస్ పాయింట్ విజయంతో ప్లేట్ గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలుత సిక్కిం తొలి ఇన్నింగ్స్‌లో 79 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 463/4 పరుగుల భారీ స్కోరు చేసింది. తన్మయ్ అగర్వాల్ (137), కెప్టెన్ తిలక్ వర్మ (103 నాటౌట్), రాహుల్ సింగ్ (83), రోహిత్ రాయుడు (75), చందన్ సహాని (54) రాణించారు. 384 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో డిక్లరేషన్ ప్రకటించిన హైదరాబాద్.. రెండో ఇన్నింగ్స్‌లో సిక్కిం కథను 48.3 ఓవర్లలో ముగించింది. సిక్కిం 186 పరుగులకే కుప్పకూలగా.. హైదరాబాద్ ఇన్నింగ్స్ 198 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు కూల్చిన తనయ్ త్యాగరాజన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఆ బాధ్యతను యండమూరికి అప్పగించా : చిరు



'నా సినిమా కెరీర్ ప్రారంభంలో ఎక్కువగా యండమూరి వీరేంద్రనాథ్ రచనలే ఉన్నాయి. అవి నా కెరీర్‌కు ఎంతో దోహదపడ్డాయి. ఇప్పుడు అయన నా బయోగ్రఫీ రాస్తాను అని అనటం నాకు చాలా సంతోషంగా ఉంది' అని చిరంజీవి చెప్పారు. విశాఖపట్నంలో లోక్ నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి, ఏఎన్నార్ శత జయంతి కార్యక్రమం జరిగింది. దీనికి చిరంజీవి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో రచయిత యండమూరి వీరేంద్ర నాథ్‌కి సాహితీ పురస్కారంతో పాటు రెండు లక్షల రూపాయల నగదును బహూకరించారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నిర్వహించిన ఈ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ, 'నా జీవిత చరిత్ర రాసే బాధ్యతను రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కి అప్పగించారు. నా ఎదుగుదలకి యండమూరి రాసిన రచనలు ఎంతో ఉపయోగపడ్డాయి. అటువంటి యండమూరి వల్లే నాకు మెగాస్టార్ అనే బిరుదు వచ్చింది. ఆయన రాసిన 'అభిలాష' నవల గురించి మొదట చెప్పింది మా అమ్మగారు. ఆ తరువాత నిర్మాత కెఎస్ రామారావు ఆ నవలని అదే పేరుతో సినిమాగా తీశారు. దానికి కోదండరామి రెడ్డి దర్శకత్వం, ఇళయరాజా పాటలు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. ఆ సినిమా నా కెరీర్‌ని సుస్థిర పరుచుకోవడానికి ఎంతో ఉపయోగపడింది. ఆ తరువాత యండమూరి రాసిన ఇంకో నవల 'ఛాలెంజ్'ని కూడా సినిమాగా తీస్తే, అది అప్పటి యువకుల మీద ఎంతో ప్రభావం చూపించింది. ఎన్టీఆర్, ఏఎన్నార్ తెలుగు చిత్ర పరిశ్రమకి రెండు కళ్ళు లాంటివారు. వాళ్ళతో కలిసి నేను నటించటం నా అదృష్టంగా భావిస్తాను. ఎన్టీఆర్‌తో 'తిరుగులేని మనిషి' సినిమా చేస్తున్నప్పుడు నేను స్వయంగా పోరాట సన్నివేశాలు చేస్తుంటే, అది చూసి ఆర్టిస్టు జీవితం చాలా విలువైనది, రిస్క్ చెయ్యకూడదు, ఏదైనా జరిగితే నిర్మాత నష్టపోతాడు అని చెప్పారు. అప్పట్లో అన్నీ నేనే చెయ్యాలని అనుకుడేవాడిని, ఆ తరువాత 'సంఘర్షణ' సినిమా టైంలో గాయపడి, ఆరు నెలలు సినిమాలకి దూరంగా ఉన్నాను. పెద్దవాళ్ళు ఇలాంటివి ఊహించి ముందే చెప్తారు అని అప్పుడు అనుకున్నాను. అలాగే ఎన్టీఆర్ విలాసవంతమైన కార్లు, వస్తువులు కొనడం కన్నా ఇళ్ళు, ఇళ్ల స్థలాలు కొనమని సలహా ఇచ్చేవారు. ఆయన సలహాతో కొనుక్కున్న ఇళ్ళు, స్థలాలే ఈరోజు నా కుటుంబాన్ని కాపాడుతున్నాయి' అని చెప్పారు.

థ్రిల్ చేసే గేమ్ ఆన్



గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. సీనియర్ నటులు మధుబాల, ఆదిత్య మీనన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి ఈ సినిమాను నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 2న గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శనివారం ప్రసాద్ లాబ్స్‌లో ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్మాత రవి కస్తూరి మాట్లాడుతూ, 'ఇది నా ఫస్ట్ ప్రాజెక్ట్. నేను ఆస్ట్రేలియాలో ఉంటాను. గీతానంద్ నా క్లాస్‌మేట్. మంచి కథతో ఈ సినిమాను స్టార్ట్ చేసాం. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా రూపొందించాం. ప్రేక్షకులను ఎంగేజ్ చేసేలా సినిమా ఉంటుంది. నవాబ్ గ్యాంగ్స్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. అవి అందర్నీ ఆకట్టుకునేలా ఉంటాయి. ఇలాంటి కథ ఇప్పటివరకు తెలుగు తెరపై రాలేదు' అని చెప్పారు.

'కమర్షియల్ స్క్రిప్ట్‌ని రా అండ్ రస్టిక్‌గా చిత్రీకరించాను. పూరి జగన్నాథ్ ఫ్యాన్‌గా ఈ సినిమాను డైరెక్ట్ చేశాను. ఈ చిత్రంలో పాత్రలన్నీ గ్రే షేడ్‌లో ఉంటాయి. ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. తన జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి రియల్ టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు?, గేమ్‌లోని టాస్క్‌ను ఎలా స్వీకరించాడు?, అసలు ఆ గేమ్ ఎంచుకోవడానికి కారణం ఏమిటి?, ఈ గేమ్ ఎవరు ఆడిస్తున్నారు? అనే అంశాలతో ఈ సినిమా తెరకెక్కింది. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి. కచ్చితంగా మా సినిమా ప్రేక్షకులకు కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది' అని దర్శకుడు దయానంద్ అన్నారు. నేహా సోలంకి మాట్లాడుతూ, 'ఇలాంటి పాత్రను గతంలో నేనెప్పుడూ చేయలేదు. మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని తెలిపారు.

సమాజానికి స్ఫూర్తినిచ్చే కంచర్ల



కంచర్ల ఉపేంద్ర, మీనాక్షి జైస్వాల్

సమ సమాజం, నవ సమాజ నిర్మాణానికి స్ఫూర్తినిచ్చే సినిమాలు ఎన్నో వచ్చాయి. ఆ కోవకు చెందిన కథాంశంతో 'కంచర్ల' చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నారు.ఎస్.ఎస్.ఎల్.ఎస్ క్రియేషన్స్ పతాకంపై కంచర్ల ఉపేంద్ర హీరోగా, మీనాక్షి జైస్వాల్, ప్రణీత హీరోయిన్లుగా రెడ్డెం యాదకుమార్ దర్శకత్వంలో కంచర్ల అచ్యుత రావు నిర్మిస్తున్న ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తిచేసుకుని త్వరలో విడుదలకు ముస్తాబు అవుతోంది.

నిర్మాత కంచర్ల అచ్యుత రావు మాట్లాడుతూ, 'ప్రస్తుతం పాటల చిత్రీకరణను కేరళ, గోవా, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాలలో జరుపుతున్నాం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. యువత రాజకీయాల్లోకి రావాలని, భూస్వాముల దగ్గర ఉన్న భూమి పేద ప్రజలకు పంచాలన్నది ఈ చిత్ర ప్రధానాంశం. దీనికి కమర్షియల్ అంశాలను మేళవించి, ప్రేక్షకులను అలరింపజేసేలా చిత్రాన్ని మలచడం జరుగుతోంది' అని చెప్పారు.

'ఇటీవల నేను నటించిన 'ఉపేంద్ర గాడి అడ్డా' చిత్రంతో ప్రేక్షకులకు దగ్గరైన నేను ఈ చిత్రం ద్వారా మరింత దగ్గరవుతాను అని నమ్మకంగా చెప్పగలను. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా మా నాన్నతీస్తున్న ఇంకో చక్కటి చిత్రమిది' అని హీరో కంచర్ల ఉపేంద్ర అన్నారు.

దర్శకుడు రెడ్డెం యాద కుమార్ మాట్లాడుతూ, 'సామాజిక స్పృహతో సమాజాన్ని జాగృతం చేసే అంశాలను ఇందులో పొందుపరిచాం' అని తెలిపారు.

సుమన్, అజయ్ ఘోష్, కాశీ విశ్వనాథ్, సుధ, రాజా రవీంద్ర, సుమన్ శెట్టి, దువ్వాసి మోహన్, జబర్దస్త్ దొరబాబు, ప్రకాష్ తదితరులు నటిస్తున్నారు.

అవన్నీ తీపి జ్ఞాపకాలే..



కాలభైరవ

హనుమంతుని కథలు మన బాల్యంలో ఒక భాగంగా ఉన్నాయి. అంతేకాదు అవి తరతరాలకు స్ఫూర్తినిస్తాయి. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ది లెజెండ్ ఆఫ్ హనుమాన్ కోసం హనుమాన్ చాలీసా అన్స్ వంటి అత్యంత శక్తివంతమైన శ్లోకాల్లో ఒకదానికి జీవం పోస్తూ, ఆస్కార్-విజేత, సంగీత దర్శకుడు, గాయకుడు కాల భైరవ తన తెరవెనుక క్షణాల గురించి, ఈ కొత్త సంవత్సరంలో పాట పాజిటివిటీ ధైర్యాన్ని ఎలా తీసుకొస్తుంది అనే దాని గురించి మాట్లాడారు.

'ప్రారంభ కంపోజింగ్ దశ నుండి పూర్తి అయ్యే వరకు ట్రాక్‌లో పని చేస్తూ మేము చాలా తీపి జ్ఞాపకాలను మిగుల్చుకున్నాం. అయినప్పటికీ ఇప్పటికే ఉన్న అన్ని పాటలు, చాలా మంది ఇష్టపడే జనాదరణ పొందిన వాటి నుండి మరింత ప్రత్యేకంగా ఉండే పాటకు కొత్త ట్యూన్‌ను రూపొందించడానికి ప్రయత్నించడం అతిపెద్ద సవాలుగా మారింది. అలాగే, హనుమాన్ చాలీసా అన్స్ ఎల్లప్పుడూ చాలా మందికి బలం, ధైర్యం ఇస్తుంది. ఈ పాటతో 2024 సంవత్సరాన్ని ప్రారంభించడం ద్వారా ప్రజలు బలం, ధైర్యం స్ఫూర్తిని కోరుకునే ప్రదేశాలలో ఇది ఒకటిగా మారుతుందని నేను ఆశిస్తున్నాను' అని కాలభైరవ చెప్పారు.

నవచిత్రం

భిన్న కాన్సెప్ట్‌తో సరిపోదా శనివారం



నాని

నాని, వివేక్ ఆత్రేయ రెండోసారి కలసి పని చేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న 'సరిపోదా శనివారం'లో నాని కంప్లీట్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో అలరించనున్నారు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ థియేట్రికల్ రైట్స్‌ను ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎస్‌వీసీ సొంతం చేసుకుంది. రెండు తెలుగు రాష్ట్రాలలో చాలా గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది.

ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో ఎస్ జే సూర్య కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న చిత్రీకరణలో ఆయన జాయిన్ అయ్యారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర డైనమిక్‌గా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే విడుదలైన 'సరిపోదా శనివారం' అన్‌చెయిన్డ్ వీడియోకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇందులో నాని రగ్గడ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించనున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తోంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ పాన్ ఇండియాలో చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మురళి జి, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, ఫైట్స్: రామ్-లక్ష్మణ్.

హీరోకి శాపం ఉంటే?



యష్ పూరి హీరోగా నటించిన కొత్త సినిమా 'హ్యాపీ ఎండింగ్'. ఈ చిత్రంలో అపూర్వ రావ్ హీరోయిన్‌గా నటించింది. హమ్స్ టెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 2న గ్రాండ్‌గా థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ను డైరెక్టర్ వేణు ఊడుగుల చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ అనిల్ పల్లాల మాట్లాడుతూ, 'ఇదొక కమింగ్ ఏజ్ మూవీ. సౌండ్, విజువల్, మేకింగ్..ఇలా ప్రతి అంశంలో ఈ సినిమా మీకు కొత్తగా అనిపిస్తుంది. ట్రైలర్‌లో మీకు కొంచెం అడల్ట్ కంటెంట్ కనిపించవచ్చు. కానీ సినిమా చూస్తే అది ఎందుకు ఉందో తెలుస్తుంది. సెక్స్ అనే విషయం గురించి ఇప్పటికీ మనదేశంలో ఓపెన్‌గా మాట్లాడుకోలేకపోతున్నాం. కానీ ఓపెన్‌గా మాట్లాడుకునే మైండ్ సెట్ రావాలి. సినిమా అవుట్‌పుట్ పట్ల మేము హ్యాపీగా ఉన్నాం' అని తెలిపారు.

హీరోగా నేను చేస్తున్న రెండో సినిమా ఇది. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి నిరభ్యంతరంగా మా సినిమా చూడొచ్చు. మాది చిన్న సినిమా కాదు మంచి సినిమా' అని హీరో యష్ పూరి చెప్పారు. డైరెక్టర్ కౌశిక్ భీమిడి మాట్లాడుతూ, 'మహాభారతం చదువుతున్నప్పుడు అందులో అనేక శాపాల గురించి ఉంటుంది. అలా ఒక శాపం హీరోకు ఉంటే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో మోడ్రన్ అప్రోచ్‌తో చేసిన సినిమా ఇది' అని చెప్పారు. హీరోయిన్ అపూర్వ రావ్ మాట్లాడుతూ, 'మనకు సాధారణంగా కనిపించే విషయాలు హీరోని భయపెడుతుంటాయి. అతనో అమ్మాయిని కలుస్తాడు. ఆమే తన ప్రేయసి అవుతుంది. ఈ భయాల మధ్య ఆ అమ్మాయితో తన ప్రేమను ఎలా కొనసాగించాడు అనేది ఈ సినిమా కథ. ఈ సినిమాలో బోల్డ్ పర్‌ఫార్మెన్స్ చేయలేదు. కథే బోల్డ్‌గా ఉంటుంది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.